

ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


## డిటిఓ వెంకన్నపై దూసుకెళ్లిన లారీ

08

- అక్కడికక్కడే దుర్మరణం
- భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో దారుణం


సంపుటి 09, సంచిక: 203 | మంగళవారం | 23-06-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ రాజీనామా!

- దివాళా తీసిన పార్టీని 14 ఏళ్ళ తర్వాత గెలిపించా
- నేను సమర్థుడిని కాదన్న పార్టీ విశ్వాసాన్ని సంతోషంగా అంగీకరిస్తున్నా
- ఉత్తమ భర్తగా,ఉత్తమ తండ్రిగా ఉంటానని ప్రకటన

**లండన్ :** పార్టీలో అంతర్గతంగా వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక, మిత్రులు చెప్పినవిధంగా సగౌరవంగా తప్పుకోవాలని నిర్ణయించుకున్న బ్రిటన్ ప్రధానమంత్రి సర్ కీర్ స్టార్‌మర్ (64) రెండేళ్ళ పదవీకాలాన్ని కూడా పూర్తిచేయకుండానే ఆ బాధ్యతలనుండి వైదొలగారు. స్టార్‌మర్ పదవి నుండి వైదొలగుతారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఆదివారం రాత్రి సంచలన వ్యాఖ్యలు చేయడం అందరినీ ఆశ్చర్యపరచింది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తన లేబర్‌పార్టీని ముందుకు నడిపించడానికి తాను సమర్థవంతమైన నాయకుడిని కాదనే విషయాన్ని పార్టీ విశ్వసించడాన్ని తాను సంతోషంగా అంగీకరిస్తున్నానని టెన్ డౌనింగ్ స్ట్రీట్ నివాసం వెలుపల స్టార్‌మర్ తరువాయి 8లో

## హైదరాబాద్ మెట్రో – 2

# విస్తరణకు సహకరించండి

- ఐఆర్‌ఎఫ్‌సి రుణం విడుదల, పెండింగ్ సమస్యలు పరిష్కరించండి
- ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సి) రుణం విడుదలతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కలిసి రాష్ట్రానికి సంబంధించిన కీలక రైల్వే, మెట్రో ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి తరువాయి 8లో

## 60 రోజుల్లో తుది ఒప్పందానికి

# బృహత్తర ప్రణాళిక

### ఐఎఇఎ అణుశక్తి తనిఖీలకు అంగీకరించిన ఇరాన్

- లెబనాన్ యుద్ధ నియంత్రణకు ప్రత్యేక బృందం
- ఇరాన్ చమురుపై ఆంక్షలు తొలగింపు
- స్తంభించిన ఆస్తుల విడుదలకు అంగీకారం
- అమెరికా– ఇరాన్ మధ్య మొదటి విడత చర్చలుపూర్తి



**బర్గెన్‌స్టాక్:** ఇరాన్–అమెరికా మధ్య 60 రోజుల నిర్ణీత వ్యవధిలో జరిగే చర్చల్లో తుది ఒ ప్పందం చేసుకోవడానికి వీలుగా ఒక బృహత్తర ప్రణాళిక అమలు చేసేందుకు రెండు దేశాలూ స్విట్జర్లాండ్ చర్చల్లో అంగీకరించాయి. దీంతోపాటు లెబనాన్‌లో యుద్ధ నియంత్రణ, పర్యవేక్షణకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసేందుకు ఇరు దేశాల ప్రతినిధులు అంగీకరించా రు. ఇరాన్‌లో అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) అధికారుల తనిఖీలు చేయడం, స్తంభింపజేసిన ఇరా న్ ఆస్తుల విడుదలపై కూడా రెండు దేశాలూ పరస్పర అంగీకారాలకు వచ్చాయి. మధ్యవర్తి దేశాలు పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు ఈ విష యం వెల్లడించారు. ఎలాగైనా తుది ఒప్పందాన్ని సాధించేందుకు కృషి చేస్తామని వారు చెప్పారు. సాంకేతిక చర్చలు ఇంకా వారం రోజులు కొనసాగుతాయి. కాగా ప్రాథమిక ఒప్పందం తర్వాత రెండు దేశాలమధ్య మొదటి విడత చర్చలు విజయవంతంగా ముగియడంతో చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. హోర్ముజ్ జలసంధిలో కూడా చమురు ట్యాంకర్ల రాకపోకల జోరు కూడా పెరిగింది. బ్రెంట్ క్రూడాయి ల్ ధర బ్యారెల్‌కు 79.15 డాలర్లకు తగ్గిపోగా, డబ్ల్యుటిఐ ముడి చమురు ధర కూడా 26.4 డాలర్లకు చేరుకుంది. మొదటి విడత చర్చలలో బ్రహ్మాండమైన పురోగతి వచ్చిందని, భవిష్యత్ చర్చలకు ఒక మంచి పునాదిగా బర్గెన్‌స్టాక్ సం భాషణలు దోహదం చేస్తాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ప్రశంసించారు. ఖతార్ ప్రధాన మంత్రి–విదేశాంగమంత్రి షేక్ మహ్మ ద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ బిన్ జస్సిమ్ అల్ థానీ కూడా అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందాలు, అంగీకారాలను ప్రశంసించారు. యుద్ధం ము గించేందుకు ఇరు దేశాలు ఒక అవగాహనకు వచ్చి ఎంఓయుపై సంతకాలు చేసి ముందుకు వెళుతున్నాయన్నారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) ఇన్‌స్పెక్టర్లు ఇరాన్ లోపలికి ప్రవేశించి తనిఖీలు నిర్వహించడానికి మొదటి విడత చర్చల్లో ఆ దేశ ప్రతినిధులు అంగీకరించారని జె.డి.వాన్స్ ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయిలో ఇరాన్ అణు కార్యక్రమాన్ని పర్యవేక్షించడమే ఈ తనిఖీల లక్ష్యమని చెప్పారు. ''ఇస్లామాబాద్ ఒప్పందం(ఎంఓయు)'' ప్రాతిపదికపై అమెరికా–ఇరాన్ తరువాయి 8లో

## అన్ని వసతులతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను

# అభివృద్ధి చేయండి

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్:

భారత వాయు సేన(ఐఎఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టులలో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి సిఎం తరువాయి 8లో



## ఆర్‌డిఎస్, తుంగభద్ర జలాల్లో

# వాటాపై రాజీపడం

- ఆర్‌డిఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం
- అంతర్రాష్ట్ర వేదికలపై తెలంగాణ వాదనలు బలంగా వినిపించేందుకు కష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నీటి వాటాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్), తుంగభద్ర డ్యామ్ అంశాలపై మంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ సంజీవ రెడ్డి, నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, తరువాయి 12లో

## పాఠశాల విద్యా కార్యాలయం

# ముట్టడి.. ఉద్రిక్తత..

విద్యార్థి సంఘనేతల అరెస్ట్




- ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి
- ప్రైవేటు విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం' ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యా కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్లిన ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ముందట ధర్నాకు దిగారు. నిరసనలో భాగంగా ఎఐఎస్‌ఎఫ్ శ్రేణులు కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించడంతో వారి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో కొద్ది సేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఎఐఎస్‌ఎఫ్ నాయకులను అరెస్టు చేసి అక్కడి నుంచి నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తరువాయి 12లో




## ఆ రహదారికి

# ట్రంప్ పేరు పెట్టొద్దు

- ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే విరమించుకోవాలి
- లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం
- వామపక్ష పార్టీనాయకుల హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాది అని, అలాంటి వ్యక్తి పేరును హైదరాబాద్‌లోని వీధికి పెట్టే ప్రతిపాదనను సిఎం రేవంత్ రెడ్డి వెంటనే విరమించుకోవాలని వామపక్షాల పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.హైదరాబాదులోని అమెరికన్ కాన్సులేట్ వద్ద ఉన్న ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరువాయి 8లో



# 30న రైతు ఆశీర్వాద సభ

- సభలో రైతు భరోసా నిధుల విడుదల
- 28, 29న అగ్రి ఎక్స్‌పో
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- సిఎం బహిరంగ సభా స్థలి పరిశీలన

ప్రజాపక్షం/ ఖమ్మం/చింతకాని

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఈ క్రమంలో జూన్ 30న రైతాంగ ఆశీర్వాద సభను చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేస్తారని ఆయన తెలిపారు. సోమవారం బహిరంగ సభా స్థలిని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి పరిశీలించారు. రెండు మూడు ప్రాంతాలను పరిశీలించిన భట్టి విక్రమార్క చివరకు జగన్నాథ పురం వద్ద ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విక్రమార్క తరువాయి 12లో

## హత్యా.. ఆత్మహత్యా..

### ఒకే ఇంట్లో నలుగురు మృతి

- దంపతులతో పాటు ఇద్దరి కుళ్లిన మృతదేహాలు..
- కుటుంబంలో ఒకరు మిస్సింగ్
- నల్లగొండ తెలంగాణ కాలనీలో కలకలం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి శరత్ చంద్ర పవార్

ప్రజాపక్షం/నల్లగొండ

పట్టణంలోని సాగర్ రోడ్డులోని తెలంగాణ కాలనీలో ఆదివారం వెలుగుచూసిన ఘటన తీవ్ర కలకలం రేపింది.ఒకే ఇంట్లో నలుగురు వ్యక్తుల మృతదేహాలు కుళ్లిన స్థితిలో లభ్యమవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మృతులను మహమ్మద్ సుల్తాన్, ఆయన భార్య హసీనా,అలాగే మరో ఇద్దరిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాలు పూర్తిగా తరువాయి 12లో

## లక్నో యానిమేషన్ సెంటర్‌లో

# భారీ అగ్నిప్రమాదం



**15 మంది** విద్యార్థులు మృతి, మరో నలుగురికి గాయాలు

- శిథిలాల కింద చిక్కుకుపోయిన పలువురు
- ప్రాణాలు కాపాడుకునేందుకు భవనం పైనుంచి దూకిన విద్యార్థులు

**లక్నో :** దక్షిణ ఢిల్లీలోని ఒక రెస్టారెంట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించి 20 మందికి పైగా మృతిచెందిన ఘటనమరవక ముందే ఉత్తరప్రదేశ్‌లో సోమవారం పెను విషాదం చోటు చేసుకుంది. లక్నోలో రద్దీగా ఉండే నివాస ప్రాంతంలో నిర్వహిస్తున్న యానిమేషన్ సెంటర్‌గల మూడు అంతస్తు వాణిజ్య భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. 15 మంది విద్యార్థులు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. భవన శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. పెంపుడు జంతువుల క్లినిక్ కూడా ఉన్న ఈ భవనంలో మంటలు వేగంగా వ్యాపిస్తుండగా అనేక మంది బయటకు దూకేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అలీగంజ్ ప్రాంతంలోని ఉషా మెహతా మార్గ్‌లో ఉన్న ఈ భవనంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగినట్లు సమాచారం అందగా, మంటలను అదుపు చేయడానికి హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్ వాహనంతో సహా పద్నాలుగు అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించారు. 'యానిమేషన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం అకస్మాత్తుగా జరిగింది. ప్రమాదానికి గల కారణాలు కచ్చితంగా చెప్పలే ము. మంటలు చెలరేగినప్పుడు విద్యార్థులు తరువాయి 12లో

# బెంగాల్, మహారాష్ట్ర తదుపరి పంజాబ్...

పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అనేక మాయపాయాలతో అధికారాన్ని చేజిక్కించుకోవటమే కాదు, ప్రతిపక్ష తృణమూల్ కాంగ్రెస్‌ను విజయవంతంగా ఛిద్రం చేస్తున్నది. 80లో 60మంది ఎమ్మెల్యేలు, 28మంది లోక్‌సభ ఎంపిల్లో 20మంది టిఎంసిని వీడటంలో బిజెపి చాణక్యం ఉంది. జిల్లాల్లో దాడులతో పలువురు నాయకులు రాజీనామా చేస్తున్నారు. అవినీతి కేసులతో అరెస్టు చేస్తున్నారు. రూ.400కోట్లకు పైగా తృణమూల్ కాంగ్రెస్ అక్కౌంట్లను ప్రత్యర్థుల ఫిర్యాదుపై హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ స్తంభింపజేసింది. మమతా బెనర్జీకి చుక్కలు చూపిస్తున్నారు. తాజాగా మహారాష్ట్రలో బిజెపి మిత్రపక్షం శివసేన (షిండే) 'ఆపరేషన్ టైగర్' పేరుతో శివసేన (యుబిటి) లోక్‌సభ సభ్యులు 9మందిలో ఆరుగురిని (ఫిరాయింపుల నిరోధక చట్టం కోరలనుంచి తప్పించుకునేందుకు మూడింట రెండు వంతులు గోడదూకేటట్లు జాగ్రత్త తీసుకున్నారు) తనలో ఐక్యం చేసుకుంది. వారం రోజులపైబడి వార్తల్లో ఉన్న ఈ ఫిరాయింపు వ్యవహారాన్ని సఫలం చేయటంలో బిజెపి నాయకత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావీస్ పాత్ర విస్మరించరానిది. అదీ అధికారానికున్న మహత్తు. తెరవెనుక ఏమి జరిగిందనే శల్యపరీక్ష కన్నా ఫలితమే ముఖ్యం కదా! ఆ ఆరుగురు సోమవారం మధ్యాహ్నం షిండేను కలిసి ఆయన పార్టీలో చేరారు. వారిని ఆహ్వానించిన షిండే తమదే అసలు సిసలు శివసేన అని, బాబాసాహెబ్ బాల్ థాక్రే సిద్ధాంతానికి తామే వారసులమని ప్రకటించారు. రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం బిజెపి నాయకత్వం చేస్తున్న తెరమరుగు ప్రయత్నాల్లో ఇది మరో పర్వం. మధ్యప్రదేశ్‌లో దుర్మార్గంగా కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావటం, జార్ఖండ్‌లో రిలయెన్స్ సంస్థకు చెందిన కుబేరుడు నత్వానీకి తోడ్పడి కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించటం ఇందులో భాగమే. పశ్చిమ బెంగాల్ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయటం కూడా వ్యూహాత్మకంగానే భావించబడుతున్నది. వారి సీట్లు భర్తీ చేయటానికి బెంగాల్ అసెంబ్లీ నుంచి జరిగే ఉప ఎన్నికల్లో బిజెపి తన అభ్యర్థులను సునాయాసంగా గెలిపించుకుని రాజ్యసభలో తన సంఖ్యను పెంచుకోవచ్చు.

మహారాష్ట్ర రాజకీయ పరిణామాలను సూక్ష్మంగా గుర్తు చేసుకుంటే బిజెపి ఎంత వ్యూహాత్మకంగా ప్రతిపక్షాలను ముక్కలు చేసి అధికార పీఠాన్ని చేజిక్కించుకుందో విదితమవుతుంది. కరడుగట్టిన హిందూత్వ పార్టీ బాల్‌థాక్రే నెలకొల్పిన శివసేన. భూమి పుత్రులకే ఉద్యోగాల పేరుతో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలవారిపై దాడులతో, మరోవైపున హిందూత్వతో 1970—90 దశకాల్లో ఒక దుందుడుకు శక్తిగా శివసేన చక్రం తిప్పింది. మాతోశ్రీ (థాక్రే గృహం) నిర్ణయమే శాసనం. బిజెపి జూనియర్ భాగస్వామిగా శివసేనతో జతకట్టింది. 1995—99లో సేనతో అధికారం పంచుకుంది. బాల్‌థాక్రే తమ్ముని కొడుకు శివసేన రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న రాజ్‌థాక్రే నాయకత్వ వారసత్వం ఆశించి భంగపడ్డాడు. నీటికన్నా రక్తమే చిక్కన అన్నట్లు బాల్‌థాక్రే తన కుమారుడు ఉద్ధావ్ థాక్రేను వారసునిగా నియమించి కన్నుమూశారు. రాజ్‌థాక్రే 'మహారాష్ట్ర నవనిర్మాణసమితి' ఏర్పాటు చేసుకుని రాజకీయంగా ముందుకు రాలేకపోయాడు. చగన్ భుజబల్, నారాయణ్ రాణా వంటి పలుకుబడిగల నాయకులు శివసేననుంచి నిష్క్రమించారు. కాంగ్రెస్ రాజకీయాల్లో చక్రం తిప్పారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో శివసేనతో అవగాహనతో పడ్నావీస్ తొలిసారి ముఖ్యమంత్రి అయినారు. 2019లో ఐదు రోజుల్లో రాజీనామా చేశారు. 2024 డిసెంబర్‌లో మూడవసారి ముఖ్యమంత్రి అయినారు. శివసేనకు ముఖ్యమంత్రి పదవిని బిజెపి నిరాకరించటంతో 2019 ఎన్నికలు అనంతరం రాజకీయ అస్థిరత ఏర్పడింది. ఆ క్రమంలో శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. బిజెపి ఏక్‌నాథ్ షిండే ద్వారా ముందుగా శివసేనను, ఆ తర్వాత అజిత్ పవార్ ద్వారా ఎన్‌సిపిని చీల్చి ఏక్‌నాథ్ షిండేను ముఖ్యమంత్రిని చేసింది. ఆయన నాయకత్వంలోనే 2024లో ఎన్నికలకు వెళ్లిన బిజెపి, ఫలితాల అనంతరం పడ్నావీస్‌ను ముఖ్యమంత్రిని చేసి షిండే, పవార్‌లు ఉపముఖ్యమంత్రులుగా ఏలుబడి ప్రారంభించింది. షిండే కుమారుడు నరేంద్రమోదీ మంత్రివర్గంలో ఉన్నారు. ఎన్నికల గుర్తుపై సుప్రీంకోర్టు కెళ్లిన షిండే మెజారిటీ తోడ్పాటు కారణంగా శివసేన(షిండే) పేరును, బాణం గుర్తును పొందారు. విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణానంతరం ఎన్‌సిపిని ఏకం చేసే ప్రయత్నాలు జరిగినా, అజిత్ భార్య సునేత్ర పవార్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పదవి చేబట్టి ఆ ప్రయత్నం భగ్నం చేశారు. ఆ విధంగా బిజెపి మహారాష్ట్రపై, వాణిజ్య రాజధానిగా పిలవబడే ముంబయిపై ఆధిపత్యం సంపాదించింది. కాగా అంతకు కొద్దినెలల ముందు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, శివసేన(ఉద్ధావ్), అత్యధిక సీట్లు సాధించినందున, ఇప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించి షిండేసేనతో కలిసి కొంత మెరుగైన స్థితికి చేరింది.

వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఒకటైన పంజాబ్‌పై బిజెపి ఇప్పుడు దృష్టి పెట్టింది. ఒకప్పుడు అది అకాలీదళ్‌కు జూనియర్ పార్టనర్. పంజాబ్ ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో ఉంది. మోదీ తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లుల కారణంగా అకాలీదళ్ బిజెపితో సంబంధాలు తెంచుకుంది. హిందువులందరినీ తమవైపుకు తెచ్చుకోవటం, అకాలీలతో పొత్తు పునరుద్ధరించుకోవటం, ఆప్‌ను చీల్చటం తదితర వ్యూహాలతో బిజెపి ముందుకు సాగుతోంది. బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం చండీఘడ్‌లో మాట్లాడుతూ, "పంజాబ్ మార్పుకు సిద్ధంగా ఉంది. పంజాబ్ ప్రజలు ఎంతో ఆశతో, అంచనాలతో బిజెపి వైపు చూస్తున్నారు" అన్నారు. "పంజాబ్‌ను ప్రస్తుత సంక్షోభం నుంచి బయటకు తీసుకురావటం, దాన్ని సురక్షితం, సంపద్వంతం, శక్తిమంతం చేయటం బిజెపి ప్రధాన ఎజండా" అని ప్రకటించారు. ఇది కాంగ్రెస్‌కు, ఆప్‌కే కాదు అకాలీదళ్‌కు కూడా హెచ్చరిక.

## అది నకిలీ వీడియో

**దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ రీటెస్ట్ ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న వీడియో నకిలీది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అలాంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య రీటెస్ట్ విజయవంతంగా ముగిసింది. తప్పుడు సమాచారాన్ని సృష్టించి, విద్యార్థులను ఆందోళనకు గురిచేయడం తీవ్రమైన నేరం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేవలం అధికారిక వెబ్‌సైట్‌లో వచ్చే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి.**

- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ



## వాన చుక్క రాలదేం?

తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ వాతావరణ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్న అంశాల్లో ఒకటిగా పరిగణించబడుతోంది. గాలి పీడనాల్లో మార్పులు, వాతావరణ ప్రవాహాల్లో ఏర్పడిన వ్యత్యాసాలు నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఇటువంటి పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు.

**ఆందోళన కలిగిస్తున్న సంకేతాలు**

భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, జూన్ 4 నుంచి జూన్ 15 వరకు దేశవ్యాప్తంగా సాధారణంగా 53.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, వాస్తవంగా 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం వర్షపాత లోటు నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. గణాంకాలు మొత్తం భారతదేశానికి సంబంధించినవే అయినప్పటికీ, దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటి వనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాలవారీగా, మండలాలవారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**వాతావరణ మార్పుల యుగంలో శాస్త్రీయ వ్యవసాయం**

నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచిన అంశాలుగా ప్రస్తావించబడుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు సమానంగా లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధి వ్యవస్థతో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న మోదీ పాలనా వైఫల్యాలు



డి.రాజా
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి

భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటున్నదనే సంకేతాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన పాలక వ్యవస్థ, కృత్రిమ వివాదాలు, మతపరమైన విభజనలు, ఊహాజనిత శత్రువులపై అంతులేని పోరాటాలతో ప్రజల దృష్టిని మరల్చడంలో ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు కనిపిస్తోంది. దేవాలయాలు, మసీదులు, మధ్యయుగ పాలకులు, కల్పిత శత్రువుల గురించి చర్చలతో టెలివిజన్ స్టూడియోలు నిండిపోతుండగా, ఆర్థిక వ్యవస్థ పునాదులు నిశ్శబ్దంగా బలహీన పడుతున్నాయి. భారత్‌కు ప్రస్తుతం ఎదురవుతున్న అత్యంత తక్షణ సవాలు 'బాహ్య ఆర్థిక దెబ్బల కారణంగా పెరుగుతున్న దుర్బలత'. దేశం తన ముడి చమురు అవసరాల్లో దాదాపు 90 శాతం, ఖనిజ వాయువు వినియోగంలో సుమారు సగభాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అందువల్ల ప్రపంచ ఇంధన ధరల్లో జరిగే ప్రతి పెరుగుదల నేరుగా దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ఇటీవల ఇంధన ధరలు పెరగడాన్ని కేవలం పన్నులు లేదా మార్కెట్ హెచ్చుతగ్గుల ఫలితం మాత్రమేనని అనుకోవడానికి వీల్లేదు. అది మరింత లోతైన వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. పునరుత్పాదక ఇంధనం, స్వావలంబన, ప్రపంచ నాయకత్వం గురించి ఎంత చెప్పుకున్నప్పటికీ, భారత్ ఇప్పటికీ దిగుమతి ఇంధనంపైనే ప్రమాదకర స్థాయిలో ఆధారపడుతోందనేది వాస్తవం. ఈ పరిస్థితి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోంది. చమురు, ద్రవీకృత ఖనిజ వాయువు (ఎల్‌ఎన్‌జి) ధరలు పెరగడం వల్ల వాణిజ్య లోటు విస్తరిస్తోంది. రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది, అన్ని రంగాల్లో ఉత్పత్తి వ్యయాలు అధికమవుతున్నాయి. 2025—26 ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువను కాపాడేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు విదేశీ మారకద్రవ్య మార్కెట్లో 53 బిలియన్ డాలర్లకు పైగా విక్రయించాల్సి వచ్చింది. ఇది గత పదేళ్లలోనే అతిపెద్ద జోక్యం. విదేశీ మారక నిల్వలు 720 బిలియన్ డాలర్లకు పైగా ఉన్న గరిష్ఠ స్థాయి నుంచి సుమారు 681 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. వాస్తవంగానే ప్రభుత్వానికి ఆర్థిక పునాదులపై విశ్వాసం ఉంటే, తన కరెన్సీ పతనాన్ని అడ్డుకోవడానికి ఇంత భారీ మొత్తాలను ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు కదా!

ఇప్పటికే ఉన్న సమస్యలకు తోడు ఎరువులు, వ్యవసాయ రంగాల్లో నెలకొన్న అనిశ్చితి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోంది. ఎరువుల తయారీలో భారత్ బలంగా కనిపించినప్పటికీ, ఆ బలం వెనుక ప్రమాదకరమైన బలహీనత దాగి ఉంది. దేశీయ యూరియా ఉత్పత్తి దిగుమతి చేసుకునే ఎల్‌ఎన్‌జీపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. మనం తయారు చేసే దాదాపు అన్ని ఎరువులూ ఎల్‌ఎన్‌జీ, పొటాష్ వంటి దిగుమతి ముడి పదార్థాలతో అనుసంధానమై ఉన్నాయి. ప్రపంచ గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, ఎల్‌ఎన్‌జి ధరలు ఒక్కసారిగా పెరిగినా, సరఫరా గొలుసు దెబ్బతిన్నా ఎరువుల లభ్యత, ధరలు వెంటనే ప్రభావితమవుతాయి. ఈ సంవత్సరం భారత వాతావరణ శాఖ సాధారణ సగటుతో పోలిస్తే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాన్ని అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం గణనీయంగా ఉందని పేర్కొంది. ఇటువంటి అంచనాలను తేలికగా తీసుకోలేం. బలహీనమైన రుతుపవనాలు కేవలం వ్యవసాయ ఉత్పత్తినే కాదు, మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. పంట దిగుబడులు తగ్గితే గ్రామీణ ఆదాయాలు తగ్గుతాయి. గ్రామీణ ఆదాయాలు తగ్గితే వినియోగ డిమాండ్ బలహీనపడుతుంది. ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఉపశమన చర్యలు, ప్రభుత్వ కొనుగోళ్లు, సబ్సిడీలపై వ్యయం పెరగాల్సి వస్తుంది. అయితే బిజెపి పాలనలో అలాంటి వ్యయం పెరగడం అనుమానాస్పదం. ఈ అంశాలన్నీ పరస్పర ప్రభావితమయ్యేవి కావడమే అసలైన ప్రమాదంగా కనిపిస్తున్నది. పెరుగుతున్న ఇంధన వ్యయాలు, అనిశ్చిత ఎరువుల సరఫరా, బలహీన రుతుపవనాలు వంటివన్నీ విడివిడిగా పనిచేయవు. ఇవన్నీ కలిసి దేశీయ వినియోగాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలోనే డిమాండ్‌ను కుంచించే ఒక దుష్ప్రభావ వలయాన్ని సృష్టిస్తాయి.

ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతగల ప్రభుత్వం ఉపాధి హామీ కార్యక్రమాలను, సామాజిక రక్షణ పథకాలను బలోపేతం చేస్తుంది. కానీ మోదీ ప్రభుత్వం గ్రామీణ ఆదాయాలకు సంక్షోభ కాలంలో అండగా నిలిచే అత్యంత ప్రభావవంతమైన సాధనాల్లో ఒకటైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఇజిఎ)ను క్రమబద్ధంగా బలహీనపరిచింది. దాని ఫలితంగా కోట్లాది గ్రామీణ కుటుంబాలు పదేళ్ల క్రితం ఉన్న రక్షణ కంటే తక్కువ భద్రతతోనే ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్నాయి. కాగా, ఇప్పుడు సేవల ఎగుమతులు, విదేశాల నుంచి వచ్చే నగదు (రెమిటెన్స్) తగ్గి ఆందోళన కలిగిస్తున్నది. 2024—25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు రికార్డు స్థాయిలో 135 బిలియన్ డాలర్ల విలువైన రెమిటెన్సులు వచ్చాయి. దేశ ప్రస్తుత ఖాతా లోటును నియంత్రణలో ఉంచడానికి ఉపయోగపడిన అంశాల్లో ఈ రెమిటెన్స్‌ది కీలక పాత్ర. అయితే, ఇందులో ఎవరూ పట్టించుకోని ప్రమాదం దాగి ఉంది. ఇప్పుడు భారతీయులకు వచ్చే రెమిటెన్సులలో పెరుగుతున్న భాగం గల్ఫ్ దేశాల్లో పనిచేసే వలస కార్మికుల నుంచి మాత్రమే కాకుండా, అమెరికా, బ్రిటన్ వంటి ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో పనిచేస్తున్న అత్యున్నత నైపుణ్యం కలిగిన నిపుణుల నుంచి కూడా వస్తోంది. అమెరికాలో మన ప్రధాని మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ వంటి నాయకులు ప్రోత్సహిస్తున్న మితవాద రాజకీయాలు, వలస వ్యతిరేక భావజాలం, అలాగే పాశ్చాత్య దేశాల్లో పెరుగుతున్న ఇలాంటి ధోరణులు అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బంది పెడుతున్నాయి. రెమిటెన్స్‌కు ప్రత్యక్ష సవాళ్లు విసురుతున్నాయి.

అదే సమయంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డేటా ప్రాసెసింగ్, వృత్తిపరమైన సేవలు వంటి రంగాలను వేగంగా మారుస్తోంది. ఇవన్నీ భారతీయ నిపుణులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రంగాలే కావడం గమనార్హం. రెమిటెన్సులు ఒక్కసారిగా మాయమైపోవడం కాదు.. గత రెండు దశాబ్దాలుగా భారత విదేశీ ఆర్థిక సమతుల్యతకు బలంగా నిలిచిన ఒక ప్రధాన ఇంజిన్ క్రమంగా బలహీనపడే అవకాశం ఉండడమే ప్రమాదకరం. రెమిటెన్సుల వృద్ధి మందగిస్తే, అదే సమయంలో ఇంధన దిగుమతులు అధికంగానే కొనసాగితే, ప్రస్తుత ఖాతా లోటు, రూపాయి విలువపై ఒత్తిడి మరింత పెరుగుతుంది. అంతర్జాతీయ మదుపరులు ఇటీవల కాలంలో ప్రదర్శిస్తున్న ఉదాశీనత ఆందోళన కలిగిస్తున్నది. అంతర్జాతీయ పెట్టుబడిదారుల ప్రవర్తన ఇప్పటికే పెరుగుతున్న జాగ్రత్తను ప్రతిబింబిస్తోంది. ఈ ఏడాది విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు భారతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.2.2 లక్షల కోట్లకు పైగా ఉపసంహరించబడ్డాయి. ప్రపంచ మార్కెట్ మూలధనీకరణ (మార్కెట్ క్యాపిటలైజేషన్) ర్యాంకింగ్స్‌లో భారత్ ఆరో స్థానంనుంచి ఏడో స్థానానికి పడిపోయింది. దేశీయ చిన్న పెట్టుబడిదారులు మార్కెట్లో మరింత తీవ్రమైన పతనాన్ని అడ్డుకున్నప్పటికీ, అంతర్జాతీయ మూలధనం పంపుతున్న సందేశం స్పష్టంగా ఉంది. భారత దేశ ఆర్థిక వృద్ధి కథనం, మోదీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నంత బలంగా ఉందా? అనే సందేహం పెట్టుబడిదారుల్లో పెరుగుతోంది.

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తున్న సాంకేతిక పరివర్తనలో భారతదేశ స్థానం సంతృప్తికరంగా లేకపోవడం మరింత ఆందోళనకరం. మోదీ ప్రభుత్వం ఇచ్చిన గొప్ప హామీలు గతంలో నిర్మించిన సామర్థ్యాలను బలోపేతం చేయడంలో విఫలమవడమే కాకుండా, దృష్టి మళ్లించే రాజకీయాల కారణంగా భవిష్యత్తు ప్రపంచంలో భారత్ పాత్ర ఏమిటన్న అంశంపై లోతైన చర్చ జరగకుండా చేశాయి. ఇరవై ఒకటో శతాబ్దాన్ని కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, అత్యాధునిక తయారీ, రోబోటిక్స్, సరిహద్దు శాస్త్రీయ ఆవిష్కరణలు నిర్వచించనున్నాయి. అయితే ఈ కీలక సాంకేతిక రంగాల్లో భారత్ ఇప్పటికీ వెనుకబడి ఉంది. దేశంలో పెద్ద స్టార్టప్ వ్యవస్థ ఉన్నప్పటికీ, వాటిలో చాలావరకు సాంకేతిక విప్లవాలను సృష్టించడం కంటే, డిజిటల్ మధ్యవర్తిత్వ సేవలకే పరిమితమవుతున్నాయి. ఆహార సరఫరా యాప్‌లు, రైడ్‌హైలింగ్ సేవలు, క్విక్ కామర్స్ సంస్థలు భారీ విలువలను సంపాదించవచ్చు. కానీ అవి సాంకేతిక స్వావలంబనను తీసుకురావు. ప్రసిద్ధి చెందిన అనేక భారతీయ స్టార్టప్‌లు చౌకైన కార్మిక శక్తిని డిజిటల్ వేదికల ద్వారా సమీకరించడంపైనే ఆధారపడి ఉన్నాయి. సాంకేతికంగా ముందంజలో ఉన్న దేశాలు, సంస్థలతో పోలిస్తే, ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. తైవాన్‌లోని టిఎస్ఎంసి అత్యాధునిక సెమీకండక్టర్ తయారీలో ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దక్షిణ కొరియాలోని శామ్‌సంగ్ కీలక సాంకేతిక రంగాల్లో ప్రధాన స్థానాన్ని ఆక్రమించింది. అమెరికా, చైనా దేశాలు కృత్రిమ మేధస్సు, అధునాతన తయారీ, పునాది సాంకేతిక పరిజ్ఞానాల్లో ముందంజలో ఉన్నాయి. భారత్‌కు అపారమైన ఇంజినీరింగ్ ప్రతిభ ఉన్నప్పటికీ, సెమీకండక్టర్లు, సాంకేతిక పరిజ్ఞానం, మూలధన పరికరాల కోసం ఇప్పటికీ దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతోంది. ఎన్నో సంవత్సరాలుగా నవకల్పన, స్వావలంబన గురించి నినాదాలు వినిపించినప్పటికీ, భవిష్యత్తును నిర్ణయించే పరిశ్రమల్లో భారత్ ఇప్పటికీ వెనుకబడే ఉంది. మోదీ పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పటికీ భారత్ ఇప్పటికీ దిగుమతి ఇంధనం, దిగుమతి సాంకేతికత, దిగుమతి మూలధనంపైనే ఆధారపడుతోంది. మరోవైపు నిరుద్యోగం కొనసాగుతోంది, అసమానతలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వాగ్దానం చేసిన వస్తూత్పత్తి విప్లవం కార్యరూపం దాల్చలేదు. కోట్లాది యువతతో కూడిన 'జనాభా ప్రయోజనం' (డెమోగ్రాఫిక్ డివిడెండ్) ఇప్పటికీ అస్థిర ఉపాధి, స్థిరంగా పెరగని వేతనాలు, తగ్గుతున్న అవకాశాలు వంటి పరిస్థితులను ఎదుర్కొంటోంది. పలు రకాలుగా వైఫల్యాలను ఎదుర్కొంటున్నప్పటికీ, 'అతిశయ జాతీయవాదం' ముసుగుతో ప్రజలపై మోదీ ప్రభుత్వం భారాన్ని మోపుతున్నది. ఆర్థిక వ్యవస్థ నుంచి అత్యవసర హెచ్చరికలు వస్తున్నప్పటికీ ప్రజల దృష్టిని పదేపదే మతపరమైన విభజన, కృత్రిమ వివాదాల వైపు మళ్లిస్తున్నారన్నది చేదు నిజం. ప్రజలు తమ జీవనోపాధిని ప్రభావితం చేసే విధానాలను ప్రశ్నించకుండా, ఒకరినొకరు అనుమానించేలా ప్రభుత్వమే రెచ్చగొట్టడం దారుణం. సమాజం వ్యూహాత్మకంగా విభజించబడుతుండగా ఆర్థిక బలహీనతలు మరింత లోతుగా మారుతున్నాయి.



పేదలు, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకే ఈ పరిస్థితుల ప్రభావం అత్యధికంగా ఉంటుంది. వారి భవిష్యత్తు తాకట్టులోకి వెళుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా, కొద్దిమందిని సంపన్నులను చేస్తూ కోట్లాది మందిపై భారాలు మోపే విధానాలకు వ్యతిరేకంగా దృఢమైన, ఐక్యమైన పోరాటం అవసరం. ఆర్థిక పతన సంకేతాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. విభజన, ఆర్థిక దుర్బలతల మార్గంలోనే కొనసాగాలా? లేక జీవనోపాధులు, ఉద్యోగాలు, భవిష్యత్తును కాపాడగల విస్తృత ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మించాలా? అనేది ప్రజలే తేల్చుకోవాలి. సమయం మించిపోకముందే మేల్కోవాలి.

**(ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్త ప్రచారం, సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ — సిపిఐ పిలుపు)**

# పార్టీ విలీనాలు : 10వ షెడ్యూలు ఏమి చెబుతోంది?

*(పార్లమెంటరీ, శాసనసభా పార్టీల్లో తిరుగుబాట్లు, చీలికల నేపథ్యంలో పార్టీల విలీనంపై ఫిరాయింపుల నిరోధక చట్టం (10వ షెడ్యూలు) ఏమి చెబుతున్నదో, "ది హిందూ" (జూన్ 18, 2026) ప్రచురించిన మాజీ ఐఎఎస్ అధికారి ఆర్.రంగ రాజన్ వ్యాసం ఇక్కడ ఇస్తున్నాం — సం॥)*

తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపిలు 20మంది స్పీకర్‌ని కలిసి తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)తో విలీనం కావాలన్న తమ నిర్ణయాన్ని తెలియజేశారు. ఇది రాజకీయ పార్టీల విలీనం విషయంలో 10వ షెడ్యూలు భాష్యం గూర్చి సమస్యలు లేవనెత్తింది.

**10వ షెడ్యూలు ఆవిర్భావానికి మూలం**

1960వ, 70వ దశకాల్లో తమ మాతృ పార్టీల నుంచి లెజిస్లేటర్ల ఫిరాయింపులు అనేక రాష్ట్రాల్లో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలను గూర్చి రాజకీయ అస్థిరత సృష్టించింది. దీని కారణంగా 1985లో 10వ షెడ్యూలు ద్వారా 'ఫిరాయింపుల వ్యతిరేక' చట్టం తీసుకువచ్చేందుకు 52వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చారు. పార్లమెంటు సభ్యుడు లేదా శాసనసభ్యుడు గనుక తమ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదలుకున్నా లేక పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా సభలో ఓటు వేసినా అటువంటివారు ఆ సభ నుంచి అనర్హత పొందే శిక్ష పొందుతారు. 'రాజకీయ పార్టీ' అనేది ఒక పార్టీ మొత్తం సంస్థ. 'లెజిస్లేచర్ పార్టీ' అనేది పార్లమెంటు లేక శాసనసభలో ఆ పార్టీకి చెందిన సభ్యుల మొత్తం.

10వ షెడ్యూల్లో ఆదిలో సభ్యులు అనర్హతకు గురికాకుండా ఉండేందుకు రెండు మినహాయింపులున్నాయి. అవి — శాసన సభా పార్టీలో మూడవ వంతు సభ్యులు పార్టీని చీల్చి ప్రత్యేక గ్రూపుగా ఏర్పడినట్లయితే (పారాగ్రాఫ్ 3), లేదా తమ రాజకీయ పార్టీ మరో రాజకీయ పార్టీతోవిలీనం కావటాన్ని లెజిస్లేచర్ పార్టీ సభ్యుల్లో మూడింట రెండు వంతులు ఆమోదించినపుడు(పారా గ్రూపు 4). అయితే ఫిరాయింపుల వ్యతిరేక పటిష్టంచేసే నిమిత్తం 2003లో పారాగ్రాఫ్ 3ను చట్టం నుంచి తొలగించారు.

పారాగ్రాఫ్ 3ను తొలగించటంతో, లెజిస్లేచర్ పార్టీ సభ్యుల్లో మూడింట రెండు వంతులు ఆచరణలో ఫిరాయించి కూడా అనర్హత వేటు తప్పించుకునే నిమిత్తం తాము తమ అసలు పార్టీలోనే ఉన్నామని చెబుతున్న సందర్భాలున్నాయి. 2022 జూన్‌లో శివసేన విషయంలో, 2023 జులైలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ విషయంలో ఇదే జరిగింది.

అంతేగాక, సభలోని ఒక లెజిస్లేచర్ పార్టీ సభ్యుల్లో మూడింట రెండు వందలకు పైగా అనర్హత తప్పించుకునేందుకై తమంతటతాముగా మరో రాజకీయ పార్టీలో విలీనమైన సందర్భాలూ ఉన్నాయి. ఇది 2019 సెప్టెంబర్‌లో రాజస్థాన్‌లో జరిగింది. బహుజన సమాజ్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు తమకు తాముగా కాంగ్రెస్‌లో చేరారు. 2022 సెప్టెంబర్‌లో గోవాలో కూడా 11మంది కాంగ్రెస్ సభ్యుల్లో 8మంది తమకు తాముగా బిజెపిలో చేరిపోయారు. గోవా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ బిజెపితో విలీనం కావటం సరైనదేనని బొంబాయి హైకోర్టు తీర్పు చెప్పింది. దీనిపై అప్పీలు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. 2026 ఏప్రిల్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యులు 10మందిలో ఏడుగురు బిజెపితో విలీనమైనప్పుడు అదే జరిగింది.

**బెంగాల్‌లో ప్రస్తుత కేసు ఏమిటి?**

పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఎన్నికల తర్వాత తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఎన్నికైన 80మంది ఎమ్మెల్యేల్లో దాదాపు 60మంది రితబ్రత బెనర్జీ నాయకత్వాన ప్రత్యేక గ్రూపుగా ఏర్పడినారు. అతన్ని పార్టీ బహిష్కరించినప్పటికీ అతను రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్షనాయకునిగా గుర్తించబడ్డారు. ఇదిలావుండగా, 28టిఎంసి ఎంపిలో 20మంది తాము ఎన్‌సిపిఐతో విలీనం కావాలన్న తమ నిర్ణయాన్ని తెలియజేస్తూ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు లేఖ ఇచ్చారు. వారి వాదన ఏమంటే, తాము పార్లమెంటరీ పార్టీలో మూడింట రెండువంతులుగా ఉన్నాము, అందువల్ల అనర్హతకు గురికాకుండా 10వ షెడ్యూలు నిబంధనల కింద ఈ చర్య తీసుకునేందుకు మాకు అధికారం ఉంది.

**ఏమిటి మార్గం?**

10వ షెడ్యూలు సాధారణంగా చదివితే, ఒక రాజకీయ పార్టీ మరొక రాజకీయ పార్టీలో విలీనం కావటం మాత్రమే అనుమతించబడుతుంది. దాన్ని దాని లెజిస్లేచర్ పార్టీలో మూడింట రెండువంతులు ఆమోదించాలి. లెజిస్లేచర్ పార్టీలోని మూడింట రెండువంతులు మరో పార్టీలో చేరి ఫిరాయింపు నుంచి రక్షణ క్లెయిం చేసేందుకు ఇది అధికారమివ్వదు. అయితే ఇటీవల జరిగిన ఘటనలు ఎన్‌సిపిఐతో తృణమూల్ లోక్‌సభ ఎంపిల ప్రతిపాదిత విలీనం విషయంలో, అలాగే బిజెపిలో ఆప్ రాజ్యసభ ఎంపిలు విలీనం విషయంలో ఇదే జరిగింది. ఒక 'ఒరిజినల్ రాజకీయ పార్టీ విలీనం చట్టసభలో అప్పటికే సభ్యులు కలిగి ఉన్న రాజకీయ పార్టీతోనే జరగాలా అనేది కూడా భాష్యం చెప్పవలసి ఉన్న అంశం. అయితే సభ్యుల అనర్హతను నిర్ణయించే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కు దాఖలుపడి ఉంది.

ఈ రాజ్యాంగ పాత్రను వారు నిష్పక్షపాతంగా నిర్వహిస్తారని ఆశించబడుతున్నప్పటికీ, ఈ సభాధ్యక్షులు తరచూ అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు. సుప్రీంకోర్టు 2020లో కె.ఎం.సింగ్ కేసులో, ఈ అధికారాన్ని జడ్జీల నాయకత్వంలో స్వతంత్ర ట్రిబ్యునల్‌కు దాఖలుపరుస్తూ పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించాలని సిఫారసు చేసింది.

విలీనం అనర్హతను నిర్ణయించటంపై స్వతంత్ర ట్రిబ్యునల్ ఏర్పాటు విషయాల్లో సుప్రీం కోర్టు సాధికారికమైన తీర్పు 10వ షెడ్యూలు చుట్టూ ఉన్న అస్పష్టతను తొలగించవచ్చు. అయితే 10వ షెడ్యూలును దెబ్బతీయటానికి రాజకీయపార్టీలు ఆచరించే యుక్తిపూర్వక పద్ధతులను అది నిరోధించలేకపోవచ్చు. అటువంటి ప్రయత్నాలను ఓటర్లకు ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల ద్రోహంగా పరిగణించబడవచ్చు.

1999 లా కమిషన్ సిఫారసు చేసినట్లు రాజకీయ పార్టీల విలీనాన్ని అనర్హత నుంచి మినహాయించిన పారాగ్రాఫ్ 4ను తొలగిస్తూ 10వ షెడ్యూలును సవరించటం గట్టి చర్యగా ఉంటుంది.

ఎన్నుకోబడిన లెజిస్టేచర్ పార్టీ సభ్యులు తమ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా తీసుకునే చర్య అయినా అది అనర్హతలకు (సభ సభ్య త్వం రద్దు) దారితీయాలి. అటువంటివారు ప్రజల నుంచి తాజా తీర్పు కోరాలి.

***(రంగరాజన్ ఆర్.మాజీ ఐపిఎస్ అధికారి. 'కోర్స్‌వేర్ ఆన్ పొలిటీ సింప్లిఫైడ్' గ్రంథ రచయిత. ఆయన ప్రస్తుతం 'ఆఫీసర్స్ ఐఎఎస్ అకాడమీ'లో బోధిస్తున్నారు. ఇందులో వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆయన సొంతం)***

# వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

- తక్షణ స్పందనకు ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక ఎస్‌ఓపి అమలు
- 204 మి.మి.కు పైగా వర్షపాతం నమోదైతే రెడ్ అలర్ట్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించేందుకు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ (ఎస్‌ఓపి)ను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రూపొందించిన ఈ ఎస్‌ఓపి ప్రకారం జూన్ నుంచి అక్టోబర్ వరకు అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జెసిబిలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీవాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, తారు, కంకర తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**రంగుల ఆధారిత హెచ్చరిక వ్యవస్థ..**

వర్షపాతం తీవ్రతను బట్టి గ్రీన్, యెల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. 64.5 మి.మి కంటే తక్కువ వర్షపాతం నమోదైతే గ్రీన్ అలర్ట్, 64.5 నుంచి 115 మి.మి మధ్య యెల్లో అలర్ట్, 115 నుంచి 204 మి.మి మధ్య ఆరెంజ్ అలర్ట్, 204 మి.మిలకు పైగా నమోదైతే రెడ్ అలర్ట్ ప్రకటిస్తారు. రెడ్ అలర్ట్ సమయంలో ఎఇలు, ఎఇఇలు, ఇఇలు 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేయాలని మంత్రి ఆదేశించారు.

# సాదాబైనామా పరిష్కారంలో వేగం పెంచాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో జిల్లాకు ఒక మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతిని అమలు చేసేందుకు యోచిస్తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు (2025, ఏప్రిల్ 14 నుంచి) రాష్ట్ర వ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లను జారీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భూభారతి చట్టంలో పొందుపర్చినట్టుగా వ్యవసాయ భూముల క్రయ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా మంత్రి స్పందిస్తూ అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయని, రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటి వరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేశారని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన దరఖాస్తులను వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు.

# ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయం



- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ 100 సీట్లకు తగ్గకుండా అధికారంలోకి వస్తుందని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెంకట్రామ్ రెడ్డి, అయూబ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నాయకులు తెలంగాణ రాజకీయాలపై అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నటుడు చిరంజీవి సినీ రంగంలో చేసిన సేవలను అభినందిస్తున్నామని, అయితే తెలంగాణ రాజకీయాల్లో జోక్యం అవసరం లేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పవన్‌కళ్యాణ్ ఎక్కడ ఉన్నారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన, రాష్ట్రంలో ఆ పార్టీ రాజకీయ ప్రాధాన్యం కోల్పోయిందని, అంతర్గత విభేదాలు, ఆస్తి వివాదాల కారణంగానే ఆ పార్టీ నాయకత్వంలో చీలికలు వచ్చాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు పలు ప్రశ్నలు సంధిస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.23 వేల కోట్ల రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు మోస మా అని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం ఏమి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. బిజెపి నేతలు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని, వరంగల్ వేదికగా బహిరంగ చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. గత 12 ఏళ్లలో బిజెపి చేసిన అభివృద్ధి, గత మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల ముందే చర్చిద్దామని సవాల్ విసిరారు. హైడ్రా చర్యలపై స్పందిస్తూ, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ప్రకృతి విపత్తుల సమయంలో నష్టాలు తప్పవని అన్నారు. హైడ్రా చర్యల వల్ల నష్టపోయింది భూ కబ్జాదారులేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మంచివి కావని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందని, రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## పేదవాడికి సొంతింటి కలను దూరం చేయవద్దు



పిసిసి చీఫ్‌కు వామపక్షాల వినతి

పేదవాడికి సొంతింటి కలను దూరం చేసే విధానానికి స్వస్తి చెప్పాలని హనుమకొండ, వరంగల్ జిల్లా వామపక్ష పార్టీల నేతలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు విన్నవించారు. సోమవారం హనుమకొండ డిసిసి భవన్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లా వామపక్ష పార్టీల నేతలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎంసిపిఐయు జిల్లా నాయకులు కర్ర రాజి రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ఎ స్టాలిన్‌లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు మాట్లాడుతూ హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం, గోపాలపురంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు తొలగించడం ప్రజా ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చడం దారుణమని వారు అవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎంసిపిఐయు జిల్లా నాయకులు కర్ర రాజి రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ఎ స్టాలిన్ పాల్గొన్నారు.

# బుగ్గపాడు ఫుడ్ పార్కు భూముల కేటాయింపుపై దుష్ప్రచారం వద్దు

- టిజిఐఐసి స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం జిల్లా బుగ్గపాడు ఫుడ్ పార్కులో భూముల కేటాయింపుపై కొన్ని మీడియా వర్గాల్లో వస్తున్న కథనాలు వాస్తవాలకు విరుద్ధమని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి) స్పష్టం చేసింది. దీపక్ నెకట్స్ జెన్ ఫీడ్స్ సంస్థకు భూమిని కారు చౌకగా కేటాయించారనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.బుగ్గపాడులో 203.20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ పార్కుకు ఎన్నో ఏళ్లుగా పరిశ్రమలు ముందుకు రాకపోవడంతో పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా భూమి ధరలను హేతుబద్ధీకరించినట్లు తెలిపారు. గతంలో ఎకరానికి రూ.51 లక్షలు నిర్ణయించినప్పటికీ స్పందన లేకపోవడంతో 2022 ఏప్రిల్ 22న ధరను రూ.35.75 లక్షలకు తగ్గించినా పరిశ్రమలు రాకపోవడంతో మరోసారి సవరణ చేయాల్సి వచ్చిందన్నారు. రూ.515 కోట్ల పెట్టుబడితో ఫీడ్ ఇంటిగ్రేటెడ్ అక్వా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు దీపక్ నెకట్స్ జెన్ ఫీడ్స్ సంస్థ 72 ఎకరాల భూమిని కోరిందని, ఎకరానికి రూ.35.75 లక్షల చొప్పున భూమి కొనుగోలు చేయడం సంస్థపై అధిక ఆర్థిక భారం అవుతుందని పేర్కొనడంతో ప్రైస్ ఫిక్సేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ సిఫార్సుల మేరకు ఎకరానికి రూ.25 లక్షలుగా నిర్ణయించినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,040 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పరిశ్రమ నిర్ణీత గడువులో పెట్టుబడులు పెట్టకపోయినా, హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగాలు కల్పించకపోయినా భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే నిబంధనలను ఒప్పందంలో స్పష్టంగా పొందుపరిచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం భూ కేటాయింపు తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే జరిగిందని పేర్కొన్నారు.

# మహిళా సాధికారతకు టాస్క్-సెర్ప్ ఒప్పందం

- ఎస్‌హెచ్‌జి మహిళలకు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్- ఆర్థిక అక్షరాస్యత శిక్షణలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలను ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. మహిళలకు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అవగాహనతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, టాస్క్ సిఇఒ కె.నితిన్ కుమార్ రెడ్డి పరస్పరం అవగాహన ఒప్పందం (ఎంఒయూ) పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఎఫ్ఐ) వై.ఎన్.రెడ్డి, వీరమల్లు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జి మహిళలకు బ్యాంకింగ్ కరస్పాండెంట్ (బిసి సఖి) సేవలకు సంబంధించిన ప్రత్యేక నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, వ్యాపార నిర్వహణ, వ్యవస్థాపకత అభివృద్ధి, స్థిరమైన జీవనోపాధి అవకాశాలపై శిక్షణలు అందించనున్నారు. డిజిటల్ సేవలు, ఆర్థిక లావాదేవీలు, స్వయం ఉపాధి అవకాశాలు వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ మహిళలకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. టాస్క్ తన శిక్షణా సామర్థ్యాన్ని, సెర్ప్ తన విస్తృత గ్రామీణ నెట్‌వర్క్‌ను వినియోగించి మహిళలకు సమర్థవంతమైన శిక్షణ అందించనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఆర్థిక స్వావలంబన సాధించడం, డిజిటల్ సేవల వినియోగాన్ని పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం వంటి లక్ష్యాలను సాధించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టాస్క్ ప్రాంతీయ కేంద్రాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళల సమగ్రాభివృద్ధి, ఆర్థిక సాధికారత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి టాస్క్‌సెర్ప్ భాగస్వామ్యం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఇందిరమ్మ రాజ్యం పేరుతో ఇంటింటా సంక్షోభం

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/కాజీపేట :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షోభంలోకి నెట్టివేయబడిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సోమవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో మడికొండలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న పంటల కొనుగోలు విధానం రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉందని కెటిఆర్ అన్నారు. గతంలో ప్రతి గింజ ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రం నిర్దేశించిన పరిమితుల మేరకే కొనుగోలు చేస్తామని ప్రకటించడం రైతుల పట్ల అన్యాయమని విమర్శించారు. ఈ నిర్ణయం కొనసాగితే వచ్చే సీజన్ నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత, విత్తనాల సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, రైతు బంధు అమలులో లోపాలు, రైతు బీమా నిలిపివేత వంటి అంశాలతో రైతాంగం ఇప్పటికే ఇబ్బందులు పడుతోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, బెదిరింపులకు దిగడం జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి తరచూ ఢిల్లీ పర్యటనలు చేసినప్పటికీ రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో నిధులు తీసుకురాలేకపోయారని విమర్శించారు. అధికారంలో ఉన్నారనే కారణంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన కేటీఆర్, పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని భవిష్యత్తులో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై కూడా కార్యకర్తలకు కేటీఆర్ వివరణ ఇచ్చారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# 'డిటిఒ' కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వండి

- ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి: లచ్చిరెడ్డి, వొడ్నాల రాజశేఖర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూపాలపల్లి ఆర్‌టిఒ కార్యాలయం ఎదుట విధి నిర్వహణలో ఉన్న డిటిఒ వెంకన్నను బొగ్గు లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తీవ్ర విషాదకరమని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ అన్నారు. ఈ ఘటన పట్ల పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించడంతో పాటు, ఆయన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని లచ్చిరెడ్డి, వొడ్నాల రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వెంకన్న అకాల మరణం పట్ల తెలంగాణ ఉద్యోగుల జెఎసి తరఫున ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో డిటిఒ వెంకన్నపై బొగ్గు లారీ దూసుకెళ్లి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, విధి నిర్వహణలో ఉన్న అధికారుల భద్రత పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులకు అవసరమైన భద్రతా చర్యలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తేజస్వీ సూర్య క్షమాపణ చెప్పిన తర్వాతే అడుగు పెట్టాలి

- బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణలో అడుగు పెట్టాలంటే తెలంగాణ బిడ్డలకు క్షమాపణ చెప్పాల్సిందేనని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ హెచ్చరికకు భయపడి, ఎక్కడ క్షమాపణ చెప్పాల్సి వస్తుందోనని తేజస్వి సూర్య తన తెలంగాణ పర్యటననే వాయిదా చేసుకున్నారు. బిజెపి ఎంపి తేజస్వీ సూర్య ఎప్పుడు తెలంగాణకు వచ్చినా మేము అడ్డుకుని తీరుతామని ఆయన క్షమాపణ చెప్పకుండా తెలంగాణ గడ్డపై అడుగు పెట్టలేరని పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఏర్పాటును కించ పరిచేలా, అమరుల ఆత్మ బలిదానాల అవహేళన చేసేలా ఆయన చేసిన వ్యాఖ్యలను ఎప్పటికీ మరిచి పోలేమన్నారు.'బిజెపి నేతలకు మొదటి నుంచి తెలంగాణ అంటే ఇష్టం ఉండదు. అందుకే మోదీ నుంచి మొదలుకొని వారి సాధారణ కార్యకర్త వరకు అందరి మాటల్లో తెలంగాణపై వారికి ఉన్న విద్వేషమే స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తెలంగాణ బిజెపి నేతలకు ఈ గడ్డపై పుట్టామనే ప్రేమ ఉంటే ఇక్కడి సెంటిమెంట్‌ను గౌరవించే వాళ్ళైతే ముందు తేజస్వీ సూర్యతో క్షమాపణ చెప్పించిన తర్వాతే ఆయన్ను హైదరాబాద్‌కు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు.

# 'ఎస్ఐఆర్'లో జర్నలిస్టుల పాత్ర కీలకం

## మీడియా అకాడమీలో ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సహకారంతో, తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని అకాడమి ఆడిటోరియంలో 'ఎస్ఐఆర్'పై జర్నలిస్టులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం తరపున స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.చెన్నయ్య, ఐటి మేనేజర్ డి.చిరంజీవి హాజరై పవర్ పాయింట్ ప్రజెంషన్ (పిపిటి) ద్వారా 'ఎస్ఐఆర్' ప్రక్రియపై జర్నలిస్టులకు సమగ్ర వివరాలు అందించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులు, ఇంటింటి సర్వే, క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు తదితర అంశాలపై అధికారులు విపులంగా వివరించారు. కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యత అత్యంత కీలకమన్నారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సరైన, వాస్తవ సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలన్నారు. జర్నలిస్టులు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకుని, ప్రజలకు స్పష్టమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**ఎలాంటి ధృవీకరణ పత్రాలు జత చేయాల్సిన అవసరం లేదు**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ఎన్నికల సంఘం అధికారులు బి.చెన్నయ్య, డి.చిరంజీవి వివరాలను వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారమ్ పూరించి, సంతకం చేసి, ఫొటో బిఎల్‌ఓకు ఇచ్చేస్తే సరిపోతుంది. ఎలాంటి ధృవీకరణ పత్రాలు జత చేయాల్సిన అవసరం ఉండదు. ముసాయిదా జాబితాలో పేరు రాని పక్షంలో బిఎల్‌ఓ నోటీసు ఇచ్చిన తర్వాత సంబంధిత ధృవీకరణ పత్రాలు జత చేసి, ఫారమ్ అందచేయాలి. ఎస్ఐఆర్ కార్యక్రమం ఈ నెల 25న ప్రారంభమై అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ముగియనుంది. ఇంటింటి గణన ప్రక్రియ జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనుండగా, జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, విచారణ, ధృవీకరణ, ఫారమ్‌లు పరిశీలన, క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ కొనసాగి, అక్టోబర్ 1న తుది జాబితా విడుదల చేయనున్నారు.

**ఇంటింటి సర్వేలో మూడు సార్లు బిఎల్‌ఓల సందర్శన**

ఎస్ఐఆర్‌లో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి ముందే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఓటర్లకు అందజేస్తారు. ఓటర్లు వాటిని పూరించి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. బిఎల్‌ఓలు కనీసం మూడుసార్లు ఇంటింటికి వెళ్లి ఫారమ్‌లు పంపిణీ చేయడంతో పాటు, పూరించిన ఫారమ్‌లను సేకరిస్తారు.

**ఆన్‌లైన్‌లోనూ ఫారం సమర్పణ**

ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారమ్‌ను భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ voters.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పూరించి సమర్పించవచ్చు. నమోదిత మొబైల్ నెంబర్ లేదా ఈపిఐసి నెంబర్‌తో లాగిన్ అయి ఓటిపి ధృవీకరణ అనంతరం 'ఫిల్ ఎన్యూమరేషన్ ఫారమ్' ఆప్షన్ ద్వారా వివరాలు నమోదు చేయవచ్చు. ఓటర్ల జాబితాలోని పేరు, ఆధార్ రికార్డులోని పేరు సరిపోలిన వారికి ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

**ఆధార్ తప్పనిసరి కాదు**

ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పణలో ఆధార్ నెంబర్ ఇవ్వడం తప్పనిసరి కాదని అధికారులు స్పష్టం చేశారు. ఓటరు స్వచ్ఛందంగా ఇవ్వాలనుకుంటే మాత్రమే ఆధార్ వివరాలు నమోదు చేయవచ్చన్నారు. అలాగే గణన దశలో ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత అవసరమైతే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ) నోటీసులు జారీ చేసి సహాయక పత్రాలు కోరుతారని తెలిపారు.

**పేరు లేకపోతే ఆందోళన అవసరం లేదు**

2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసినా, ఎస్ఐఆర్ జాబితాలో పేరు కనిపించకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాంటప్పుడు తల్లిదండ్రులు, తాతలు అమ్మమ్మలు, నానమ్మల ఓటరు వివరాలను సేకరించి సంబంధిత కాలమ్‌లో నమోదు చేయవచ్చని తెలిపారు. చిరునామా మార్పులు, సవరణలు, కొత్తగా 18 ఏళ్లు నిండిన వారి నమోదు వంటి అంశాలు క్లెయిమ్‌లు అభ్యంతరాల దశలో పరిష్కరిస్తారని వివరించారు.

**సందేహాలకు బిఎల్‌ఓలు, హెల్ప్‌లైన్ 1950**

ఎన్యూమరేషన్ ఫారమ్ పూరించడంలో లేదా ఓటరు వివరాల గుర్తింపులో ఇబ్బందులు ఉంటే బూత్ స్థాయి అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ ఓటర్ హెల్ప్‌లైన్ 1950కు కాల్ చేయవచ్చని, అవసరమైతే బుక్ ఏ కాల్ విత్ బిఎల్‌ఓ సదుపాయం ద్వారా కూడా సహాయం పొందవచ్చని చెన్నయ్య, చిరంజీవి తెలిపారు.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగరపాలక సంస్థ

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 03 | GHMC రాజేంద్రనగర్ జోన్, అత్తాపూర్ సర్కిల్‌లో రోడ్డు కటింగ్ పునరుద్ధరణ పనుల కోసం. | రూ. 30.50 లక్షలు | తేది: 23.06.206 మ.2.30 గం.లకు | తేది: 30.06.2026 మ.2.40 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అత్తాపూర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9492067578. ఇ-మెయిల్: eec20.attapur@gmail.com |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అత్తాపూర్ సర్కిల్-20, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 4721-PP/CL/ADVT/2026-27, Date: 22-06-2026

తెలంగాణ ప్రభుత్వము
వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.

నెం. వ్య.మా.క./గుడి/ /2026-27 టెండరు ప్రకటన తేది. 22/06/2026

వ్యవసాయ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ నందు ఈ క్రింద తెలిపిన పనుల నిర్వహణ చేయుటకు ఆసక్తి గలవారి నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. పనికి అర్హతలు మరియు ఇతర వివరాలు కొరకు కార్యాలయము పనివేళల యందు సంప్రదించగలరు, అర్హతలు కలిగిన సంస్థలు లేదా వ్యక్తులు, అర్హతలకు సంబంధించిన పత్రములు, టెండర్ షెడ్యూల్ ధర మరియు ధరావత్తు సొమ్మును డిమాండు డ్రాఫ్ట్ ద్వారా సమర్పించినచో పొందవచ్చును. డిమాండు డ్రాఫ్ట్ సెక్రటరీ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటి, గుడిమల్కాపూర్ వారి పేరు మీద ఉండవలయును.

| క్రమ సంఖ్య | పనిపేరు | ధరావత్తు రూ. | టెండరు షెడ్యూలు ధర |
|---|---|---|---|
| 1. | వ్యవసాయ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ కార్యాలయమునకు అవసరమగు స్టేషనరీ మరియు కంప్యూటర్ పరికరాలు సరఫరా చేయుటకు. | 10,000/- | 1,000/- |
| 2. | వ్యవసాయ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ కార్యాలయమునకు అవసరమగు ఎలక్ట్రికల్ పరికరాలు సరఫరా చేయుటకు. | 10,000/- | 1,000/- |
| 3. | పూల మార్కెట్ మరియు కూరగాయల మార్కెట్ నందు డిసిఎం, లారీలు, ఆటోలు, మోటార్ సైకిల్ మరియు ఇతర వాహనముల యొక్క ట్రాఫిక్ నియంత్రించుటకు కావలసిన సిబ్బందిని సరఫరా చేయుటకు. | 25,000/- | 3,000/- |
| 4. | వ్యవసాయ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ కార్యాలయమునకు అవసరమగు తక్పట్టి, రిజిస్టర్ ప్రింటింగ్ చేసి సరఫరా చేయుటకు. | 10,000/- | 1,000/- |
| 5. | పూల మార్కెట్ నందు టాయిలెట్ బ్లాక్ - III నిర్వహించుటకు. | 25,000/- | 3,000/- |
| 6. | పూల మార్కెట్ నందు టాయిలెట్ బ్లాక్ -IV నిర్వహించుటకు. | 25,000/- | 3,000/- |

టెండరు షెడ్యులు తేది: 24.06.2026 తేది ఉదయము గం.10.30. నుండి తేది.29.06.2026 రోజున మధ్యాహ్నం 3.00 వరకు కార్యాలయ పనివేళలో టెండరు షెడ్యులు అమ్మబడును. టెండరు షెడ్యులు సమర్పించుట తేది: 30.06.2026 నాడు ఉదయము: గం. 11.00 నుండి గం.01.00 వరకు, తేది: 30.06.2026 నాడు గం.03.00 లకు టెండరు షెడ్యులు తెరువబడును. అసంపూర్తిగా ఉన్న టెండర్లు గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు అన్ని ఎలాంటి కారణము చూపకుండా, టెండరు ఆమోదించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వాయుదా వేయుటకు లేదా మార్పు చేయుటకు లేదా టెండరు పక్రియను ఏదశలోనైన రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకము దారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరాల కోరకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/-
చైర్మన్,
వ్యవసాయ మార్కెట్ కమిటీ,
గుడిమల్కాపూర్.

సం/-
కార్యదర్శి(FAC),
వ్యవసాయ మార్కెట్ కమిటీ,
గుడిమల్కాపూర్.

DIPR R.O. No. : 4740-PP/CL/ADVT/2026-27, Date: 22-06-2026

# మహిళా సాధికారతకు పెద్దపీట

• రూ.67వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ • ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు అండ • నారి భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి





**పజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ఆహోర్నిశలు శ్రమిస్తుందని రెండున్నర ఏళ్ల కాలంలో రూ.67వేల కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామని ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల పంపిణీయే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నారి భేటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లు విక్రమార్క మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఈ ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. గడిచిన పదేళ్ల నిరంకుశ పాలనలో పేద ప్రజలు ఇండ్ల కోసం ఎదురు చూసి అలిసి పోయారని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలోనే 4.5 లక్షల ఇండ్లను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది కూడా ప్రతి నియోజక వర్గానికి 2వేల చొప్పున ఇండ్లు కేటాయించామని ఆయన తెలిపారు. పేద పిల్లల ఉన్నత చదువుల కోసం ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను అమలు చేస్తున్నామని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నామని ప్రభుత్వ గురుకులాల్లో చదివే విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచినట్లు విక్రమార్క తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విద్యా బోధన ప్రారంభిస్తున్నట్లు తెలిపిన భట్టి పేద కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు స్వయం సేవక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి బస్సులను మహిళలనే యజమానులను చేయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణలో మహిళలు ప్రధాన భూమిక పోషించేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇంటింటికి సంక్షేమ పథకాలను చేరవేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మహిళలు కీలక పాత్ర పోషించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు యర్రబెల్లి స్వర్ణ, శాసన సభ్యులు రాందాస్ నాయక్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, కార్పోరేషన్ల ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల ఫీజులు దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐడిఓసిలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సం. ప్రారంభమైనందున పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా వెలిసిన కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూళ్లు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ మొత్తం తమ వద్దే కొనుగోలు చేయాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడం సరైంది కాదన్నారు.

## పెంచిన ధరలు తగ్గించాలి



-సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్

**ప్రజాపక్షం/ఏన్కూరు:** పెంచిన ఎరువులు, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి పాత విధానంలో ఎరువుల పంపిణీ కొనసాగించాలని కోరారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు రైతు బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించి బోనస్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తాళ్లూరి రమణ, నాయకులు మదినేని రమేష్, నరేష్, రామకృష్ణ, బసవయ్య, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బికెఎంయు ధర్నా

**ప్రజాపక్షం/ఖమ్మం :** విబి జీ రాంజీ పథకాన్ని ఉప సంహరించుకుని యథావిధిగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాల ని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) అనుబంధ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్ధినేని కర్ణకుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధికి తిలోదకాలు ఇచ్చేందుకే విబిజీ రాం జీ పథకాన్ని జూలై ఒకటి నుంచి అమలు చేయాలని యత్నిస్తుందని వారు తెలిపారు. పని రోజులు తగ్గించడం, రోజు వారి కూలీకి సంబంధించి కూడా సరైన రీతిలో గిట్టుబాటు కాకుండా చేయడం, రెండు సార్లు ఫోటో తీసే పద్ధతి ప్రవేశపెట్టడం వంటివి, ఉపాధి హామీ పథకం రద్దు క్రమంలోనే చోటు చేసుకుంటున్నాయని వారు తెలిపారు. ఈ క్రమంలో విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేసి యథావిధిగా పాత నిబంధనల మేరకే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గీతపనివారల సంఘం సభ్యత్వాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గీతపనివార్ల సంఘం సభ్యత్వ ప్రారంభ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గీతపనివార్ల సమస్యల పరిష్కారం కోసం కృషి జరుగుతుందన్నారు. సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసుకుని ప్రజా ఆందోళనలకు, డిమాండ్ల సాధనకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగభూషణం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్‌ను ఎస్పి రోహిత్ రాజ్ సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, సెల్ఫీ పాయింట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈనెల 26 వరకు అన్ని పాఠశాలలు, కళాశాలలు, పట్టణాలు, గ్రామాల్లో మాదక ద్రవ్యాల వలన కలిగే చెడు ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలని, పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని తెలిపారు. సమాజంలోమార్పు వచ్చిన నాడే డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించ గలమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్త,కదలికలను గమనించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం వంటి వాటిపై పోలీసులు శాఖ ఖఠినంగా వ్యవహరిస్తోందని, ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సేవ చేయాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** గ్రామాల్లో సేవాభావంతో పని చేసే గుణం ప్రతి ఒక్కరిలో ఉండాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఏన్కూరులో గ్రామీణ వైద్యుడు కొలిశెట్టి నరేష్ తన తండ్రి కొలిశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంఎల్‌ఏ ప్రారంభించారు. ఈసందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కొత్త మేడేపల్లి గొత్తికోయ గిరిజనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూర ప్రాంత గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యుడు కొలిశెట్టి నరేష్ సేవలను అభినందించారు. గొత్తికోయ గిరిజనుల అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుగులోత్ లచ్చిరామ్ నాయక్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్, జిల్లా నాయకుడు తంబళ్ల సామేలు, ఒబిసి ఓఘం మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు, నాయకులు మేడా ధర్మారావు, చింతనబోయిన సీతారాములు, చందమామ నరసింహారావు, పంతగాని నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలో రైతులకు యూరియా అందజేయాలి

రైతులకు ఇబ్బందికరంగా ఉన్న యూరియా యాప్ రద్దుచేయాలి
రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా రోశయ్య, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రైతులకు ఇబ్బందికరంగా ఉన్న యూరియా యాప్ ను తక్షణమే రద్దుచేసి, పాత పద్ధతిలో రైతులకు యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సాగు ప్రారంభమైన తరుణంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి వల్ల సాగుచేయడం భారమై రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయారని,పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో పండిన పంటలకు సరైన గిట్టు బాటు ధరలు లేక రైతాంగం దిక్కుతోచలేని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారని కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన ఎరువుల ధరలను, డీజిల్ పెట్రోల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా రెండు లక్షల రూపాయలు పైగా ఉన్న పంట రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలి మార్కెట్లో నకిలీ విత్తనాలు నాణ్యతలేని నకిలీ పురుగు మందులు అమ్ముతూ అన్నదాతల జీవితాలతో ఆడుకుంటున్న వ్యాపారులపై పిడి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, రైతు సంఘం నాయకులు యల్లంకి మధు, ఎస్.కె నాగుల్ మీరా, సిరిపురపు వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, పొనేకంటి వెంకటేశ్వర్లు, ఊడల సుధా, చెరుకుమల్ల రాజేశ్వరరావు, ఎస్.కె చాంద్ పాషా, చీమకుర్తి సంతోష్, పసుపులేటి పవన్, చీమకుర్తి భాస్కర్, వెంకటేశ్వర్లు, సురేష్, గోపి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి గనులను కోల్పోతే తెలంగాణ అంధకారం

కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాను రక్షించుకోపోతే తెలంగాణలో అనేక పరిశ్రమలు మూతపడతాయని తెలంగాణ అంధకారం అవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేవ్ మణుగూరు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిర్వహిస్తున్న ఈ పోరాటం మణుగూరు ఏరియా ప్రజల ఆత్మ రక్షణకు సంబంధించిన ఈ ప్రాంతం భవిష్యత్తులో మనుగడ సాధించాలంటే సింగరేణికి సంబంధించిన గనులు సంస్థకు రావాలని అన్నారు. ఓసి టు సైడ్ బ్లాక్ తో పాటుగా ఈ ప్రాంతంలో ఉన్న ఓసీలు విస్తరణ కోసం యజమాన్యం కృషి చేయాలని, లేని పక్షంలో ఈ ప్రాంత బొగ్గు పై ఆధారపడిన భద్రాద్రి పవర్ ప్లాంట్ హెవీ వాటర్ ప్లాంట్ ఐటిసి లాంటి పరిశ్రమల ఉనికికి ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉందని అన్నారు. సింగరేణి మణుగూరు ఏరియాను రక్షించుకోకపోతే ఈ ఈ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్న వేలాదిమంది కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని వెంటనే సింగరేణి యజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకారాన్ని కోరి ఈ ప్రాంతాన్ని రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కిష్టారం శివార్లలో కత్తులతో దాడి

• ఇద్దరు గ్రామస్థులకు తీవ్ర గాయాలు • భార్యాభర్తలు పరారీ





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ శివార్లలో కొబ్బరి బోండాలు కొట్టే కత్తులతో దాడి చేసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇది తప్పు,ఆపమన్నందుకు ఇలా ప్రాణాలు తీయ్యటానికి సిద్ధమయ్యారంటే సమాజం ఎటుపోతుందే అర్థం కావటం లేదని గ్రామస్తులు తలలు పట్టుకుంటున్నారు. బంధువులు, పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరు మండలానికి చెందిన నాగమణి, హనుమంతరావు దంపతులు కిష్టారం గ్రామ సమీపంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై కిష్టారం ఎస్సీ కాలనీకి చెందిన గ్రామ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావు వారిని కలిసి గ్రామ సమీపంలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, అది తీవ్ర స్థాయికి చేరి నాగమణి, హనుమంతరావు దంపతులు కొబ్బరి బోండాలు కొట్టే కత్తులతో దాడికి దిగినట్లు తెలిపారు. ఈ ఘటనలో మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే పక్కనున్న వారు 108కి సమాచారం అందించగా, అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఘటన అనంతరం నాగమణి, హనుమంతరావు పరారీలోకి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ వ్యవహారానికి సంబంధించి కొత్తగూడెంకు చెందిన సోని అనే మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గ్రామ శివారుల్లో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెలువడటం, వాటిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడం, అనంతరం హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటువంటి ఆరోపణలపై సంబంధిత శాఖలు ముందస్తుగా నిఘా పెట్టి చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు నివారించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై వి.ఎం. బంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## కాంగ్రెస్ పాలనలో రైతాంగం అరిగోస

• రైతుబంధును ఓట్ల పండుగగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం • ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం • మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**ప్రజాపక్షం/వైరా :** వైరాలోని కమ్మ వారి కళ్యాణ మండపం నందు వైరా నియోజక వర్గ బూత్ లెవల్, సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని బిఆర్‌ఎస్ పార్టీ నిర్వహించింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సిలు తాతా మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని, సామాన్య ప్రజలను నట్టేట ముంచిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసిఆర్ హయాంలో ప్రతి ఏడాది వరి నాట్లు పంటకు పంటకు రైతుబంధును అందించి అండగా నిలిచిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధును ఓట్ల పండుగగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పంటలకు పెట్టుబడి అందక అన్నదాతలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబీమా, రైతుబంధు అటకెక్కాయని బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతు చనిపోతే దశ దిన కార్యక్రమాలకు ఐదు లక్షల బీమా సొమ్మును వారి ఖాతాల్లో పడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రీమియం కూడా కట్టకపోవడంతో రూ.1400 కోట్లు ప్రీమియం బకాయి పడిందని విమర్శించారు. తక్కెళ్లపల్లి రవీంద్రరావు మాట్లాడుతూ సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓట్లను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ప్రతి కార్యకర్త బూత్ లెవల్‌లోనే జాగ్రత్త పడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు చిలక కోటయ్య, డి. వెంకటేశ్వర్లు, కట్టా స్వరూపరాణి, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, నాయకులు లకావత్ గిరిబాబు, బానోత్ మనీషాలక్ష్మి, బాదావత్ బాలాజీ, బానాల వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, పోట్ల శ్రీను, ఎల్లంకి సత్యనారాయణ, అయినాల కనకరత్నం, కె. శ్రీనివాసరావు, నూకల వాసు, మిట్టపల్లి కిరణ్‌కుమార్, చక్రవర్తి, ఎ. శ్రీనివాసరావు, హన్మంతరావు, కె. బోసు, దేవరాజు, పలు మండలాల బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆ వరి వంగడాన్ని అరికట్టేది ఎలా?

• కెఎన్‌ఎం 12510 రకంపై పలు అనుమానాలు • పరిశోధన కాకముందే మార్కెట్లోకి
• గత ఏడాది నష్టపోయిన రైతులు • తిరస్కరించిన మిల్లర్లు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** పరిశోధన సాగుతుండగానే ఓ వరి వంగడం మార్కెట్‌లోకి రావడం, దానిని గత ఏడాది రైతులు సాగు చేయడం, దానిపై భిన్న స్వరాలు వినబడటం జరిగింది. అయితే ఈ రకం ఇప్పుడు కూడా మార్కెట్‌లోకి ప్రత్యక్షమయ్యే ప్రమాదం ఉందని కొందరు రైతులు భావిస్తుండగా, దీనిని అరికట్టాల నిమరి కొందరు అంటున్నారు. ఇంకొదరైతే ప్రభుత్వం మద్దతు ధర కోసం ప్రకటించిన ఏడు వరి వంగడాల్లో ఈ రకం లేదని, దీనిని సాగు చేసే అవకాశం ఈసారి తక్కువని చెబుతున్నారు.

**గత ఏడాది పరిశోధన స్థాయిలోనే :** గత ఏడాది పరిశోధన స్థాయిలో ఉన్న కేఎన్‌ఎం 12510 రకం అసలు మార్కెట్లోకి ఎలా వచ్చిందో కూడా తెలియని పరిస్థితి. జిల్లాలో ఈ రకం విత్తనాలు కొందరు ఉపయోగించగా వారిలో దిగుబడి బాగా వచ్చిన వారు, దిగుబాటి ఆశించిన స్థాయిలో రాని వారు సైతం ఉన్నారు. ఈ విత్తనాలు మార్కెట్లోకి రావడం పట్ల అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. నష్టపోయిన రైతులు ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దిగుబడి తగ్గడం నాణ్యతా సమస్యలు తలెత్తడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సైతం వీటిని తిరస్కరించినట్లు తెలిసింది. అయితే పెద్దపల్లి పరిశోధనా కేంద్రంలో కేఎన్‌ఎం 12510 రకం బయటకు విడుదలయ్యే అవకాశం లేదని, ఈ విత్తనాన్ని పోలిన విత్తనాలు వచ్చి ఉంటాయని శాస్త్రవేత్తలు అంటున్నారు . ఈ మధ్య కాలంలో జిల్లా సమావేశంలో కలెక్టర్లు సైతం ఈ విషయాన్ని ప్రస్తావించడం గమనార్హం.

**మిల్లర్లు తిరస్కరించారు :** కెఎన్‌ఎం 12510 వరి వంగడాన్ని సాగు చేసి మిల్లర్లకు పంపగా వాటిని చాలా మంది మిల్లర్లు తిరస్కరించారు. ఎంతో కొంత తగ్గించి కొనుగోలు చేయాలని రైతులు కోరడంతో క్వింటాకు రూ.400 నుండి రూ.500 వరకు తగ్గించిన కొన్నారనే వాదన ఉంది. మిల్లర్లు ఈ బియ్యంతో అన్న వండి చూడగా, రూచిగా లేకపోవడంతో పాటు రంగు మారినట్లు తెలిసింది. వండిన తర్వాత కూడా త్వరగా నాణ్యత కోల్పోయే దశకు వచ్చినట్లు తెలిసింది. ఊరు పేరు లేని విత్తనాలు కొనుగోలు చేయరాదని, తద్వార దిగుబడి రాక నష్టపోయారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**ప్రభుత్వం బోనస్ ఇచ్చే విత్తనాలు ఇవే :** రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు ఏడు రకాల వరి వంగడాలను ఎంపిక చేసింది. వాటిని సాగు చేస్తేనే రైతులకు బోనస్ అందుతుంది. బిపిటి5204 సాంబామసూరి, ఆర్‌ఎన్‌ఆర్ 15048 తెలంగా సోన, హెచ్‌ఎంటి సోన, జై శ్రీరాం, కెఎన్‌ఎం1638, డబ్ల్యూజిఎల్ 44, జెఎన్‌ఎం7714 వరి వంగడాలు మాత్రమే సాగు చేయాలని, వాటికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు గమనించిన ప్రభుత్వ నిబంధ నల ప్రకారం సాగు చేయాలని సూచిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలి

కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన జిల్లా నలు మూలల నుండి తరలవచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆ వినతులను సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో తమ సమస్యలు తీరుతాయనే ఉద్దేశ్యంతో ఇక్కడి వరకు వచ్చిన ఫిర్యాదులు చేస్తుంటారని, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా అమలయ్యే సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. వచ్చిన ప్రతీ దరఖాస్తుని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై తగిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

# కేరళ అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

- పిఎం శ్రీకి వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి యత్నించిన ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్
- అడ్డుకున్న పోలీసులు, విద్యార్థి సంఘాల నేతలపై వాటర్ కెనాన్ల ప్రయోగం




**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సిపిఐ అనుబంధ విద్యార్థి, యువజన సంఘాల కార్యకర్తలపై పోలీసులు వాటర్ కెనాన్లు ప్రయోగించారు. పిఎంశ్రీ పథకానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతుండగా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. మాజీ మంత్రి, సిపిఐ ఎమ్మెల్యే కె. రాజన్ ఆ అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సమయంలో శాసనసభ వెలుపల ఈ ఘటన జరిగింది. ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎంశ్రీ) పథకం నుండి రాష్ట్ర ప్రభుత్వం వైదొలగాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ అనుబంధ సంస్థలైన 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్' (ఎఐఎస్ఎఫ్) 'ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్' (ఎఐవైఎఫ్) ఈ నిరసనను నిర్వహించాయి. ఈ పథకం అమలు కోసం గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

అయితే, సిపిఐ, ప్రతిపక్ష పార్టీల నిరసనల కారణంగా ఆ తర్వాత దీనిని నిలిపివేశారు. కాగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిఎం శ్రీ అంశంపై సిపిఐ(ఎం)కు వ్యతిరేకంగా ప్రచారం చేసిన యుడిఎఫ్, గత ప్రభుత్వం ఒప్పందంపై సంతకం చేసి నిధులు కూడా స్వీకరించినందున, ఆ ఒప్పందాన్ని రద్దు చేయడం సాధ్యం కాదని వాదిస్తోంది. ప్రభుత్వ వాదనను వ్యతిరేకిస్తూ సోమవారం ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలు అసెంబ్లీ కాంప్లెక్స్ వైపు ర్యాలీగా వెళ్లారు. కానీ శాసనసభకు సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా, రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సాగుతోంది. అయినప్పటికీ, నిరసనకారులు అక్కడే ఉండి నినాదాలు చేశారు, అక్కడి నుండి వెళ్ళడానికి నిరాకరించారు. తరువాత సిపిఐ ఎమ్మెల్యే రాజన్ నిరసన స్థలానికి చేరుకుని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. 'నిరసన శాంతియుతంగా జరిగింది. అయినప్పటికీ, రెండుసార్లు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. ఇందు కోసం మురికి నీటిని వాడారు. నేరస్థుల పట్ల కూడా ఇలాంటి చర్యకు పాల్పడరు' అని రాజన్ విలేకరులతో అన్నారు. నిరసనకారులు శాంతియుతంగా బైఠాయించిన సమయంలో తాను అక్కడికి చేరుకున్నానని ఆయన చెప్పారు. 'పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ, శాంతియుతంగా వెళ్ళిపోవాలని కోరుతుండగా, అసెంబ్లీలో సిపిఐ నాయకుడినని కూడా పరిగణనలోకి తీసుకోకుండా పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. మేము ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాము. దీనిని తేలికగా తీసుకోము' అని ఆయన అన్నారు. పిఎం శ్రీ ఒప్పందంపై సంతకం చేసిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పుడే సిపిఐ ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టింది. పిఎం శ్రీ ఒప్పందాన్ని రద్దు చేసే వరకు యుడిఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ ఆందోళనను కొనసాగించాలని పార్టీ నిర్ణయించిందని పార్టీ నాయకులు తెలిపారు.

# ప్రధాన్ రాజీనామా కోసం కాక్రోచ్ పట్టు

- మృతుల కుటుంబాలకు పరిహారానికి దీప్కే డిమాండ్
- నినాదాలు, ప్రసంగాలు, డప్పులమోత, సాంస్కృతిక ప్రదర్శనలు
- మూడోరోజు కొనసాగిన ధర్నా

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకత్వంలో విద్యార్థులు శనివారం మధ్యాహ్నం ప్రారంభించిన బైఠాయింపు ధర్నా జంతర్ మంతర్ వద్ద సోమవారం కూడా విరామం లేకుండా కొనసాగింది. ఉత్తరాఖండ్, ఒడిసా, ఉత్తర ప్రదేశ్ సహా సహా పలు రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు రాత్రీ పగలూ తేడా లేకుండా జంతర్ మంతర్ వద్దనే ఉంటూ నిరసన ప్రదర్శన కొనసాగించారు. విద్యార్థులు ఆదివారం రాత్రంతా నిద్రలేకుండా ప్రసంగాలు చేశారు. డప్పులు,పళ్ళాలు వాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ నినాదాలు చేశారు. మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ చప్పట్లు కొడుతూ నిరసన తెలియజేశారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. మధ్యమధ్యలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నిరసన ప్రదర్శకులకు కొంతమంది ఆహారం మంచినీరు ఇస్తూ కనిపించారు. నిర్వాహకుల సమాచారం ప్రకారం, ఈ బైఠాయింపు నిరసనలో 200 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న ప్రదర్శకుల చుట్టూ శాంతి భద్రతల పేరుతో ప్రభుత్వం గట్టి భద్రతావలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రదర్శకులున్న ప్రాంతం చుట్టూ బ్యారికేడ్లు నిర్మించారు. పేపర్ లీకేజీలను అరికట్టాలని,మంత్రి రాజీనామా చేయాలని, జవాబుదారీ ఉండాలని కోరుతూ సి.జె.పి ఇలా నిరసన ప్రదర్శన చేయడం ఇది రెండోసారి. దేశంలో మే మూడో తేదీన జరిగిన కీలకమైన నీట్ పరీక్షల నిర్వహణలో ప్రశ్నాపత్రాలు ముందుగానే బయటకు వచ్చాయని, తీవ్ర నిర్లక్ష్యం,అవకతవకలు జరుగుతున్నాయని, జవాబుదారీతనం లేదని కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే విమర్శించారు. కేంద్రమంత్రి ప్రధాన్ రాజీనామా చేసేవరకూ,సమస్య పరిష్కారమయ్యేవరకూ తమ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల రద్దు కారణంగా ర్యాంకులు కోల్పోయి నిరాశానిస్పృహతో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని దీప్కే డిమాండ్ చేశారు.

ఎఐఎస్ఎఫ్ ఉచిత గ్రంథాలయం ప్రత్యేక ఆకర్షణ జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులున్న సమీపంలో ఒక ఉచిత గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కాక్రోచ్ జనతాపార్టీ నిర్వహిస్తున్న ఆందోళనా కార్యక్రమంలో ఇదొక వినూత్నమైన ప్రత్యేకంగా అందరినీ ఆకర్షిస్తున్న అంశం. ఒక ఉత్తమస్థాయి విద్యావ్యవస్థను నిర్మించాలంటే అక్షరాస్యత,అధ్యయనం ఎంతో అవసరం అని ఈ సందర్భంగా ప్రదర్శకులు వాదించారు. ప్రదర్శనలో పాల్గొన విద్యార్థులు వ్యక్తిగతంగా సేకరించిన దాదాపు 100 పుస్తకాలను ఈ నిరసన ప్రదర్శన వద్ద ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఏర్పాటు చేసింది. "మా విద్యతో విద్యకోసం పోరాటం అనే పేరుతో ఈ ఉచిత గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకున్నాం, విద్యతో పోరాటం అనే అంశాన్ని ప్రధానంగా దృష్టికి తెచ్చేందుకే నిరసన ప్రదర్శన వద్ద దీనిని ఏర్పాటు చేశాం" అని ఎఐఎస్ఎఫ్ సభ్యుడు దేవాంగ్ అనికేత్ చెప్పారు. అదేవిధంగా ఒడిసా నుండి బబితా అంజలి (35) ఈ నిరసనలో పాల్గొంటున్నారు. ఆమె లివర్ క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. ప్రస్తుతం ఆమె అలాగే ఓర్చుకుంటూ ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. ఆమెకు 13 ఏళ్ళ వయసుగల కుమారుడు ఉన్నారు. ఆ కుమారుడు ఆమెకు కావాల్సిన ఔషధాలు, ఇతర సామాగ్రిని అందజేస్తున్నారు. "నేనొక తల్లిని, విద్యార్థులు మరణించారు,ఆ బాధ ఊహించలేను, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు, ఈ వార్తలు చదివాక ఇక్కడకు రావాలని నిర్ణయించుకున్నాను, నా కొడుకును సహాయంగా తెచ్చుకున్నాను, ఈ దేశంలో ప్రతి విద్యార్థి నా కొడుకు లాంటివాడే" అని ఆమె అన్నారు. శనివారంనాడు అంజలి ఒడిసా నుండి ఢిల్లీకి వచ్చారు. ఆమె ప్రదర్శన ప్రదేశంలోనే నిద్రిస్తున్నారు. అక్కడే ఉంటున్నారు. దేశంలో మార్పు తీసుకురావడానికి ఇదే సరైన సమయం అని అమె అన్నారు. జాతికి విద్యార్థులే వెన్నుముక అని వ్యాఖ్యానించారు. వారే దేశంలో కీలక పాత్ర వహిస్తారన్నారు.

# షిండే పార్టీలోఆరుగురు శివసేన (యుబిటి) అసమ్మతి ఎంపిలు



**ముంబయి :** దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఫిరాయింపు రాజకీయాలు నడుస్తున్నాయి. తాజాగా మహారాష్ట్రలోని శివసేన (యుబిటి)ని చీల్చారు. ఆ పార్టీకి చెందిన ఆరుగురు తిరుగుబాటు లోక్‌సభ ఎంపిలు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని అధికారిక శివసేనలో చేరారు. ఈ పరిణామం ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని పార్టీలో సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయడమే కాకుండా, పార్లమెంటరీ స్థాయిలో పార్టీ చీలికను తెచ్చింది. ఢిల్లీలో జరిగిన కీలకమైన శివసేన (యుబిటి) పార్లమెంటరీ పార్టీ సమావేశానికి గైర్హాజరైన ఐదు రోజుల తర్వాత, సోమవారం ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఎంపిలు షిండే పార్టీలో చేరారు. అనంతరం ఏకనాథ్ షిండే మీడియాతో మాట్లడుతూఈ పరిణామాన్ని 2022లో ఉద్ధవ్ థాక్రేపై తాను చేసిన తిరుగుబాటుకు కొనసాగింపుగా అభివర్ణించారు. దివంగత బాలాసాహెబ్ థాక్రే ఆశయాలను, శివసేనను కాపాడటానికి తాను గతంలో (జూన్ 2022లో శివసేన చీలిక సమయంలో) పార్టీలో తిరుగుబాటు తెచ్చానని, ఇప్పుడు, ఈ పరిణామం శివసేన విస్తరణలో రెండవ దశ అని షిండే స్పష్టం చేశారు. 'ఆపరేషన్ టైగర్' ఇప్పుడు పూర్తయిందని ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. శివసేన (యుబిటి)ను వీడిన లోక్‌సభ ఎంపిల్లో యవత్మాల్‌కు చెందిన సంజయ్ దేశ్‌ముఖ్, పర్బానీకి చెందిన సంజయ్ జాదవ్, ముంబయి నార్త్ ఈస్ట్‌కు చెందిన సంజయ్ దినా పాటిల్, హింగోలికి చెందిన నాగేశ్ పాటిల్–అష్టికర్, ధారాశివ్‌కు చెందిన ఓంప్రకాష్ రాజే నింబాల్కర్, షిర్డీకి చెందిన భాసాహెబ్ వాక్‌చౌరే ఉన్నారు. వీరంతా 2024 సాధారణ ఎన్నికల్లో బిజెపి, షిండే నేతృత్వంలోని శివసేన అభ్యర్థులను ఓడించి తమ స్థానాలను గెలుచుకున్నారు. ఈ ఫిరాయింపులు లోక్‌సభలో ఉద్ధవ్ థాక్రే పార్టీ ఉనికిని తగ్గించాయి. అలాగే, మహారాష్ట్ర రాజకీయాలను మార్చివేసిన 2022 నాటి చీలిక తర్వాత శివసేన (యుబిటి)కు ఇది అత్యంత కీలకమైన పార్లమెంటరీ ఎదురుదెబ్బగా నిలిచింది. 2024 సాధారణ ఎన్నికల్లో శివసేన (యుబిటి) మహారాష్ట్రలో తొమ్మిది లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది.

### తమిళనాడులో పూర్తి రైతు రుణమాఫీకి

# అసెంబ్లీ వద్ద ప్రతిపక్షాల నిరసన

**ముంబయి :** మహారాష్ట్ర రైతులకు కనీస సాంకేతిక షరతులతో పూర్తిగా వ్యవసాయ రుణలు మాఫీ చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అసెంబ్లీ వానాకాల సమావేశాలకు ముందు సోమవారం ఫడ్నవీస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు మహారాష్ట్ర శాసనసభ సముదాయం మెట్లపై నిరసన తెలిపాయి. శివసేన (యుబిటి) శాసనసభ్యులు ఆదిత్య థాక్రే, అంబాదాస్ దాన్వే, కాంగ్రెస్ నేత సతేజ్ పాటిల్ నేతృత్వంలో నిరసనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రుణ మాఫీని ప్రకటించినప్పటికీ, ఈ పథకానికి సంబంధించిన అనేక షరతుల వల్ల అర్హులైన చాలా మంది లబ్ధిదారులు దీనికి దూరమయ్యే అవకాశం ఉందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ పథకం నుండి కఠినమైన షరతులను తొలగించాలని, రైతులకు సంపూర్ణ రుణ మాఫీ కల్పించాలని కోరుతూ ఎన్‌సిపి (ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఈ నెల ప్రారంభంలో నిరసన తెలిపారు. 2న, మహారాష్ట్ర మంత్రివర్గం రూ. 36,585 కోట్ల వ్యవసాయ రుణ మాఫీ పథకానికి ఆమోదం తెలిపింది, దీనివల్ల దాదాపు 56 లక్షల మంది సాగుదారులు లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు. 'పుణ్యశ్లోక్ అహల్యాదేవి హోల్కర్ షెత్కారీ కర్జముక్తి యోజన' అనే ఈ పథకం రూ. 2 లక్షల వరకు వ్యవసాయ రుణ మాఫీని కల్పిస్తుంది. ఇందులో రుణ మాఫీ, వన్‌టైమ్ సెటిల్మెంట్, ప్రోత్సాహక ప్రయోజనాలు అనే మూడు అంశాలు ఉన్నాయి. అదే విధంగా అర్హత కోసం భూమి పరిమాణానికి సంబంధించిన నిబంధన ఏదీ పెట్టలేదు. రుణ మాఫీ విభాగం కింద, అసలు, వడ్డీతో కలిపి మొత్తం రూ. 2 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణాలు బకాయి ఉన్న రైతులు సంపూర్ణ రుణ విముక్తికి కల్పించనున్నారు. ఈ రుణాలు ఏప్రిల్ 1, 2019, మార్చి 31, 2025 మధ్య మంజూరై ఉండాలి. సెప్టెంబర్ 30, 2025 నాటికి గడువు ముగిసి ఉండాలి. మార్చి 31, 2026 వరకు చెల్లించబడకుండా ఉండాలి. రూ. 2 లక్షల కంటే ఎక్కువ బకాయిలు ఉన్న రైతులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విభాగం పరిధిలోకి వస్తారు. అటువంటి రుణగ్రహీతలు రూ. 2 లక్షలకు మించిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది, ఆ తర్వాత వారు రూ. 2 లక్షల మాఫీకి అర్హులవుతారు. బకాయి మొత్తంలో తమ వాటాను చెల్లించడానికి వారికి మార్చి 31, 2027 వరకు గడువు ఇవ్వబడింది.



### సామాజిక, రాజకీయ అణచివేతకు వ్యతిరేకంగా

# దేశ వ్యాప్తంగా ఉద్యమం

- క్షీణిస్తున్న ముస్లింల పరిస్థితిపై త్వరలో ఒక సమగ్ర పత్రాన్ని విడుదల చేస్తాం
- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రకటన




**న్యూఢిల్లీ :** దేశంలో క్షీణిస్తున్న ముస్లింల పరిస్థితిపై త్వరలో ఒక సమగ్ర పత్రాన్ని విడుదల చేస్తామని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) సోమవారం పేర్కొంది. అలాగే ఆ వర్గం ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ అణచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ప్రకటించింది. కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగిన మరసటి రోజు బోర్డు ఈ ప్రకటన చేసింది. సమావేశంలోని నిర్ణయాలు, చర్చల సారాంశాన్ని ఎఐఎంపిఎల్‌బి ప్రతినిధి ఎస్. క్యూ. ఆర్. ఇలియాస్ విలేకరులకు వెల్లడించారు. దేశంలో ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితిని బోర్డు వివరంగా సమీక్షించి, అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయాలు ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లింలపై పెరుగుతున్న మూకదాడులు లేదా హత్యాకాండలు; ముస్లింల ఇళ్లు, నివాస ప్రాంతాలు, మసీదులు, మదర్సాలను లక్ష్యంగా చేసుకుని కూల్చివేత చర్యలు; బుల్డోజర్లతో ఉగ్రవాదం; ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరి చేసే ప్రయత్నాలు; ప్రభుత్వ సహాయం పొందుతున్న మదర్సాలలో ఏకరూపత అమలు; వివిధ రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ హైకోర్టు సివిల్ కోడ్‌కు సంబంధించిన పరిణామాలు; కమల్ మౌలా మసీదుకు సంబంధించిన ఇటీవలి తీర్పు వంటి అంశాలకు సంబంధించినవి అని ఆయన అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు, దేశం, ముస్లిం సమాజంలో వేగంగా క్షీణిస్తున్న పరిస్థితి పట్ల కార్యనిర్వాహక కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ఆయన అన్నారు. 'ఒకవేళ సమస్య ముస్లింలకు సంబంధించినది అయితే, ఆ సమాజాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి కానీ మైనారిటీల గురించి సాధారణంగా చెప్పకూడదు' అని రాహుల్ గాంధీ అన్నట్లు వచ్చిన వార్తలపై ప్రశ్నించగా 'కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీల పట్ల మేము అసంతృప్తిగా ఉన్నాము. వాటిలో ఏదీ ముస్లింల సమస్యలను బలంగా లేవనెత్తడం లేదు' అని ఇలియాస్ అన్నారు. ప్రజల మనస్సాక్షిని మేల్కొల్పేందుకు, ముస్లిం సమాజం క్షీణిస్తున్న పరిస్థితి, మత ఉద్రిక్తతలు, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలపై ఒక సమగ్ర పత్రాన్ని తయారు చేసి ప్రచురించాలని కార్యనిర్వాహక కమిటీ నిర్ణయించింది అని ఆయన అన్నారు. ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) పేరుతో బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న శాసనపరమైన ప్రయత్నాలపై కార్యవర్గ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ఇల్యాస్ చెప్పారు. ఉత్తరాఖండ్, గుజరాత్ తర్వాత, ఇప్పుడు అసోం, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో కూడా యుసిసిని అమలు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని సమావేశం గుర్తించింది.

# ఖటార్ గ్యాస్ క్షేత్రంలో పేలుడు

### 13మంది మృతి : మృతుల్లో 12 మంది భారతీయులు

**దోహ :** ఖటార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ ఎగుమతి కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13 మంది మరణించినట్లు ఖటార్ ఇంధన శాఖ మంత్రి వెల్లడించారు. అందులో 12 మంది భారతీయులు ఉన్నారు. పదుల సంఖ్యలో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మరో 18 మంది ఆచూకీ గల్లంతైంది. మార్చి నెలలో ఇరాన్ దాడిలో రస్ లాఫాన్ ప్రాంతంలో మిసైల్ పడడంతో భారీ అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. అప్పటినుంచి ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కార్మికులు పనిచేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించిందని ఖటార్ ఎనర్జీ వెల్లడించింది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, మంటలు చెలరేగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని రక్షణ చర్యలు ప్రారంభించాయి. మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాదం జరిగినప్పటికీ, ఎటువంటి గ్యాస్ లీకేజీ లేదా ప్రజలకు ప్రమాదం కలిగించే పరిస్థితి లేదని అధికారులు స్పష్టం చేశారు. రస్ లఫాన్ ప్రాంతంలో భద్రతా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా గ్యాస్ ప్లాంట్ పరిసర ప్రాంతాలను తాత్కాలికంగా ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు. పేలుడు కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. సాంకేతిక లోపమా, భద్రతా వైఫల్యమా లేదా ఇతర కారణాలా అన్నది దర్యాప్తు తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే సాంకేతిక నిపుణుల బృందాలు ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించాయి. ప్రస్తుతం రక్షణ బృందాలు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

#### ప్రపంచ ఇంధన సరఫరాలపై ప్రభావం

ఈ ఘటన ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఖటార్ ప్రపంచంలో అతిపెద్ద ఎల్ఎన్‌జి ఎగుమతి దేశాల్లో ఒకటి. ఈ టెర్మినల్‌లో ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో సరఫరా ఒత్తిడి పెరగవచ్చు.

## అయోధ్య రామాలయంలో

# రూ.200 కోట్లు మాయం?

- హుండీ లెక్కింపులో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు
- ఆలయ కమిటీ సభ్యులపై ఆరోపణలు
- రాత్రికి రాత్రే కోటీశ్వరులైన కూలీలు
- విచారణ అధికారులను నియమించిన ప్రధాని
- పోలీసుల అదుపులో అనుమానితులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోట్లాది మంది హిందువుల ఆరాధ్య క్షేత్రమైన అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరంలో భారీ ఆర్థిక అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆలయ హుండీల లెక్కింపులో అవకతవకలు జరిగి దాదాపు రూ.200 కోట్ల మేరకు నిధులు దుర్వినియోగమయ్యాయని చర్చ జరుగుతున్నది. పక్కా పథకం ప్రకారమే ట్రస్టు సభ్యులు ఈ దోపిడీకి పాల్పడ్డారని, హుండీ లెక్కింపులో పాల్గొన్న రూ.15 వేలతో పనిచేసే సాధారణ కూలీలు రాత్రికి రాత్రే కోటీశ్వర్లు కావడంపై సహోద్యోగులు, స్థానికులలో చర్చ జరుగుతున్నది. ఈ కుంభకోణంపై వాస్తవాలు బయటికి తీయడానికి ప్రధాని మోదీ ఇటీవలే ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించడం గమనార్హం. దర్యాప్తు పూర్తయితే గానీ నిజమైన దోషులు, వారి ఆస్తులు బయటపడతాయని భావిస్తున్నారు.

### 2024-25లో రూ.327 కోట్ల ఆదాయం

అయోధ్యలో రామమందిరం ప్రారంభం అనంతరం భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022లో సుమారు 2.39 కోట్ల మంది, 2023లో 5.75 కోట్ల మంది, 2024లో 16.40 కోట్ల మంది, 2025లో 30 కోట్ల మంది వరకు అయోధ్యను సందర్శించినట్లు వివిధ అంచనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ కోట్ల రూపాయల విరాళాలు ఆలయానికి చేరుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 202425 ఆర్థిక సంవత్సరంలో ఆలయ ట్రస్ట్‌కు రూ.327 కోట్ల మేరకు ఆదాయం వచ్చినట్లు సమాచారం. ఇందులో రూ.153 కోట్లు భక్తుల విరాళాల రూపంలో రాగా, మిగిలిన రూ.173 కోట్లకు పైగా బ్యాంకుల్లో నిల్వ ఉన్న నిధులపై వచ్చిన వడ్డీ రూపంలో సమకూరినట్లు పేర్కొంటున్నారు. ఆలయ నిర్మాణం కోసం గతంలో దేశవ్యాప్తంగా సేకరించిన వేల కోట్ల రూపాయల నిధులలో కొంత మొత్తం బ్యాంకుల్లో నిల్వ ఉంచినట్లు తెలుస్తోంది.

### హుండీ లెక్కింపులో అక్రమాల ఆరోపణలు

ఆలయంలోని సుమారు 40 హుండీల నుంచి వచ్చే నగదు, బంగారం, వెండి తదితర విరాళాల లెక్కింపునకు ప్రత్యేక వ్యవస్థ అమలులో ఉంది. డబ్బు సేకరణ, వర్గీకరణ, పర్యవేక్షణ, బ్యాంకింగ్, ఆడిట్ తదితర బాధ్యతల కోసం వేర్వేరు బృందాలు పనిచేస్తున్నాయి. మొత్తం ప్రక్రియ సీసీ కెమెరాల నిఘాలోనే జరుగుతుందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. అయితే హుండీల నుంచి సేకరించిన నగదును బండిళ్లుగా సిద్ధం చేసే సమయంలో అదనపు కట్టలను కలిపి, అనంతరం వాటిని మళ్లీ లెక్కింపులోకి తీసుకురాకుండా మళ్లించారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో పలువురు సిబ్బంది, పర్యవేక్షకులు, ఇతర బాధ్యుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మాజీ ఉద్యోగి ఆరోపణలు

నగదు కౌంటింగ్ విభాగంలో పనిచేసిన మహిపాల్ అనే మాజీ ఉద్యోగి 2021 22 కాలంలోనే ఈ అక్రమాలపై అంతర్గతంగా ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తన ఫిర్యాదులను పట్టించుకోకపోగా ఉద్యోగం నుంచి తొలగించారని, ప్రస్తుతం పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ అవకతవకలపై మాట్లాడుతున్నట్లు సమాచారం.

### కోటీశ్వరులుగా సాధారణ కూలీలు!

కొంతమంది ఉద్యోగులు నెలకు రూ.14 వేల నుంచి రూ.16 వేల జీతాలు పొందుతూ ఇటీవల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, వాహనాలు, హోటళ్లు, వ్యాపారాలు సంపాదించారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సహోద్యోగులు, స్థానిక ప్రజలలో అనుమానాలు వ్యక్తమయ్యాయని సమాచారం.

### ప్రతిపక్షాల విమర్శలు

సమాజ్‌వాదీ పార్టీ నేత పవన్ పాండే జూన్ 7న మీడియా సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశం కావడంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఈ ఆరోపణలను ట్రస్ట్ సభ్యుడు చంపత్ రాయ్ తీవ్రంగా ఖండించారు. తమపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని, రాజకీయ ఉద్దేశాలతో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

### ప్రధానమంత్రి కార్యాలయం దృష్టికి అంశం

అయోధ్యకు చెందిన బిజెపి నాయకుడు రజనీష్ సింగ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసి ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంపై జోక్యం చేసుకోవాలని కోరినట్లు సమాచారం. అనంతరం ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఈ వ్యవహారంపై వివరాలు సేకరిస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

### యోగి ప్రభుత్వం అప్రమత్తం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారని, సంబంధిత అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి వాస్తవాలను వెలికితీసే ప్రక్రియ కొనసాగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. పోలీసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సంకేతాలు ఉత్తర్‌ప్రదేశ్ అధికారులు ప్రకటించారు. వివిధ ఘటనలకు పాల్పడిన వారికి ఎన్‌కౌంటర్ల శిక్ష వేసిన యోగి ప్రభుత్వం ఏకంగా దేవుడి సొమ్మును దోచుకున్న దోషులకు ఎలాంటి శిక్ష వేస్తారోనని అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# గణాంకాల తారుమారు వెనుక రాజకీయ తంత్రం

### గ్రామీణ వేతన లెక్కలకు సంబంధించి మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్

**న్యూఢిల్లీ :** గ్రామీణ వేతనాల పెరుగుదలను మోదీ ప్రభుత్వం తారుమారు చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. చాపకింద నీరులా ఈ చర్యకు పూనుకుంటోందని మండిపడింది. 2018 ఆర్థిక సంవత్సరం నుండి 16.8 కోట్ల ఉద్యోగాలు పెరిగాయని నరేంద్ర మోదీ ప్రభుత్వం చెబుతోందని, అయితే ఉద్యోగ కల్పనలో భారీ వృద్ధిని చూపించడానికి మోదీ ప్రభుత్వం ఆర్‌బిఐ ద్వారా ఉపాధి నిర్వచనాన్ని మార్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ పేర్కొన్నారు. 2024లోనే తమ పార్టీ ఈ విషయాన్ని ఎత్తిచూపిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్తుచేశారు. ఆర్‌బిఐ చే తమ ప్రయత్నాలకు ప్రతిఫలంగా మోదీ ప్రభుత్వంలో కీలక పదవులను పొందిందని రమేశ్ ఆరోపించారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం గ్రామీణ వేతనాల విషయంలో అదే ప్రయత్నం చేస్తోందని 'ఎక్స్' వేదికగా రమేశ్ పేర్కొన్నారు. 'భారత ఆర్థిక మందగమనానికి మూల కారణం వాస్తవ వేతనాల స్తబ్దతేనని, ఇది వినియోగ వృద్ధిని బలహీనపరిచి, ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరిచిందని మేము నిరంతరం ఎత్తిచూపుతూనే ఉన్నాము. ఈ పాపాన్ని సరిదిద్దలేక, మోదీ ప్రభుత్వం ఇప్పుడు గ్రామీణ వేతనాల పెరుగుదలను తారుమారు చేస్తోందని' రమేష్ ఆరోపించారు. జూన్ 2025 నుండి మార్చి 2026 మధ్య కాలంలో నమోదైన వార్షిక గ్రామీణ వేతన వృద్ధి 6 శాతం నుండి 1718 శాతానికి పెరిగిందని, ఒక్క నెలలోనే సగటు రోజువారీ వేతనాలు 12.7 శాతం పెరిగాయని ఆయన ఎత్తి చూపారు. వేతనాలలో ఈ వృద్ధి ఒక పద్ధతిలో మార్పు ద్వారా సృష్టించబడిందన్నారు. లేబర్ బ్యూరో ఎలాంటి పత్రికా ప్రకటన లేదా వెబ్‌సైట్ వెల్లడి లేకుండా ఒక కొత్త శాంప్లింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను అవలంబించిందని, ఇది అనేక ఈశాన్య రాష్ట్రాలు, ఎన్‌సిటి ఢిల్లీ, గోవా నుండి కార్మికులను నమూనా పూల్‌లోకి తీసుకువచ్చిందని ఆయన అన్నారు. భారతదేశ కార్మిక శక్తిలో కేవలం 1.2 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, ఈ కొత్త డేటా సేకరణ పాయింట్లు మొత్తం నమూనాలో 11 శాతం వాటాను కలిగి ఉన్నాయని రమేశ్ అన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, కొత్తగా చేర్చిన ప్రాంతాలలో వ్యవసాయ ఉపాధి చాలా తక్కువగా, అధిక నైపుణ్యం గల కార్మికులు ఎక్కువగా ఉండటం వలన, వారి సగటు వేతనాలు పాత నమూనా కంటే 50–55 శాతం ఎక్కువగా ఉన్నాయని రమేశ్ అన్నారు. వాస్తవానికి, వేతనాల డేటా విశ్లేషణ ప్రకారం, నిజమైన వేతన వృద్ధి సంవత్సరానికి సుమారు 4.3 శాతం మాత్రమే ఉండేదని, ఇది గత నాలుగేళ్లలో అత్యంత బలహీనమైన వృద్ధి అని ఆయన అన్నారు. 'ఇది డేటాను తారుమారు చేసే మొత్తం రాజకీయ శాస్త్రం ప్రదర్శన' అని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేస్తూ రమేశ్ అన్నారు.

## ఇథియోపియాలో అధికారపార్టీ గెలుపు



**ఆడిస్ అబాబా:** తూర్పు ఆఫ్రికా సోమాలియా ద్వీపకల్ప ప్రాంత దేశం ఇథియోపియా (ఎఫ్‌డిఆర్ ఇ)లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అధికారపార్టీ తిరిగి విజయం సాధించింది. ప్రధానమంత్రి అబియ్ అహ్మద్‌కు చెందిన ప్రాస్పరిటీ పార్టీ భారీ మెజారిటీ సంపాదించింది. పార్లమెంటు దిగువసభలో 486 స్థానాలు ఉండగా, అధికార పార్టీ 438 స్థానాలు గెలుచుకుందని ఎన్నికల సంఘం ఎన్ఇబిఇ ఛైర్‌పర్సన్ మెలాట్ వర్క్‌హైలు ప్రకటించారు. ట్రిగే,అమ్హారా,ఒరేమియా తదితర ప్రాంతాలలో దేశ పార్లమెంటుకు సంబంధించిన ఓటింగ్ నిలిపివేశారు. జాతీయవాద తిరుగుబాట్ల కారణంగా ఈ మూడు ప్రాంతాలలోనూ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అమ్హారాలో సమాఖ్య ప్రభుత్వానికీ, ఫానో జాతీయవాద గ్రూపులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఓరోమియాలో లిబరేషన్ ఆర్మీ తిరుగుబాటుదారులు పోరాటం చేస్తున్నారు. ఈ పరిస్థితి దేశవ్యాప్తంగా ఘర్షణలకు దారితీస్తుందని కొందరు హెచ్చరించారు. విధానసభ ఎన్నికలు మాత్రం అక్కడ జరిగాయి. ప్రధానమంత్రి అబియ్ అహ్మద్ పార్టీకి వ్యతిరేకంగా దేశంలో 40 పార్టీలు పోటీ చేశాయి. కానీ వాటికి నిధుల కొరత కారణంగా ప్రచారం సరిగ్గా లేదు. కాగా 64 నియోజక వర్గాలలో అధికారపార్టీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

# ప్రధాని పగ్గాలు చేపడతా: బర్న్‌హాం

### స్టార్‌మర్ నిర్ణయం దేశ పరివర్తనకు దోహదం ఎంపిగా బాధ్యతలు స్వీకరణ



**లండన్:** స్టార్‌మర్ స్థానంలో ప్రధానమంత్రి బాధ్యతలు చేపడతానని ఉప ఎన్నికల్లో బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ ఆండీ బర్న్‌హాం ప్రకటించారు. స్టార్‌మర్ రాజీనామా తర్వాత మొదటిసారి ఆయన సోషల్ మీడియా ద్వారా ఆదివారం స్పందిస్తూ,ప్రధాని బాధ్యతలు చే పట్టే ప్రయత్నం చేస్తానన్నారు. సర్‌కీర్ స్టార్‌మర్ మ న దేశానికి అపారమైన సేవలు అందించారని చెప్పా రు. ఇంతటి సవాలుతో కూడిన సమయంలో ఆయ న నాయకత్వానికీ, అపారమైన అంకితభావానికి తాను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నా న్నారు.

"కీర్ తీసుకున్న నిర్ణయం దేశ పరివర్తనకు దోహదం చేస్తుంది, ఇకమీదట ఈ ప్రక్రియ సజావుగా, బాధ్యతాయుతంగా పూర్తికావాల్సి ఉంది, ఇందులో భాగంగా ప్రభుత్వ బాధ్యతల నిర్వహణకు నా పేరు ప్రతిపాదిస్తాను, దేశం స్థిరత్వాన్ని ఆశిస్తోంది, సమస్యల పరిష్కారాన్ని కోరుకుంటోంది, దేశం కోరిక నెరవేరుతుంది, ఈ దశలో ముందుకు అడుగులు వేసేటప్పుడు మనందరి ఐక్యతా చాలా ముఖ్యం, మనందరం కలిసి పనిచేయడమే ప్రాధాన్యతాంశం గా ట ఉండాలి" అని బర్న్‌హాం పేర్కొన్నారు. ఆర్థికవృద్ధి, జీవన వ్యయం, గృహవసతి,కొత్త తరానికి అవకాశాలు, ప్రజాసేవలను ప్రజలు కోరుకుంటున్నారు, వీటిని నెరవేర్చడంలో రాజకీయ మార్పులు ప్రభావం చూపించకూడదు, వారి సమస్యల ప్రాధాన్యతను దారి మళ్ళించకూడదు, కార్మిక ఉద్యమం కూడా ఆత్మవిశ్వాసంతో ఒక లక్ష్యంతో ముందుకు వెళ్ళినప్పుడే అత్యంత బలంగా ఉంటుంది, స్టార్‌రాజీనామాతో రాబోయే పరివర్తన మన పార్టీకి,దేశానికీ ఒక సానుకూల పునరుద్ధరణ ప్రక్రియలా ఉండే లా చూసుకుందాం" అని సోషల్ మీడియా పోస్టింగ్‌లో ఆయన పేర్కొన్నారు. పార్టీని నడిపించే ఏకైక నాయకుడుగా బర్న్‌హాంపై లేబర్‌పార్టీ గంపెడాశలు పెట్టుకుంది.

బర్న్‌హాం సోమవారం ఉదయం మాంచెస్టర్ నుండి తన బృందంలో బయలుదేరి 10.30 గంటలకు లం డన్ చేరుకున్నారు. అక్కడి నుండి 'మీడియా సము ద్రం' మధ్యలోంచి నడచుకుంటూ పార్లమెంటులోకి ప్రవేశి ంచారు. దిగువసభ ఎంపీగా ప్రమాణ స్వీకా రం చేశారు. ఇప్పుడు మీ మనసులో భావోద్వేగాలు ఎలా ఉన్నాయని బర్న్‌హాంను ఒక సీనియర్ జర్నలిస్టు అడిగినప్పుడు మేకర్‌ఫీల్డ్ నియోజకవర్గంలో విజయం సాధించడం, వారికి ప్రాతినిధ్యం వహించడం ఒక గొప్ప గౌరవం, వారి సమస్యల పరిష్కారంపైనే నా దృష్టంతా కేంద్రీకరించా" అన్నారు.

**వెస్‌స్ట్రీటింగ్ మద్దతు**

స్టార్‌మర్‌పై వ్యతిరేకతతో పదవికి రాజీనామా చేసిన ఆయన మంత్రివర్గసభ్యుడు,బ్రిటన్ మాజీ ఆరోగ్యశాఖామంత్రి వెస్ స్ట్రీటింగ్ ఈ పరిణామాలపై స్పం దిస్తూ, బర్న్‌హాంకు తన పూర్తి మద్దతు ప్రకటించా రు. పదవికి రాజీనామా చేసిన స్టార్‌మర్‌ను ఆయన ప్రశంసిస్తూనే విమర్శించారు. బర్న్‌హాంకు మద్దతు ఇచ్చారు. "కీర్ మనల్ని సార్వత్రిక ఎన్నికల్లో గొప్ప విజయం దిశగా నడిపించారు, అది ఎవరూ ఊహించలేదు, ఇరాన్‌లో యుద్ధానికి దూరంగా ఉంచారు, ప్రధానమంత్రిగా స్వదేశంలో నిజమైన పురోగతి సాధించారు, తాను కాపాడిన లేబర్‌పార్టీ నాయక త్వ బాధ్యతల నుండి తప్పుకోవాలన్న ఆయన ని ర్ణయం మాత్రం సరైనదే" అని పేర్కొన్నారు. పార్టీ ఇటీవల భయంకరమైన అపజయాలతో నిరాశలో కూరుకుపోయిన తర్వాత మేకర్‌ఫీల్డ్‌లో విజయం పార్టీలో ధైర్యాన్ని నింపిందన్నారు. దేశంలో మార్పు తీసుకురావడానికి ఆయన సహాయం అవసరమన్నారు.

### కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు

## వెంట్రుకవాసి మెజార్టీతో ట్రంప్ అనుచరుడు గెలుపు



**బోగోటా:** కొలంబియా అధ్యక్ష పదవికి జరిగిన తుది విడత ఎన్నికల ఫలితాల్లో 99 శాతం కౌంటింగ్ పూర్తయ్యేనాటికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశీర్వాదాలు ఉన్న ఆయన అనుచరుడు, మితవాద నాయకుడు అబెలార్డో డి లా యెస్ప్రియెల్లా (28) అతిస్వల్ప తేడాతో విజయం సాధించినట్లు అనధికారిక సమాచారం. ఒకశాతం కంటే తక్కువ ఓట్లతో ఆయన గెలిచారు. ఐతే ఈ విజయాన్ని వామపక్ష నాయకుడు, ఆయన ప్రత్యర్థి సెపెడా ఇంకా అంగీకరించలేదు. అధికారిక సమాచారం వచ్చిన తర్వాతమే తాను స్పందిస్తానన్నారు. ఆగస్టు ఏడో తేదీన ఆయన దేశాధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు తీసుకుంటారు. నెబ్రిజా యూనివర్సిటీలో ఆయన అడ్మినిస్ట్రేటివ్ లా పట్టా తీసుకున్నారు. సుసంపన్నమైన,ప్రజాస్వామ్యబద్ధమైన, విశ్వసనీయమైన కొలంబియాను నిర్మిస్తానని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థితో ఆయన హోరాహోరీ పోరాటం చేసి చివరకు వెంట్రుకవాసి మెజార్టీతో గెలిచారు. దేశంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సాయుధ ముఠాలు, మాదకద్రవ్య ముఠాలకు వ్యతిరేకంగా సైనిక చర్యలు చేపడతానని ప్రజలకు వాగ్దానం చేశారు. తన వాగ్దానం నిలబెట్టుకుంటానన్నారు. వామపక్ష నాయకుడు,దేశాన్ని నాలుగు సంవత్సరాలు పరిపాలించిన అధ్యక్షుడు గుస్తావో పెట్రో మరోసారి పోటీ చేసేందుకు రాజ్యాంగ నిబంధనలు అనుమతించకపోవడంతో వామపక్ష నాయకుడు ఇవాన్ సెపెడా పోటీ చేశారు. మొదటిరౌండ్ ఎన్నికల్లో సెపెడా ఆధిక్యత సంపాదించారు. కానీ రెండో రౌండ్‌లో వెంట్రుకవాసి తేడాతో 50.1 శాతం ఓట్లతో యెస్ప్రియెల్లా గెలిచారు. డిఫెండర్స్ ఆఫ్ ద హోమ్‌లాండ్ పేరుతో ఆయన సొంతపార్టీ ఏర్పాటు చేసి ట్రంప్ మద్దతుతో గెలిచిన మితవాద నాయకుడు.

## అభివృద్ధి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయు సేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్ఓ, హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డిఆర్‌డిఓ, డిఆర్‌డిఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు, సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## ఉక్రేన్‌లో వ్యూహాత్మక నగరాన్ని చుట్టుముట్టిన రష్యా





**కీవ్:** ఉక్రేన్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన కోస్త్యాంటినివ్కా నగరాన్ని రష్యా దళాలు చుట్టుముట్టాయి. ఈ నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయని పాశ్చాత్య మీడియా ప్రకటించింది. ఈ నగరాన్ని స్వాధీనం చేసుకుంటే ఇక రష్యా పూర్తిగా డాన్‌బాస్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తన అధీనంలోకి తెచ్చుకున్నట్లవుతుందని నివేదికలు తెలిపాయి. రష్యా దళాలు భారీ సంఖ్యలో కోస్త్యాంటినివ్కా నగరంలోకి చొరబడి నగరాన్నిపూర్తిగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఈ నగరం గ్రే జోన్‌లో ఉందని, తమ నియంత్రణలో లేదని ఉక్రేన్ సైనికులు బ్రిటన్ మీడియాకు చెప్పారు. డాన్‌బాస్ ప్రాంతానికి కోస్త్యాంటినివ్కా నగరం ముఖద్వారం వంటిది. ఈ నగరాన్ని స్వాధీనం చేసుకుంటే ఇక పూర్తిగా డాన్‌బాస్‌ను స్వాధీనం చేసుకున్నట్టే. వెనకనుండి ఈ ప్రాంతంలోకి వారు చొరబడుతున్నారని, ఈ దశలో వారిని వెళ్ళగొట్టడం సాధ్యంకాదని ఒక ఉక్రేన్ డ్రోన్ పైలట్ చెప్పారు.

గడచిన కొద్ది రోజులుగా ఉక్రేన్–రష్యా మధ్య పరస్పర భీకర డ్రోన్‌దాడులు,క్షిపణి దాడులు పెరిగాయి. మరణాల సంఖ్య కూడా పెరిగింది. యూరప్ ద్వారా కొత్తతరం బలమైన ఆయుధాలు సంపాదించిన ఉక్రేన్ రష్యాలోని కర్మాగారాలు,గ్యాస్‌ప్లాంటులు,చమురు నిల కేంద్రాలపై కూడా దాడులు చేస్తూ నష్టాలు కలిగిస్తోంది. ఇటీవల మాస్కో పరిసర ప్రాంతాలలో చేసిన దాడులు ఉక్రేన్ సమకూర్చుకున్న సరికొత్త సామర్థ్యానికి చిహ్నంగా భావిస్తున్నారు. ఉక్రేన్ కిరాయి సైనికులను ఉపయోగిస్తోందని రష్యా ఆరోపిస్తోంది.

## స్టార్‌మర్ హుందాతనంపై పలువురు ప్రశంసల జల్లు



**లండన్:** సవాళ్ళు–ప్రతిసవాళ్ళు,పోటీ లేకుండా కీర్ స్టార్‌మర్ మిత్రుల మాటలు మన్నించి సగౌరవంగా పదవి నుండి వైదొలడంపట్ల అనేకమంది ప్రశంసలు కురిపించారు. లేబర్‌పార్టీలో ఆయన మంత్రివర్గంలో అనేక మంది సీనియర్ నాయకులు,మిత్రులు ఆయనపై ప్రశంసలు కురిపించారు. ఆయన సరైన నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. ఉప ప్రధానమంత్రి డేవిడ్ లమ్మీ స్పందిస్తూ, రాజీనామా చేయడం ద్వారా స్టార్‌మర్ మంచితనం, హుందాతనం,మర్యాద బహిర్గతమయ్యాయన్నారు. ఆయన మర్యాదస్థుడు,సూత్రబద్ధుడు, మంచిమనిషి, 2019లో ఎన్నికల తర్వాత పార్టీని ఘనవిజయం వైపు తీసుకువెళ్ళారన్నారు. వ్యవస్థను స్థిరీకరించారని, ఉక్రేన్‌కు అండగా నిలిచారని, దేశంలో యూదు వ్యతిరేకతను నిర్మూలించారని, దేశ ప్రతిష్ఠను పునరుద్ధరించారని చెప్పారు.

హోంమంత్రి షబనా మహ్మద్ మాట్లాడుతూ, కీర్ కష్టకాలంలో ఉన్నపార్టీని అద్భుత విజయం వైపు నడిపించారని, ఈనాడు సరైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన విజయాలను పార్టీ ఎన్నటికీ మరచిపోదన్నారు. పార్టీ, దేశం ఆయనకు ఎంతగానో రుణపడి ఉందని కార్మిక,పెన్షన్లశాఖామంత్రి పాట్ మెక్‌ఫాడెన్ సోషల్ మీడియాలో రాశారు. టెన్‌డౌనింగ్ స్ట్రీట్ వెలుపల సోమవారం స్టార్‌మర్ చేసిన తుది ప్రకటన ఆయన హుందాతన్నాని,నిజాయతీని చాటి చెప్పిందని ఇంధనశాఖామంత్రి ఎడ్ మిలిబాండ్ పేర్కొన్నారు.ఆయన ముఖ్యకార్యదర్శి డారెన్ జోన్స్ కూడా స్పందిస్తూ, వారి కుటుంబం క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. స్కాట్‌లాండ్ ప్రథమ మంత్రి జాన్ స్విన్నీ స్పందిస్తూ, స్టార్‌మర్ సరైన నిర్ణయం తీసుకున్నారని, కఠోర వాస్తవాలను ఎదుర్కోవడానికి ఇదే సరైన సమయమని అన్నారు. కేవలం నాయకులను మాత్రమే మార్చడం సరైన చర్య కాదని, దిశానిర్దేశంలో మార్పు రావాలన్నారు. లేబర్‌పార్టీ పాలనా కాలం వైఫల్యాలతో,తప్పుడు నిర్ణయాలతో నిండిపోయిందని విమర్శించారు.

# డిటిఓ వెంకన్నపై దూసుకెళ్లిన లారీ

### అక్కడికక్కడే దుర్మరణం
### భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లో ఘటన



**ప్రజాపక్షం/భూపాలపల్లి/హైదరాబాద్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లో లారీ స్పీడుతో వచ్చి డిటిఓ వెంకన్నను ఢీ కొట్టడంతో ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఉదయం సుమారు 09:30లకు పరకాల భూపాలపల్లి 353సి ప్రధాన రహదారి లో కెటిపిపి చెల్పూర్ ఆర్టీవో కార్యాలయం ఎదురుగా మార్ల ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన బొగ్గు లోడ్‌తో వెళ్తున్న టిఎస్ 22T2687 లారీని మహ్మద్ తస్లీమ్ నడుపుతూ జెన్‌కో వైపు వెళ్తుండగా, జిల్లా రవాణా అధికారి వెంకన్న తమ వాహనం (టిఎస్ 03F జి 3339) నుండి దిగి, ఆర్టీఓ కార్యాలయ ప్రాంగణంలోకి సీజ్ చేసిన హార్వెస్టర్ వాహనాన్ని ప్రవేశపెట్టేందుకు రోడ్డుపై వాహనాల రాకపోకలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాన్ని నడుపుతూ డిటిఓ వెంకన్నను ఢీ కొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించడం జరిగింది. పొట్ట, నడుం భాగాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంకన్నను ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న స్వస్థలం ఉమ్మడి వరంగల్ మహబుబాద్ జిల్లా మరిపెడ బంగ్లా గా అధికారులు తెలిపారు. మృతుడు వెంకన్నకు భార్యతో పాటు ఇద్దరు అమ్మాయిలు, ఒక్క అబ్బాయి ఉన్నారు. 2012 బ్యాచ్‌కి చెందిన జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న ఇటీవలే బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ ఆర్టీవో పని చేసిన సంధాని గత 15 రోజుల క్రితం జగిత్యాల జిల్లా కు బదిలీపై వెళ్లడంతో జగిత్యాలలో పని చేసిన వెంకన్న జయశంకర్ భూపాలపల్లి డిటిఓగా వెంకన్న బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే విధి నిర్వహణలో మంచి పేరు ప్రఖ్యాతలు గాంచిన వెంక న్నవిధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం వెంకన్న మృతి పట్ల పలువురు అధికారులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

**సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి :**

భూపాలపల్లిలో విధి నిర్వహణలో ఉన్న డిటిఓ ఎం.వెంకన్న మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రవాణా శాఖ జాయింట్ కమిషనర్‌ను ఆదేశించారు. వెంకన్న కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు. భూపాలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విధినిర్వహణలో ఉన్న డిటిఓ వెంకన్న మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపాన్ని చేశారు.

**వెంకన్న మరణించడం బాధాకరం : కలెక్టర్ రాహుల్ శర్మ**

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న లారీ ప్రమాదంలో మరణించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రవాణాశాఖ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించటం చాలా బాధాకరమని అన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఉంచిన వెంకన్న పార్థివ దేహాన్ని దర్శించిన కలెక్టర్ భావోద్వేగానికి గురయ్యారు.

**ప్రమాద ఘటనపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటాం: జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

చెల్పూర్ ఆర్టీవో కార్యాలయం ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో డిటిఓ వెంకన్న మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా లేదా అనే అంశంతోపాటు ప్రమాదానికి దారి తీసిన ఇతర కారణాలపై కూడా అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని, సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.

ఎంవిఐ వెంకన్న మృతి ఘటనపై విచారణకు ఆదేశం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విధి నిర్వహణలో ఉన్న జిల్లా రవాణా అధికారి (డిటిఓ) ఎం. వెంకన్న మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాస్తవాలను సమగ్రంగా పరిశీలించేందుకు విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, విధులు నిర్వహిస్తున్న సమయంలో బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, బాధ్యులపై చర్యలు, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రవాణా కమిషనర్ కార్యాలయంలోని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.చంద్రశేఖర్ గౌడ్‌ను విచారణ అధికారిగా నియమించింది. ప్రమాదానికి సంబంధించిన సమగ్ర నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందజేయాలని ఆయనకు సూచించింది. అలాగే ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే రవాణా శాఖ అధికారుల భద్రత, వాహనాల తనిఖీలు, సీజ్ ప్రక్రియల సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌పై ప్రత్యేక సూచనలు ఇవ్వాలని విచారణాధికారిని ఆదేశించింది. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టాలని రవాణా కమిషనర్‌కు ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

**వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొన్నం ప్రభాకర్**

విధినిర్వహణలో ఉన్న డిటిఓ వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధినిర్వహణలో మృతి చెందిన వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

**డిటిఓ వెంకన్న మృతి బాధాకరం: టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

భూపాలపల్లి జిల్లాలో జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో విధినిర్వహణలో ఉన్న డిటిఓ వెంకన్న మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ అధికారి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు వెంకన్న కుటుంబ సభ్యులకు మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని ఎదుర్కొనేందుకు వారికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## సహకరించండి (మొదటి పేజీ తరువాయి)

సహకారం అందించాలని కూడా కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రైల్వే కనెక్టివిటీ విస్తరణ, కొత్త రైల్వే మార్గాల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవల కల్పన వంటి అంశాలపై వారు ఇరువురు విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశకు సంబంధించిన ఆర్థిక అంశాలు, ఐఆర్ఎఫ్‌సి రుణ విడుదలలో నెలకొన్న పెండింగ్ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తగిన సహకారం అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్టార్‌మర్ రాజీనామా (మొదటి పేజీ తరువాయి)

మీడియాకు సోమవారం ఉదయం చెప్పారు. పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన స్టార్‌మర్ తన భార్య విక్టోరియాను కౌగలించుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సెప్టెంబరునెలలో మళ్ళీ పార్లమెంటు సమావేశాల నాటికి తన స్థానం (ప్రధానమంత్రి)లో కొత్త నాయకుణ్ణి నియమించే ప్రక్రియ పూర్తి చేయాలని లేబర్‌పార్టీని కోరారు. తన రాజీనామా విషయాన్ని రాజు ఛార్లెస్‌కు తెలియజేసినట్లు చెప్పారు. స్టార్‌మర్ రాజీనామాపట్ల ఛాన్సలర్ రేచల్ రీవ్ హర్షం ప్రకటించారు. ఆధునిక చరిత్రలో అత్యంత ఘోరమైన ఓటమి పరాభవానికి గురైన సమయంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టిన స్టార్‌మర్ లేబర్‌పార్టీని కేవలం నాలుగేళ్ళ వ్యవధిలో బ్రహ్మాండమైన మెజార్టీతో అధికారంలోకి తీసుకువెళ్ళారని ప్రశంసించారు.

రెండేళ్ళక్రితం టెన్ డౌనింగ్ స్ట్రీట్‌లోకి నడుచుకుంటూ వెళ్ళడం తన జీవితంలో అత్యంత గర్వకారణమైన క్షణాలని స్టార్‌మర్ తన తుది ప్రసంగంలో చెప్పారు. దేశ రక్షణ–ఆర్థిక వ్యవస్థలపట్ల ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. తాను బాధ్యతలు చేపట్టినప్పుడు పార్టీ పరిస్థితి ఎలా ఉండేదో గుర్తుచేసుకున్నారు. రాజకీయంగా,ఆర్థికంగా,నైతికంగా దివాళాతీసిన పార్టీని తాను వారసత్వంగా తీసుకుని ఘన విజయం దిశగా ముందుకు నడిపించానని చెప్పారు. నిరాశా నిస్పృహలతో 14 సంవత్సరాలపాటు అధికారంకోసం పార్టీ ఎదురుచూసిందని, నాటి గెలుపు దేశ చరిత్రలో ఒక కీలక ఘట్టమని, చరిత్రలో ఒక ముఖ్యమైన పుట అనీ చెప్పారు. లక్షలాదిమంది ప్రజల జీవితాలలో వెలుగులు నింపడంకోసమే తాను రాజకీయాలలోకి వచ్చానని అన్నారు. పార్టీని కాపాడటం అసాధ్యమని ఆనాడు అనేకమంది మిత్రులు తనకు పదే పదే చెప్పారని, లేబర్‌పార్టీ కథ ముగిసిందని హెచ్చరికలు చేశారని, కానీ వారు చెప్పివన్నీ అసత్యాలని తాను రుజువు చేసి చూపించానని అన్నారు. తన పదవీకాలంలో ఆర్థిక వ్యవస్థ,రక్షణ వ్యవస్థ, జాతీయ భద్రతలపై విశ్వాసాన్ని పునరుద్ధరించి లేబర్‌పార్టీలో విశ్వసనీయతను పునర్నిర్మాంచానని చెప్పారు. తన నాయకత్వంలో దేశంలో ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలను ఆయన ప్రస్తావించారు. ఇందులో "యూదు వ్యతిరేకత" అనే విషయాన్ని కూడా తాను పెకలించివేశానని చెప్పారు. ఈనాడు తనపై ఎంత మాత్రం విశ్వాసం ప్రకటించడంలేదని పరోక్షంగా ఆవేదన చెందారు.

నెంబర్–10 అని రాసి ఉన్న నల్లటి తలుపు బయట నిలబడి ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఉదయం ప్రకటించారు. తర్వాత భార్యతో కలిసి మళ్ళీ లోపలకు వెళ్ళారు. ఈ లోపు బయట నుండి ఆయన మిత్రబృందం నుండి కరతాళ ధ్వనులు వినిపించాయి.

2024 సార్వత్రిక ఎన్నికలలో పార్టీని గెలిపించడంలో తన కీలకపాత్రను, ఇతర విజయాలను వివరించారు. తన సమయం ముగిసిపోయిందని తన తుది ప్రసంగంలో స్టార్‌మర్ అంగీకరించారు. లేబర్‌పార్టీని నడిపించడానికి ఎవరున్నారని పత్రికలు వార్తలు రాసేవి, "లేబర్‌పార్టీని నడిపించడానికి ఎవరు అత్యంత సమర్థులు అని ఇప్పుడు ఎవరూ అడగడం లేదన్న విషయం నాకు తెలుసు, కానీ లేబర్‌పార్టీని ఎన్నికల్లో నడిపించడానికి నేను అత్యంత సమర్థుణ్ణా?కాదా? అని పార్టీ నన్ను అడుగున్న ప్రశ్న ఉంది, ఈ అత్యున్నతమైన పదవిని విడిచిపెట్టిన తర్వాత ఏదైనా ముఖ్యమైన పని గురించి ఎక్కువ సమయం గడుపుతాను, అదేవిధంగా చేటు కాలంలో తనకు ఎంతో అండగా నిలిచిన తన భార్య విక్టోరియాకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఒక ఉత్తమ భర్తగా, అందమైన నా బిడ్డలకు చేయగలిగినంత చేస్తాను, ఉత్తమ తండ్రిగా ఇక ఎక్కువ సమయాన్ని గడుపుతాను,ప్రజాసేవకు తమ జీవితాలను అంకితం చేసిన టెన్–10 డౌనింగ్ స్ట్రీట్ సిబ్బందికి, మనదేశంలో అసాధారణ సివిల్ సర్వీస్ అధికారులకు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను, నా జీవితంలో నెంబర్–10 లోకి ప్రవేశించడం అత్యంత గర్వించదగిన విషయమని అన్నారు. బ్రిటన్ పత్రికలు ఒకరోజు ముందుగానే "స్టార్‌మర్ ఆటకట్టు" అంటూ మొదటి పేజీల్లో పతాకశీర్షికలు పెట్టాయి.

## ట్రంప్ పేరు పెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పేరు పెట్టాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహం నుండి ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు సిపిఐ, సిపిఐ(ఎం), ఎంసిపిఐ, ఎస్‌యుసిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్ గూడ ప్రాంతంలోని అమెరికన్ కాన్సులేట్ ప్రాంతంలో ఉన్న రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశ ప్రజలపై ధరల భారాలు పడడానికి అనేక ఆంక్షలు విధించడానికి కారకుడైన ట్రంప్ పేరు హైదరాబాద్ రాయబార కార్యాలయానికి పెట్టడం దుర్మార్గమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టాలని నిర్ణయం తీసుకుని గురుభక్తి చాటుకున్నదని విమర్శించారు. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ నేడు తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం అయినప్పటికీ బిజెపి, ఆర్ఎస్ఎస్ బాటలో నిర్ణయాలుండటం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్ మాట్లాడుతూ సమాజంలో ప్రజానుకూలంగా, స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడిపిన వారి పేర్లను మాత్రమే వీధులకు, స్మృతి చిహ్నాలకు పెట్టాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తూ, వివిధ దేశాలు, జాతులు, తెగల మధ్య యుద్ధాలు సృష్టిస్తున్నారని ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. డొనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాద్‌లో పెట్టాలనుకోవడం తెలంగాణ, భారత ప్రజల లౌకిక స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమని ఎంసిపిఐ నాయకులు మట్టయ్య పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచంలోనే ఒక ఐకాన్‌గా తీర్చిదిద్దుతానని గొప్పలు చెప్పే రేవంత్ రెడ్డి, ఆచరణలో మాత్రం నియంత అయిన హిట్లర్ స్ఫూర్తి అనడం దుర్మార్గమని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు హన్మేష్ అన్నారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కపతం యాదగిరి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బృహత్తర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

మధ్య స్విట్జర్లాండ్ నగరం బర్గెన్‌స్టాక్‌లో ఆదివారం ప్రారంభమైన చర్చలు 18 గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగాయి. ఈ చర్చలు ముగిశాయనీ,టెక్నికల్‌వర్కుకు సంబంధించిన అంశాలపై చర్చలు ఆగకుండా వారం రోజులు కొనసాగుతాయని ఇరాన్ సోమవారం ప్రకటించింది. దీని ప్రకారం తుది ఒప్పందం చేసుకోవడానికి ఒక బృహత్తర ప్రణాళికను అంగీకరించడంతోపాటు సాంకేతిక చర్చలను ముందుకు తీసుకువెళ్ళేందుకు యంత్రాంగాలను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. మధ్యవర్తి ప్రక్రియపై రాజకీయ బాధ్యతతో పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఎప్పటికప్పుడు రోజువారీ ప్రాతిపదికపై సమాచారాన్ని అందిస్తారు. అణుసమస్యలు, ఆంక్షలు,ఎంఓయు సమర్థవంతంగా అమలు చేస్తున్నారా?లేదా? వంటి అంశాలపై పర్యవేక్షణ చేస్తూ వర్కింగ్ గ్రూపుల పని విధానాన్ని ఈ ఉన్నతస్థాయి కమిటీ పరిశీలిస్తూ ఉంటుంది. ఈ బృహత్త ప్రణాళికకు అనుగుణంగా సాంకేతిక చర్చలు తక్షణం ప్రారంభించారు. స్తంభింపజేసిన ఆస్తుల పాక్షిక విడుదలకు అంగీకారం కుదిరింది. చర్చల అనంతరం ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ నాయకత్వానగల బృందం తిరిగి టెహ్రాన్‌కు చేరుకుంది. అమెరికా బృందానికి వాన్స్ నాయకత్వం వహించారు.

ఇదిలా ఉండగా రెండోరోజు సోమవారం కూడా బర్గెన్‌స్టాక్‌లో అమెరికా–ఇరాన్ మధ్య సాంకేతిక చర్చలు కొనసాగాయి.

కాగా ఆదివారం ఈ చర్చలు ప్రారంభమయ్యే దశలో ఇరాన్‌కు ట్రంప్ ఒక హెచ్చరిక చేయడంతో ఇరాన్ ప్రతినిధులు చర్చల నుండి వాకౌట్ చేశారు. తర్వాత పాకిస్థాన్,ఖతార్ మధ్యవర్తులు వారిని అనునయించి మళ్ళీ చర్చల్లో కూర్చోబెట్టారు. లెబనాన్‌లో ఘర్షణలకు కారణమవుతున్న హెజ్బొల్లా ఉగ్రవాదులను అదుపు చేయకపోతే ఇరాన్‌పై భారీస్థాయిలో మళ్ళీ దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించడంతో ఇరాన్ ప్రతినిధులు ఆగ్రహించారు.

# భారత్ పసిడి పంచ్.. 8 స్వర్ణాలు సొంతం



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌కు సన్నాహకంగా జరిగిన 56వ యూరోపియన్ బాక్సింగ్ గోల్ టోర్నీలో భారత బాక్సర్లు పసిడి పతకాలతో దుమ్మురేపారు. యూరప్‌లో ప్రాచీన టోర్నీగా గుర్తింపు పొందిన చాంపియన్ షిప్‌లో భారత బాక్సర్లు ఎనిమిది స్వర్ణాలు సహా మూడు రజతాలు, ఒక కాంస్య పతకంతో అదరగొట్టారు. ఈ సీజన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన మన బాక్సర్లు.. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ పతకాలు కొల్లగొట్టారు. మహిళల విభాగంలో లవ్లీనా బొర్గోహై(75కి), ప్రీతిపవార్(54కి), సాక్షి(51కి), ప్రియ(60కి) పసిడి పతకాలతో మెరువగా, పర్వీన్(65కి) రజతం దక్కించుకుంది. మహిళల 75కిలోల ఫైనల్లో లవ్లీన 5-0తో మెలిస్సా జెమిని(ఇటలీ)పై అలవోకతో గెలువగా, ప్రీతి 50తో జెస్సా మార్సెల్(ఫ్రాన్స్)ను చిత్తుచేసింది. సాక్షి 50తో మైసూన్ బరెగ(ఫ్రాన్స్)పై గెలువగా, బార్బోర మెక్సోవ(చెక్ రిపబ్లిక్)పై ప్రియ విజయం సాధించింది. పురుషుల కేటగిరీలో జాదుమని సింగ్(55కి), సచిన్(60కి), అంకుశ్(80కి), నరేందర్(90+కి) స్వర్ణాలు సొంతం చేసుకున్నారు.

## ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ తొలి విక్టరీ

ఫిఫా వరల్డ్ కప్‌లో ఈజిప్ట్ విక్టరీ కొట్టింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఓ దశలో వెనుకబడ్డ ఈజిప్ట్ ఆ తర్వాత పుంజుకుని వరల్డ్ కప్ హిస్టరీలో చరిత్ర సృష్టించింది. వరల్డ్ కప్‌లో అరంగేట్రం చేసిన దాదాపు 92 ఏళ్ల తర్వాత ఆ దేశం తొలిసారి మ్యాచ్ నెగ్గింది. ఈజిప్ట్ జట్టులో మొహమ్మద్ సలేహ్ కీలక ప్లేయర్‌గా నిలిచాడు. ఓ గోల్ చేయడంతో పాటు మరో గోల్కు అసిస్ట్ చేశాడు. వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి ఈజిప్ట్ ఓ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది.

### స్వీడన్‌పై డచ్ ఘన విజయం..
### జపాన్ చేతిలో ట్యునీషియా చిత్తు

ఆదివారం జరిగిన గ్రూపుఎఫ్ పోరులో నెదర్లాండ్స్ 5–1 తేడాతో స్వీడన్‌పై



ఘన విజయం సాధించింది. తమ తొలి పోరును జపాన్‌తో 2–2తో డ్రా చేసుకున్న నెదర్లాండ్స్..మలి పోరులో విశ్వరూపం ప్రదర్శించింది. స్వీడన్‌పై భారీ విజయంతో గ్రూపులో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో దూసుకెళుతున్నది. స్వీడన్‌పై పోరులో అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన నెదర్లాండ్స్ టీమ్లో బ్రియాన్ బ్రాబె(5ని, 17ని), క్యాడె గప్కో(47ని, 54ని) డబుల్ గోల్‌సతో విజృంభించగా, క్రిసెన్సియో సమర్విల్లె(89ని) మరో గోల్‌తో ఆకట్టుకున్నాడు. ఆంథోని ఎలంగ(59ని) స్వీడన్‌కు ఏకైక గోల్ అందించాడు. తమ తొలి పోరులో ట్యునీషియాను 5–1తో ఓడించిన స్వీడన్..నెదర్లాండ్స్‌పై పూర్తిగా తేలిపోయింది. ట్యునీషియాతో మ్యాచ్‌లో జపాన్ 4–0తో ఘన విజయం సాధించింది. అయాసె యుడా(31ని, 83ని) డబుల్ గోల్‌తో చెలరేగగా, డైచీ కమాడ(4ని), జున్య ఇటో(69ని) ఒక్కో గోల్ చేశారు.



## జైస్వాల్ ఔట్, కోహ్లీ ఇన్..

### ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టు ఎంపిక

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు బిసిసిఐ భారత క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలో సమావేశమైన సీనియర్ సెలెక్షన్ కమిటీ 15 మందితో జట్టును ఎంపిక చేసింది. అఫ్గానిస్థాన్‌తో తాజాగా ముగిసిన వన్డే సిరీస్‌లో ఆకట్టుకున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చుక్కెదురు కాగా, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టుకు ఎంపికయ్యాడు. అఫ్గన్‌తో ఆఖరి వన్డేలో ధనాధన్ సెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన జైస్వాల్‌కు సెలెక్టర్ల నుంచి మొండిచేయి ఎదురైంది. ఐపిఎల్ సందర్భంగా గాయపడ్డ కోహ్లీ..ఈ వారంలో బెంగళూరు సిఒఇలో ఫిట్నెస్ పరీక్షలో పాస్ కావాల్సి ఉంది. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకున్న సెలెక్టర్లు అందుకు తగ్గట్లు టీమ్‌ను ఎంపిక చేశారు. 2023 వన్డే వరల్డ్ కప్ నుంచి దూరంగా ఉంటున్న సీనియర్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా..ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు చోటు దక్కించుకున్నాడు. మరో వైపు అక్షర పటేల్ తిరిగి జట్టులోకి రాగా, ఇటీవలే అరంగేట్రం చేసిన ప్రిన్స్యాదవ్, హర్షాబేకు నిరాశే ఎదురైంది. స్టార్ ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యా బెర్తు ఖాయం కాగా, తెలుగు క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి చోటు నిలుపుకొన్నాడు. జూలై 14, 16, 19 తేదీల్లో భారత్, ఇంగ్లండ్ వన్డే సిరీస్ జరుగనున్నది.

**జట్టు వివరాలు:** గిల్(కెప్టెన్), రోహిత్‌శర్మ, కోహ్లీ (ఫిట్నెస్ పరీక్షను అనుసరించి), అయ్యర్(వైస్ కెప్టెన్), రాహుల్, కిషన్, సుందర్, అక్షర్, నితీష్‌కుమార్, కుల్దీప్, బుమ్రా, ప్రసిద్, రానా, అర్ష్దీప్, గుర్నూర్ బ్రార్.

## యువతరంగం

### మారుతున్న సాంకేతికతలో
# యువత భాగస్వామ్యం

మారుతున్న సాంకేతికతలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలి. సాంకేతిక అవగాహన కోసం ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల చేస్తున్న కృషిలో యువత భాగస్వాములు కావాలి. భారత ప్రభుత్వం సాంకేతిక అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టింది. 2015లో ప్రారంభమైన డిజిటల్ ఇండియా ఉద్యమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సౌకర్యాలను విస్తరించడానికి గణనీయమైన ప్రయత్నాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ లిటరసీ కోసం పమిత్ర (పిఎంజిడిఐఎస్‌హెచ్‌ఎ) పథకాన్ని రూపొందించి అమ లు చేస్తున్నారు. స్కూళ్లలో విద్యార్థులకు సాంకేతికత పట్ల ఆసక్తి కలిగించేందుకు అటల్ ఇన్నొవేషన్ మిషన్ ద్వారా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఎటిఎల్) ఏర్పాటు చేస్తున్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌డిసి) ద్వారా డిజిటల్ నైపుణ్యాలకు శిక్షణ ఇస్తున్నారు. కాగా, ప్రైవేటు రంగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్, టిసిఎస్ ఇగ్నైట్, గూగుల్ ఇంటర్నెట్ సాథీ వంటి కార్యక్రమాలు యువతలో టెక్నాలజీపై అవగాహన పెంచడంలో సహాయపడుతున్నాయి. వివిధ మల్టీనేషనల్ కంపెనీలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద సాంకేతికతను చేరువ చేయడంపై దృష్టి సారించాయి. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, సాంకేతికత పట్ల అవగాహన పెరగాల్సిన ప్రధాన వర్గం యువతే. ఎందుకంటే, యువతే భవిష్యత్ దేశ నిర్మాణ కర్తలు.వారు టెక్నాలజీని వేగంగా అర్థం చేసుకుని, వినియోగించగలరు. టెక్నాలజీని కేవలం వినియోగించడమే కాకుండా, సృష్టించగల సమర్థత యువతలో ఉంటుంది. టెక్నాలజీపై స్పష్టమైన అవగాహన పొందటం, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సైబర్ స్పేస్‌లో బాధ్యతాయుత ప్రవర్తనను కలిగి ఉండడం యువత లక్షణం కావాలి. టెక్నాలజీని సృజనాత్మకంగా వినియోగిస్తూ నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి. తమ తోటి పౌరుల్లోనూ టెక్నాలజీపై చైతన్యం కలిగించడం బాధ్యతగా స్వీకరించాలి. భవిష్యత్తులో సాంకేతిక అవగాహన దిశభవిష్యత్తులో టెక్నాలజీ పట్ల అవగాహన మరింతగా కీలకమవుతుంది. దీని కోసం పాఠశాల స్థాయి నుంచే టెక్నాలజీని పాఠ్యాంశంలో భాగం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక వసతులు అందుబాటులో ఉండాలి. టెక్నాలజీ వినియోగం విషయంలో సామాజిక, ఆర్థిక అంతరాలను తొలగించేందుకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఎఐ, డీప్ టెక్, డేటా సైన్స్, బ్లాక్‌చెయిన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందిన సాంకేతికతల పట్ల నేటి యువత ఆసక్తితో పాటు సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. ఏదిఏమైనా సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన అనేది ఈ యుగంలో ప్రతి ఒక్కరికి అవసరం. అది ఉద్యోగ అవకాశాలను పెంచడంలో, జీవిత నాణ్యతను మెరుగుపరచడంలో, సామాజిక చైతన్యం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కేవలం పాఠ్య విజ్ఞానమే కాకుండా, దాన్ని అనుసంధానించే సాంకేతిక అవగాహన కూడా అవసరమే. యువత ఈ మార్పుకు నాయకులుగా ముందుకు రావాలి. ప్రభుత్వ, శిక్షణా సంస్థలు, విద్యా వ్యవస్థ, మాతృభాషా మీడియా – అందరూ కలిసి ఈ కార్యం వైపు అడుగులు వేయాలి.సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని, దానిని సమర్థంగా వినియోగించగల సమాజమే సమగ్ర అభివృద్ధి వైపు దూసుకెళుతుంది.

## క్రమశిక్షణతోనే యువతకు భవిత




జీవితంలో క్రమశిక్షణ అత్యవసరం. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువతకు మరింత కీలకం. అభ్యాసం, నేర్పు, ఆచరణ అనే మూడు విభాగాలు యువతీయువకుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. క్రమశిక్షణ అనేది అనేక నియమాలు, విధానాలు, వ్యవస్థల ద్వారా వ్యక్తుల లేదా సమూహాల ప్రవర్తనను నియంత్రించే ప్రక్రియ. నిజానికి ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ అవరమే. కానీ, విద్యార్థి దశ నుంచి క్రమంగా ఉద్యోగస్థుల స్థాయికి చేరుకునే దశలో దీని అవసరం రెట్టింపు అవుతుంది. కుటుంబం నుంచి, చుట్టూ ఉన్న సమాజం నుంచి అందే ప్రోత్సాహం సానుకూల క్రమశిక్షణ (పాజిటివ్ డిసిప్లిన్ ) అలవడే మార్గాలను నిర్మిస్తుంది. అదే విధంగా తప్పిదాలు సరిచేస్తూ, నియమాల ఉల్లంఘనను గుర్తుచేస్తూ, సరైన మార్గం చూపేది దిద్దుబాటు క్రమశిక్షణ (కొహర్సివ్ డిసిప్లిన్). ఈ రెండు రకాల్లోనూ క్రమశిక్షణను అలవాటు చేయడమే ప్రధాన లక్ష్యం. క్రమశిక్షణ లేని జీవితం అస్తవ్యస్తంగా మారుతుంది. అభ్యాసానికి అడ్డంకులు, సామర్థ్యానికి ఆటంకకాలు కలిగిస్తాయి. క్రమశిక్షణ ద్వారా సురక్షితమైన, సానుకూలమైన, మరియు ఉత్పాదక వాతావరణాన్ని సృష్టించవచ్చు. ఇది యువతలో సమయపాలన, బాధ్యత, సహకార భావనను పెంపొందిస్తుంది. విద్యాలయాలు లేదా ఉద్యోగ సంస్థలు.. ఎక్కడైనా సరే క్రమశిక్షణ నియమాలు స్పష్టంగా, న్యాయంగా అందరికీ సమానంగా వర్తించేలా ఉండాలి. అసాంఘిక కార్యకలాపాలకు, శారీరక లేదా మానసిక హింసకు పాల్పడకుండా ఉండడం కూడా క్రమశిక్షణ కిందకే వస్తుంది. ఆదర్శవంతమైన యువత తమ ముందు తరాలకు ఊతమవుతుంది. తన తర్వాత తరాలకు మార్గదర్శకం చేస్తుంది. క్రమశిక్షణ అందరి జీవితాల్లోనూ వెలుగు నింపుతుంది. యమాలను స్థిరంగా అమలు చేయడమే క్రమశిక్షణకు మూలం. వాస్తవానికి క్రమశిక్షణ పాటించడం అనేది కేవలం నియమాల అమలు చేయడానికి మాత్రమే పరిమితం కాదు. జీవితంలో సానుకూల వాతావరణాన్ని సృష్టించడానికి కూడా ఉపయోగపడుతుంది. బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం కూడా. క్రమశిక్షణ అమలులో సమతుల్యత అవసరం. అతిగా కఠినమైన నియమాలు ఒక రకంగా అందరినీ భయాందోళనలకు గురి చేస్తాయి. అదే సమయంలో అతి స్వేచ్ఛ సమాజాన్ని అస్తవ్యస్తం చేస్తుంది. అందుకే ఎవరికివారు సానుకూల క్రమశిక్షణను అలవరచుకుంటూ, మిగతా వారికి మార్గదర్శకులు కావాలి.

### ప్రస్తుత సంక్షోభ కాలంలో
# కమ్యూనిస్టుల పాత్ర కీలకం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**





**ప్రజాపక్షం/చుంచుపల్లి :** కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడమే కర్తవ్యమని, ప్రస్తుత సంక్షోభ కాలంలో కమ్యూనిస్టుల పాత్ర మరింత కీలకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం, గౌతంపూర్ సింగరేణి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కొత్తగూడెం ఏరియా యూనియన్ ప్రతినిధులు, కార్యకర్తలకు ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులను సోమవారం కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వర్తమాన పరిస్థితుల్లో కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులు కార్మిక చైతన్యానికి దోహదపడాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, నిర్వీర్యం అవుతున్నాయని, వాటి పరిరక్షణకు ఉద్యమాలే శరణ్యమన్నారు. ప్రభుత్వ రంగానికి తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థపై కేంద్రం కన్నేసిందని, ప్రైవేటీకరణ వైపు పరుగులు పెట్టిస్తోందని, ఈ పరిస్థితిలో సమిష్టి పోరాటాలతో సింగరేణిని రక్షించుకుందామని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్మిక సంక్షేమం, కార్మిక వాడలు, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. యూనియన్ ప్రతినిధులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నిరంతరం కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు అండగా ఉండాలని సూచించారు. ప్రస్తుత రాజకీయ, సమాజిక, ఆర్థిక పరిస్థితుల్లో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని కార్మికవర్గాన్ని కూనంనేని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా కార్మిక ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు, ట్రేడ్ యూనియన్‌ల బాధ్యతలు, కార్మిక హక్కుల పరిరక్షణ అంశాలపై ప్రసంగించారు. సింగు నర్సింహారావు చారిత్రక భౌతిక వాదం అంశంపై వివరించారు. వి.మల్లికార్జున రావు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులపై పడే ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, రమణమూర్తి, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, క్రిస్టోఫర్, గట్టయ్య, సూర్య ప్రకాష్, సందబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వర రావు, హుమాయూన్, హీరాలాల్, గుమ్మడి వీరయ్య, భూక్యా రమేష్, ఎంఆర్‌కె ప్రసాద్, మధు కృష్ణ, కమల్, కిషోర్, చారి, భీమయ్య, అప్పారావు, బండారి, మల్లయ్య, మండల రాజేశ్వర రావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్**
**కలెక్టరేట్ ఎదుట సిపిఐ ధర్నా**



**ప్రజాపక్షం/కరీంనగర్ :** అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సోమవారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో దాదాపు 600 ఇండ్లను చింతకుంట ప్రాంతంలో నిర్మాణం చేసి ఉన్నాయని, నిర్మించి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వాటిని అర్హులైన వారికి కేటాయించకపోవడం వల్ల అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు వాటిని పంపిణీ చేయలేదని, తక్షణమే ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారి షర్మిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కొట్టె అంజలి, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరుకోలు సదానందం, దుడ్డేల సమ్మయ్య, గామినేని సత్యం, చెంచల మురళి, నగునూరి రమేష్, నునావత్ శ్రీనివాస్, బాకం ఆంజనేయులు, ఈ.భారతి, కాల్వ శ్రీనివాస్, తంగెళ్ళ సదయ్య, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, బోయిని విష్ణు, మమత, స్వాతి, భూక్యా ముని, స్రవంతి, గుర్రం సదానందం, బరిగెల విజయ్ పాల్గొన్నారు



### ప్రతి పేదవాడికి సొంతింటి కలే వామపక్షాల లక్ష్యం

**హనుమకొండ :** ప్రతి నిరుపేదకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలోమరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లా వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల వామపక్ష పార్టీల సంయుక్త సమావేశం గాదె ప్రభాకర్ రెడ్డి, షేక్ బాష్‌మియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ ఈ నెల 27న వాపపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గుండ్ల సింగారం, గోపాలపురంలో అధికారులు ఎక్కడెక్కడ గుడిసెలు తొలగించారో అక్కడ తిరిగి గుడిసెవాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, ఎంసిపిఐ(ఐ)యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, ఎంసిపిఐయు కర్ర రాజిరెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాయకులు బొట్ల చక్రపాణి, సింగారపు బాబు, ఎంసిపిఐ(ఐ)యు జిల్లా నాయకులు మాలోత్ సాగర్, సిపిఐ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, నర్ర ప్రతాప్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి

**రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతాంగానికి గుదిబండ ఉన్న యూరియా యాప్‌ను ఎత్తివేసి, రైతుకు సరిపడా యూరియాను అందజేయాలని, పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సోమవారం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, వైఎస్.గిరి, శనిగారపు శ్రీనివాసరావు, వీసంశెట్టి పద్మజ, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, బానోత్ రవి, వాడె లక్ష్మి, బానోత్ రంజిత్, ఎస్ఏ.రహమాన్, గౌస్‌పాషా, కాకటి రవీందర్, బదావత్ శ్రీను, జర్పుల కిషన్, ఎడవల్లి క్రిష్ణ, బి.లింగస్వామి, భూక్యా హుస్సేన్, సర్వయ్య, ఎస్‌కే.గౌస్, ఎండి.జానీ, కాసీం, మాలోత్ సక్రు, ధర్మసోత్ రాందాస్, ఆదిలక్ష్మి, సంజీవరావు, కోమటి శ్రీనివాసరావు, తాటి నాగరాజు, ఆది నారాయణ, రామడుగు రామాచారి, రాజమ్మ, వెంకటమ్మ, పూలమ్మ పాల్గొన్నారు.

**సూర్యాపేట కలెక్టరేట్ :** విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బూర వెంకటేశ్వర్లు, అనంతుల మల్లీశ్వరి, రాంబాబు, చామల అశోక్, రావుల సత్యం, నీలం నాగభద్రం, జయసుధ, కోమరాజు వెంకట్, పరికే భరత్ శెట్టి, మాతంగి నారాయణ, దుర్గ, తాళ్ళూరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.




**ములుగు :** రైతుల సమస్యలను పరిష్కరించాలని, ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా, బానోత్ నారాయణ్ సింగ్, మామిడి నటరాజ్, మంకిడి కృష్ణయ్య, భూక్యా పురం సింగ్, వాసం రమేష్, రాజయ్య, మహేందర్, ఆగబోయిన పోతయ్య, వట్టం సమ్మయ్య, రాజు, రవీందర్, సమ్మక్క, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్ :** రైతులకు ఇబ్బందికరంగా ఉన్నటువంటి యూరియా యాప్‌ను ప్రభుత్వం వెంటనే రద్దుచేసి పాత పద్ధతిలోనే అందజేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు మాట్లాడుతూ చదువులేని రైతులు ఈ యాప్ ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో బ్లాక్‌మార్కెట్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి తోడు యూరియా కొనుగోలు భారంగా మారిందన్నారు. యాప్ రద్దుచేసి రైతులకు అవసరమైన యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్లు జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడల శ్రీనివాస్, యల్లావుల రమేష్, జడల వెంకన్న, జక్కుల రమేష్, మామిడి నర్సయ్య, కొనుగుపాటి వాసుదేవరావు, జనిగ నాగమణి, పున్నయ్య, చారి, జక్కుల శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.








## ఎస్ఐఆర్‌కు అన్ని పార్టీల సహకారం

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు,ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సహకరించాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ కోరారు.సోమవారం అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 13,16,063 మంది ఓటర్లను మ్యాపింగ్ చేశామన్నారు. జూలై 31 ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ,జూలై 31 ఆగస్టు 30 అభ్యంతరాల స్వీకరణ,సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం అక్టోబర్ 1,2026:తుది ఓటరు జాబితా ప్రచురణ ఓటర్లు నేరుగా ఫారం ఇవ్వలేకపోతే ఓటర్ పోర్టల్ ద్వారా వివరాలు సమర్పించవచ్చని,రెండుచోట్ల ఓటు,చనిపోయినవారు,చిరునామా మారినవారిని తొలగించి పారదర్శక జాబితా రూపొందిస్తామని చెప్పారు.కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు.ప్రతి 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఎన్నికల పర్యవేక్షకులు కృష్ణమూర్తి ,రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజలకు సత్వరమే న్యాయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ పేర్కొన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పి స్వయం స్వీకరించి పరిశీలించారు.జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 43 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి తగిన సూచనలు చేశారు.ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా అందిన వినతులపై సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వర న్యాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు ఆయా శాఖలు ఖచ్చితమైన సమాచారాన్ని సంబంధిత ఫార్మెట్‌లో అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో 114 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, సిపిఓ కిషన్ నాయక్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలకు చెందిన పాఠ్యపుస్తకాలు సీజ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బీబీగూడెం సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన రూ.30వేల విలువైన పాఠ్యపుస్తకాలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో అక్రమంగా నిలువ చేయగా ఎంఇఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్ సోమవారం సీజ్ చేశారు. టిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు రాజు గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు నరేష్ గౌడ్, మురళీ, రాకేష్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతూ వ్యాపారాన్ని సాగిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా గోదాములో నిలువ ఉంచిన పాఠ్యపుస్తకాలను గుర్తించి విద్యాశాఖ అధికారులకు సమాచారం అందింజేయడంతో సీజ్ చేయడం జరిగింది.

## అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** 'అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం' (జూన్ 26) సందర్భంగా మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా 'ఈగల్ ఫోర్స్ తెలంగాణ' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని డ్రగ్స్ మహమ్మారిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయం' అని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని, 'డ్రగ్స వద్దు మంచి జీవితాన్ని ఎంచుకోండి' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహా రెడ్డి, ఆకుల రవి, కాసుల మహేష్, ప్రవీణ్, సోమ శివ, అశోక్ పాల్గొనారు.

## 25న సూర్యాపేటలో భారీ ఉద్యోగ మేళా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 25న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో సూర్యాపేట భారీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎండి జానీపాషా ఒక ప్రకటనలో తెలిపారు. 4 ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో 200 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈనెల 25న శ్రీవేంకటేశ్వర డిగ్రి, పిజి కాలేజీ నందు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా జరగనుందన్నారు. సూర్యాపేట సమీపంలోని అపోలో ఫార్మసీ, శ్రీరామ్ చిట్ ఫండ్స్, పవన్ మోటార్స్, నవత ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఫార్మసిస్ట్, టెలికాలర్, ఫైనాన్స్, బైక్ రైడర్ తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రి, ఐటిఐ, డిప్లమా, ఫార్మసీ, బి.ఫార్మసీ ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు వేతనం చెల్లిస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటా, ఫోటోలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9989655489ను సంప్రదించాలని కోరారు.

# బిఎల్ఓ డ్యూటీ రద్దు చేయాలి

ఎఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అంగన్‌వాడీ టీచర్లు



**ప్రజాపక్షం/నల్లగొండ :** అంగన్వాడీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని అంగన్వాడీ టీచర్స్‌హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు బీఎల్ఓ డ్యూటీలు వేస్తున్నారని,చాలా అంగన్వాడీ సెంటర్లకు హెల్పర్లు లేకపోవడం వల్ల టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత అంగన్వాడీ టీచర్లు ఎక్కువ రోజులు బీఎల్ఓ డ్యూటీలు నిర్వహించాల్సి వస్తుందని, దానివల్ల అంగన్వాడీ సెంటర్లు మూతపడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున హెల్పర్లు లేని అంగన్వాడీ సెంటర్ల టీచర్ల బీఎల్ఓ డ్యూటీ రద్దు చేయాలని కోరారు.ఇప్పుడే పాఠశాలలు ప్రారంభమవుతున్న దశలో టీచర్లు బీఎల్ఓ డ్యూటీకి వెళితే సెంటర్లు మూతపడి పేద పిల్లలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారానికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. సెంటర్లు మూతపడితే పిల్లల ఎన్‌రోల్‌మెంట్ కూడా తగ్గే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కోట్ల శోభ, జిల్లా నాయకులు ఎన్.ప్రభావతి,జి.అలివేలు, శోభ, వనజాత,ఎస్‌కే.షబానా, వై. సంతోష, అంజలి, ఏ.మణెమ్మ,ఎస్.కృష్ణవేణి, కె. పుష్పలత, బి.ప్రమీల, సీతారావమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి పౌరుడు సైనికుడిగా మారాలి

సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ్మా పిలుపు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్క పౌరుడు ఒక సైనికుడిగా నిలబడి పోరాడాలని సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాలలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ ఈగల్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ సోల్జర్ పౌరుల నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ప్రతి పౌరుడు, యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గంజాయి లాంటి ప్రమాదకరమైన డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని కోరారు. మన సమాజాన్ని, సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖతో ప్రజలు చేతులు కలుపాలన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక, రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని కోరారు. సే నో టు డ్రగ్స్ సే ఎస్ టు లైఫ్ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, మత్తుకు దూరంగా ఉండి సంతోషకరమైన జీవితాన్ని గడుపుతూ, అందమైన కుటుంబాన్ని నిర్మించుకోవాలని సూచించారు. గంజాయి లాంటి మత్తుపదార్థాలకు అలవాటు పడిన వారిని సంస్కరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని దీనికోసం జిల్లా వ్యాప్తంగా గంజాయి సంబంధ కేసుల్లో ఉన్న యువకులకు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సత్ప్రవర్తన కోసం జిల్లా కేంద్రంలో పునరావత కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, డ్రగ్స్ వినియోగం రవాణాకు సంబంధించిన సమాచారాన్ని 100, 112, 1908లకు తెలియజేయాలన్నారు.జిల్లా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిఎస్పిలు రవి, నరసింహచారి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దూం అలీ, ఎస్ఐ యాకూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణికి గతం కంటే అత్యధిక ఫిర్యాదులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన డివిజన్ స్థాయి ప్రజావాణికి అత్యధిక ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి నాలుగైదు ఫిర్యాదులే రాగా సోమవారం జరిగిన ప్రజావాణిలో సుమారు 20 వరకు ఫిర్యాదులు వచ్చాయి. దామరచర్ల మండలం వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేట్ పరం చేయొద్దని కోరుతూ వాడపల్లి తెలంగాణ ఉద్యమకారుడు కె.నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగిగా చేరిన భూ నిర్వాసితుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. అదేవిధంగా అనుముల మండలం హజారిగూడెంకు చెందిన దివ్యాంగురాలు మరుగుజ్జు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకుంది. తన భార్య పేర ఉన్న భూమిలో వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామపంచాయతీ భవనం నిర్మించేందుకు సర్పంచ్ భర్త వెంకట్ రెడ్డి యత్నిస్తున్నాడని నిలుపుదల చేయాలని పి.గుర్వయ్య ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మునిసిపల్ కౌన్సిలర్ పందిరి అనిత తన భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్డిఓ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ప్రజల అర్జీలు స్వీకరించి సత్వరం పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, ఎంపీడిఓ ఎం.శేషగిరిశర్మ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగదీశ్వరెడ్డి, ఎంపీపి సూపరింటెండెంట్ కరుణాకర్, మునిసిపాలిటీ మేనేజర్ జి.జ్ఞానేశ్వరి, ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ పిఓ వేణు, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి నసీమా మెహ్రిన్, నీటిపారుదల శాఖ ఆర్ అండ్ బి, నీటి పారుదల, ఆర్ డబ్ల్యూఎస్, హౌజింగ్ డిఇఇలు శ్రీనివాస్ పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజాసేవలో లయన్స్ క్లబ్ పోషిస్తున్న పాత్ర అభినందనీయమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం స్థానిక నారాయణ రెడ్డి ఫంక్షన్ హాల్ లో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య, విద్య, రక్తదానం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాల్లో క్లబ్ మరింత ముందుకు రావాలని సూచించారు. సమాజ సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సూర్యచంద్రరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ప్రముఖ వైద్యులు వై. మోహన్ రెడ్డి తోపాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఒకు వినతి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పట్టణంలో నాన్‌జ్యుడిషియల్ స్టాంప్ వెండర్స్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అధిక ధరలకు స్టాంప్‌లు అమ్ముతున్నారని బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రూ.20ల విలువైన స్టాంప్‌ను రూ.40 నుంచి 50 వరకు, రూ.50 స్టాంప్‌ను రూ.80 నుండి 100వరకు, రూ.100 స్టాంప్‌ను రూ.170 నుండి 200 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో సామాన్యులపై భారం పడుతుందని వెంటనే ధరలను నియంత్రించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలని కోరుతూ బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాధికారి భూక్య సైదా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఫీజు వసూళ్ళ మీద ఉన్న ధ్యాస విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో చూపడం లేదన్నారు. ఫీజులను వెంటనే నియంత్రించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.




## సమాజంలో మార్పుకు రైతాంగంపై ఎనలేని బాధ్యత

చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** దేశంలో కెమికల్ ఫెర్టిలైజర్స్ విపరీతంగా ఉపయోగించడం వల్ల ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయని, సమాజంలో మార్పు తీసుకురావడానికి రైతాంగంపై ఎనలేని బాధ్యత ఉందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలో రాష్ట్ర బిజెపి కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడారు. రాబోయే కాలంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామని లక్ష్మి నరసయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, పంట మార్పిడి విధానాలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులను ఎడ్యుకేట్ చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. రసాయన ఎరువుల దుష్ప్రభావాల గురించి పేర్కొన్నారు. వరి ధాన్యానికి ప్రత్యామ్నాయంగా పంట పొలాల్లో కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి వివిధ రకాల చిరుధాన్యాలను పండించాలని పిలుపునిచ్చారు. ఫెర్టిలైజర్స్ వాడకం తగ్గించి, ఆవు పేడ, ఆవు మూత్ర, ప్రకృతికి సంబంధించిన ఇతర పదార్థాలను ఉపయోగించి పాతకాలపు పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వపురం లక్ష్మీ నరసయ్య, బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూర్ అశోక్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజేంద్ర రెడ్డి, పీస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ నిమ్మయ్య, దేవర శ్రీనివాసు, కిసాన్ మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రటరీ దాసరి మల్లేశం, పాశం భాస్కర్, కర్నాటి ధనుంజయ, పిఎస్. రవీందర్ పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం ఒక మైలురాయి : సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో న్యాయవాదుల రక్షణ చట్టం ఒక మైలురాయి అని, దీనిని పాస్ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సూర్యాపేటలో న్యాయవాదులు సోమవారం పార్టీలకతీతంగా ముక్తకంఠంతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాదిలు హాజరై మాట్లాడుతూ సాధారణంగా న్యాయవాదులు ఒక వర్కింగ్ డే రోజున ఇంత పెద్ద సంఖ్యలో హాజరు కావడం చాలా కష్టమని, కానీ ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్క న్యాయవాదికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. దేశంలోనే రాజస్థాన్, కర్ణాటక తర్వాత మూడోసారి తెలంగాణలోనే ఈ చట్టాన్ని తీసుకువచ్చారంటే, న్యాయవాదులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. న్యాయవ్యవస్థలో న్యాయవాదులు పిల్లర్ల వంటి వారని, పిల్లర్లు లేకపోతే ఏ బిల్డింగ్ నిలబడదన్నారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి లాయర్లతో కలిసి వారు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, సీనియర్ న్యాయవాదులు ఉమాపతి, హస్సేన్, బొమ్మగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

**ప్రజాపక్షం/నడిగూడెం :** బస్ సౌకర్యం కల్పించాలంటూ అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌కు ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పండిటి నవీన్ కుమార్, నమ్రత్, ఉదయ్‌లు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. మండలంలోని కర్విరాల గ్రామంలో ఉన్నటువంటి తెలంగాణ మోడల్ స్కూల్ మారుమూల ప్రాంతంలో ఉండటం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు రాకపోకలకు సమస్య ఎదురవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేనందున ఎక్కువ మంది విద్యార్థులు బస్ సౌకర్యం లేక నడక, సైకిళ్ల ద్వారా పాఠశాలకు, కళాశాలకు వచ్చిపోవడం జరుగుతుందన్నారు. బరాకత్ గూడెం నుండి కర్విరాల గ్రామం వరకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

## కంటైనర్ కింద పడి గొర్రెల కాపరి మృతి



**ప్రజాపక్షం/వేములపల్లి :** కంటైనర్ లారీ అదుపుతప్పి ఇంటి ముందు నిద్రిస్తున్న వ్యక్తిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని బుగ్గబాయిగూడెం గ్రామంలో ప్రమాదం చోటుచేసుకుంది.సోమవారం తెల్లవారుజామున అతివేగంగా వచ్చిన కంటైనర్ లారీ అదుపుతప్పి ఇంటి ముందు నిద్రిస్తున్న వ్యక్తిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడిని బుగ్గబాయిగూడెం గ్రామానికి చెందిన పోలబోయిన వెంకన్న(48)గా గుర్తించారు.వృత్తిరీత్యా గొర్రెల కాపరి అయిన వెంకన్న ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఆరుబయట నిద్రించాడు.సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి చేపల దాణా కోసం చికెన్ వేస్టేజ్‌ను నింపుకొని వస్తున్న కంటైనర్ లారీ బుగ్గబాయిగూడెం వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన నిద్రిస్తున్న వెంకన్నపైకి దూసుకెళ్లింది.భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై అక్కడికి చేరుకునే సరికే వెంకన్న లారీ కింద నలిగి ప్రాణాలు కోల్పోయాడు.స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వేములపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.అతివేగం,డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**గ్రామంలో విషాద ఛాయలు :** కుటుంబానికి ఆధారమైన వెంకన్న అకాల మరణంతో బుగ్గబాయిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నా యి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.గ్రామస్తులు,కుటుంబ సభ్యులు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. రాత్రి వేళల్లో భారీ వాహనాలు అతివేగంగా వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## ఈదురుగాలులకు రహదారిపై కూలిన భారీ వృక్షం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని తిర్మలపూర్ గ్రామంలో ఈదురుగాలుల వర్షానికి గజ్వేల్ భువనగిరి ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేల కూలడంతో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డుపక్కణ్ణే ఉన్న ఇంటి వద్ద ఉన్న వేపచెట్టు అకస్మాత్తుగా కూలి రహదారిపై పడిపోవడంతో ప్రయాణికులు భయానికి గురయ్యారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై చెట్టు కూలే సమయంలో వాహనాలు, ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తుర్కపల్లి పోలీసులు వెంటనే తిరుమలపూర్ కి చేరుకొని,జేసిబి సహాయంతో కూలిన చెట్టును పూర్తిగా తొలగించి, వాహనాల రాకపోకల ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. వర్షాకాలంలో రోడ్డుపక్కన ఉన్న పెద్ద పెద్ద వృక్షాలకింద నిలువకపోవడం మంచిదని, కరెంట్ పోల్స్, భారీ వృక్షాలతో జాగ్రత్తగా ఉండాలని తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ ప్రజలకు సూచించారు.

## 30 లక్షల బస్సు బహూకరణ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు సహాయం చేస్తానని ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ హామీ ఇచ్చారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ పీఎం మోడల్ పాఠశాల , జూనియర్ కళాశాలలకు ఫౌండేషన్ తరపున ఆయన 30 లక్షల విలువచేసే బస్సును బహూకరించారు. ఈ బస్సును సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ స్థానిక అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు భాస్కర్‌కు ఘనమైన స్వాగతం పలికే కృతజ్ఞత సభ ఏర్పాటు చేసి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ కళాశాల ప్రిన్సిపల్ దీప, స్థానిక ఎంఈఓ గోలి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, సర్పంచులు ఉప్పల రమేష్, ఉప సర్పంచ్లు వెలిజాల శ్రీను, బండమీది కిరణ్, ఈఎల్‌వి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు భాద్యతాయుతంగా వ్యవహరించాలని ముఖ్యంగా యువత డ్రగ్స్ ,ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్ 'నషా ముక్త్ భారత్ అభియాన్ వికసిత్ భారత్‌కి సహదాన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ భవిష్యతు యువత చేతుల్లోనే ఉందని మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి గత ఆరోగ్యానికి కాకుండా కుటుంబాలు,సమాజం దేశ అభివృద్ధికి కూడ తీవ్ర ముప్పుగా మారుతుందని అన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి సకాలంలో సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 14446 నేషనల్ డీ అడిక్షన్ హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులో ఉంచిందని అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా లలితాదేవి, డీఆర్‌డిఓ జ్యోతి ,జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి ,రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట శివారులో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా మండల పరిధి సోమ్లా తండాకు చెందిన బానోవత్ రాంసింగ్ (78) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని చిన్న కూతురు రేణుకను టెక్మాల్ మండలం ముత్యాల బంధం తండాకు చెందిన నరేష్ కి ఇచ్చి పెళ్లి జరిపించారు. కొన్ని రోజులుగా కూతురు, అల్లుడు మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. మళ్లీ గొడవ జరగడంతో రేణుక పుట్టింటికి వచ్చింది. ఆదివారం పాపన్నపేటలో అందరి సమక్షంలో రేణుకకు సముదాయించి ఆమె భర్త వద్దకు పంపేందుకు ప్రయత్నించగా రేణుకా అక్కడికి వెళ్ళేందుకు నిరాకరించింది. మనస్తాపం చెందిన రాంసింగ్ ఆదివారం రాత్రి సమయంలో పాపన్నపేట గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించి మృతుడి భార్య మీరి ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్ ఎంఇఒ పద్మ ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 160 ఫిర్యాదులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 160 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, కిరణ్‌కుమార్, భుజంగరావు, శిక్షణ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జడ్పి సీఈఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ సాయన్న, బోధన్ ఎసిపి శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** అచ్చంపేట్‌లో ప్రీ ప్రైమరీ తరగతులను బాన్సువాడ ఆర్‌డిఒ రవీందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ చిన్నారులతో ఆప్యాయంగా మమేకమయ్యారు. అనంతరం నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పలకపై అక్షరాలు దిద్దించి వారి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. బాల్య విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు గ్రామీణ ప్రాంత చిన్నారులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎ.మల్లికార్జున్, తహసీల్దార్ సాయి భుజంగరావు, ఎంపీడీఓ శివకృష్ణ, ఎంఈఓ తిరుపతిరెడ్డి, ఎంపీపీఎస్ అచ్చంపేట్ ప్రధానోపాధ్యాయుడు లాల్‌సింగ్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, పీఆర్‌టీయు అధ్యక్షుడు సంతోష్ కార్యదర్శి సురేంధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రజాపండరి, అచ్చంపేట్ సర్పంచు ఎస్. లక్ష్మయ్య, ఉపసర్పంచు, వార్డుసభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిదులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ పౌరుడు..
# ఓటరుగా నమోదయ్యేలా చర్యలు

'సర్'పై బూత్ లెవెల్ ఏజెంట్లతో
మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశం



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** స్పెషల్ ఇంటిన్సివ్ రివిజన్ పై బూత్ లెవెల్ ఏజెంట్లతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశం నిర్వహించారు. అందోల్ నియోజవకర్గంలో జరగుతున్న స్పెషల్ ఇంటిన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అందోల్, వట్పల్లి, పుల్కల్ చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్న మంత్రి.. ప్రతి ఓటరులో తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొదించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని కోరారు. స్పెషల్ ఇంటీన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రతి ఏజెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని దాని ముఖ్య ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## పకడ్బందీగా భూముల రీ సర్వే

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / లక్ష్మణచాంద :** భూముల రీ సర్వే ను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ లక్ష్మణచాందా మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును పరిశీలించారు. ముందుగా మునిపెల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన రీ సర్వే తీరును కలెక్టర్ ఆధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, సర్వేకు సంబందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాలకు రెవెన్యూ మ్యాపులు లేకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని రీ సర్వే ద్వారా గ్రామాల రెవెన్యూ మ్యాపులు సిద్ధం చేయాలన్నారు. అధునాతణ కొలతల యంత్రాల సామాగ్రిని ఉపయోగించి సర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సర్వే వివరాలను పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. అనంతరం చామన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డిఆర్‌డిఓ రాథోడ్ రమేష్, ఆర్‌డిఒ దేవిదాస్ , తహసిల్దార్ సరిత, డిప్యూటి ఇన్స్‌పెక్టర్ విఠల్‌రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌సి బుద్ధిస్టల డేటా ప్రకటించాలి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వేలో బౌద్ధులుగా నమోదు చేసుకున్న మహర్ ఎస్‌సి బుద్ధిస్టల వివరాలను వెంటనే విడుదల చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ మాట్లాడుతూ, ఓసీ బుద్ధిస్ట్ డేటాను విడుదల చేసిన ప్రభుత్వం, ఎస్‌సి బుద్ధిస్టల వివరాలను దాచిపెడుతూ బౌద్ధులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా వాస్తవ సంఖ్యను కులాల, జిల్లాల వారీగా ప్రకటించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షుడు విట్టల్ బుక్టే, ప్రధాన కార్యదర్శి దయానంద్ పాటఫోడే, నాయకులు కంత్రావు వాగ్మారే, జితేంద్ర, దయానంద్ కంబ్లె, అమ్రపాలి దగ్దే, బేబీ కానిందే, ఉజ్వల ధుడే, మాయావతి పాల్గొన్నారు.

# యువత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించాలి

మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం / నస్పూర్ :** యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే విధంగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణలతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు. జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కాలం పూర్తి అయ్యేసరికి భాషపై పట్టు సాధించి విదేశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలో ఎక్కడ కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. వర్షాకాలంలో దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారులలో మురుగు నీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం నగరంలోని బోధన్ రోడ్డు, ఖిల్లా రోడ్డు, ఫ్రూట్ మార్కెట్, దేవి థియేటర్ చౌరస్తా ఖలీల్‌వాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన మార్గాలలోని డ్రైనేజీలను పరిశీలించి చెత్త చెదారం పేరుకుపోకుండా వెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు జలాలు నిల్వ ఉండకుండా సాఫీగా ముందకు ప్రవహించేలా డ్రైనేజీలపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వానలతో రోడ్లపై ఏర్పడే గుంతలను వర్షాకాలం అనంతరం తక్షణమే పూడ్చివేయించాలని అవసరమైన చోట డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలన్నారు. రూ.70 లక్షలతో మురుగు కాలువల్లో పూడికతీత పనులను కూడా వేగవంతంగా జరిపిస్తున్నామని, అవకాశమున్న చోట జెసిబిల ద్వారా మిగతా చోట్ల పారిశుద్ధ్య కార్మికులతో డీసిల్టింగ్ పనులు జరిపిస్తున్నామని తెలిపారు. వీరి వెంట తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, అంతిరెడ్డి రాజారెడ్డి, షకీల్, అధికారులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రజావాణి అర్జీలను అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. హమాలీల అధిక ధరల నియంత్రణ, ఇందిరమ్మ ఇల్లు, పాస్ పుస్తకం సవరణ, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం సాయం, అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ, చెరువుల ఆక్రమణల తొలగింపు తదితర సమస్యలపై అర్జీదారులు కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేశారు. అనంతరం 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. 29, 30 తేదీల్లో ఇంటింటికి తిరిగి సున్నా నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని, అధికారులు సమన్వయంతో దీనిని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.రాములు, రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు నష్టం కలగకుండా చూడాలి

ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల శాతం పెరగాలి
ఎంఎల్‌ఎ సునీతాలక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్:** ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుతో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని ఎంఎల్‌ఎ సునీతా లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, చిప్పల్ తుర్తి, నాగులపల్లి, ఆద్మాపూర్, రెడ్డిపల్లి గ్రామాలలో ఎంఎల్‌ఏ సునీతా లక్ష్మారెడ్డి ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకురావద్దని సూచించారు. అలా తీసుకువస్తే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వీర్యం అవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలు విజయవంతంగా కొనసాగాలంటే విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రధానోపాధ్యాయుడు రాంబాబును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మధుకర్ రెడ్డి. సర్పంచ్‌లు ఆనంద్, సుధాకర్, సుదీప్, కరుణాకర్, ఎంఇఒ తారా సింగ్, ప్రధానోపాధ్యాయులు రాంబాబు, సిఆర్‌పిలు గోపాల్, భైరవరెడ్డి, గ్రామస్తులు, నాయకులు చంద్రశేఖర్, బిక్షపతి, హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం

ఎమ్మెల్సీ దండే విఠల్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 25వ వార్డులో డ్రైనేజ్, రోడ్డు అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్‌లతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ దండే విఠల్, చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, కౌన్సిలర్ దుర్గం సూరజ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్లు వసీమున్నీసా, ఎమాజీ శారద, కచ్చకాయల జ్యోతి, డిఈ రమాదేవి, ఏఈ నవీన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ధాన్యం డబ్బుల కోసం రోడ్డెక్కిన రైతులు



**ప్రజాపక్షం / ఖానాపూర్ :** ఖానాపూర్ మండల మాస్కాపూర్ గ్రామ రైతులు సోమవారం ఖానాపూర్ నుండి మెట్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి పైన ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ తాము అమ్మిన వడ్లు క్వింటాలుకు 10 కిలోలు రైస్ మిల్లర్లు కట్ చేయడం జరిగిందని, ఆ కట్ చేసిన డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయో తెలపాలని డిమాండ్ చేశారు. 10 కిలోలు కట్ చేయడం ఏంటని ప్రశ్నిస్తూ, వడ్ల కటింగ్ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించాలని రైతు సఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మిన ధాన్యానికి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడితేనే సమ్మె విరమింప చేస్తామని రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుజాతా రెడ్డి ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. రెండు మూడు రోజులలలో డబ్బులు పడని రైతులందరికీ ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండలంలోని రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ నియోజకవర్గంలో గాలివాన బీభత్సం

చెట్ల కొమ్మలు, కరెంటు స్తంభాలు విరిగి
పలు మండలాలకు విద్యుత్ అంతరాయం



**ప్రజాపంక్షం / ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గంలో ఖానాపూర్, పెంబీ, కడం మండలాలలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా కడెం, పెంబీ 33 కేవీ ఫీడర్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఖానాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రామ్‌సింగ్ తెలిపారు. ఖానాపూర్ కడెం మండలాల గ్రామాలైన బీర్నంది, దర్మాజీపేట్ అటవీ ప్రాంతాల్లో బబురీ చెట్లు విద్యుత్ లైన్లపై కూలిపోవడంతో కండక్టర్లు తెగిపోయి ఫీడర్లు దెబ్బతిన్నాయని, దీంతో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విరిగిన చెట్లు, స్తంభాల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. రహదారిపై పడిన చెట్ల కొమ్మలను, తెగిన విద్యుత్ తీగలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నామని, విద్యుత్ దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నందున బీర్నందీ, దర్మాజీపేట్ వైపు గల 33 కేవీ జంపర్‌ను నిలిపివేసి జన్నారం మండలం నుండి 33 కేవీ ఫీడర్ ద్వారా ఇతర సబ్ స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా పునరుద్దరించడం జరిగిందని, ఆయా మండలంలో గల పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు సిబ్బంది పనిచేస్తున్నారరి ఎఇ తెలిపారు.

## 'సర్'లో పౌరుల భాగస్వామ్యం

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో అర్హులైన పౌరులందరూ ఈ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాంలో భాగస్వామ్యం చేయాలని, ఓటరు జాబితాలో తమ పేరును సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు అందరూ సహకరించాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం 25 నుండి జులై 24 వరకు జరుగుతుందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్ కేంద్రానికి ఒక బూత్ ప్రతినిధిని నియమించి వివరాలు అందించాలన్నారు. ఓటరు జాబితాలో పేరు చేర్చడం, తొలగించడం, సవరణలు చేయడం వంటి సేవలను https://voters.eci.gov.in వెబ్ సైట్ ద్వారా లేదా ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

## రేగోడ్‌లో డ్రగ్స్‌పై అవగాహన



**ప్రజాపక్షం/రేగోడ్:** డ్రగ్స్‌తో జరిగే అనర్థాలను వివరిస్తూ.. నివారించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్ఐ పోచయ్య అన్నారు సోమవారం రేగోడ్ మోడల్ పాఠశాలలో డ్రగ్స్‌పై విధ్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంఇఒ గురునాథ్ ప్రిన్సిపాల్ ప్రవీణ, మోడల్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
23-06-2026
www.prajapaksham.in

జ్యూరీ చైర్ పర్సన్ ఇంద్రజ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సుమారు అరవై సినిమాలు ఎంట్రీకి వచ్చాయి. జ్యూరి చూసిన తరువాత అవార్డుకు సినిమాలను ఎంపిక చేశారు. ఉత్తమ షార్ట్ ఫిలింగా - శీనుగాడి సైకిల్ స్టోరీ, సెకండ్ బెస్ట్ షార్ట్ ఫిలింగా సైబర్ స్లేవరీ, థర్డ్ బెస్ట్ షార్ట్ ఫిలింగా ఎంపికయ్యాయి.

రీల్

## టిఎఫ్‌సిసి ఉత్తమ షార్ట్ ఫిలిం
# 'శీనుగాడి సైకిల్ స్టోరీ'

**రెండవ ఉత్తమ షార్ట్ ఫిలింగా సైబర్ స్లేవరీ మూడవ ఉత్తమ షార్ట్ ఫిలింగా మాతృదేవోభవ ఘనంగా ముగిసిన షార్ట్ ఫిలిం ఫెస్టివల్ తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో షార్ట్ ఫిలింస్**



జ్యూరీ చైర్ పర్సన్ ఇంద్రజ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సుమారు అరవై సినిమాలు ఎంట్రీకి వచ్చాయి. జ్యూరి చూసిన తరువాత అవార్డుకు సినిమాలను ఎంపిక చేశారు. ఉత్తమ షార్ట్ ఫిలింగా శీనుగాడి సైకిల్ స్టోరీ, సెకండ్ బెస్ట్ షార్ట్ ఫిలింగా సైబర్ స్లేవరీ, థర్డ్ బెస్ట్ షార్ట్ ఫిలింగా ఎంపికయ్యాయి. ఈ మూడు షార్ట్ ఫిలిమ్స్ కు అవార్డుతో పాటు రివార్డులను కూడా చైర్మన్ ప్రధాని రామకృష్ణ గౌడ్ అందజేశారు. ఈ ఫెస్టివల్ అవార్డు కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తామని, వచ్చే ఏడాది ఉత్తమ చిత్రానికి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రము ఏర్పడిన పన్నెండేళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మీడియాకు కూడా అవార్డులను అందజేశారు. ఉత్తమ జర్నలిస్ట్ (ప్రింట్ మీడియా) వినాయక రావు ఆంధ్రజ్యోతి, ఎం. లక్ష్మి నారాయణ (ప్రజాపక్షం), ఉత్తమ ఫొటో జర్నలిస్ట్ భూషణ్ (మన తెలంగాణ),ఉత్తమ జర్నలిస్ట్ (ఎలక్ట్రానిక్ మీడియా) సతీష్ ఈటీవీ 2,ఉత్తమ కెమెరామెన్ సమద్ పాషా (10టీవీ), ఉత్తమ వీడియో జర్నలిస్ట్ నాగరాజు యాదవ్, ఉత్తమ జర్నలిస్ట్ (డిజిటల్ మీడియా) రాజబాబు, ఉత్తమ ఫిలిం మేగజైన్ (బాక్సాఫీస్) చందు రమేష్,ఉత్తమ ఫిలిం ఈపేపర్ విజయ్ లను అవార్డులతో ఘనంగా సన్మానించారు. అనంతరం టిఎఫ్‌సిసి చైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి 12ఏళ్లైన సందర్భంగా టిఎఫ్‌సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026'నిహించాలని ముందుకొచ్చాం. అవార్డ్స్ ప్రకటించిన 15 రోజుల్లోనే విజయవంతంగా కార్యక్రమం నిర్వహించగలిగాం. దాదాపు 60కి పైగా ఎంట్రీలు వచ్చాయి. జ్యూరీ చైర్ పర్సన్ ఇంద్రజ ఎంట్రీలను శ్రద్ధగా పరిశీలించి, ప్రతి షార్ట్ ఫిలింను చూసి విజేతలను ఎంపిక చేశారు. ఈ ఏడాది ముందుగా ప్రకటించిన దానికంటే మరింత నగదు బహుమతి జోడించి, మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి 15 వేలు, మూడవ బహుమతి 10వేలు అందించాము. వచ్చే ఏడాది మొదటి బహుమతిని లక్ష రూపాయలు, రెండవ బహుమతి 50వేలు, మూడవ బహుమతి 25వేలు అందిస్తాం. అవార్డ్స్‌కు ఎంపిక కాని వారు బాగా చేయలేదని కాదు, వారు కూడా బాగా చేశారు అయితే అవార్డ్స్ కొందరికే ఇవ్వగలం. తెలంగాణ ఫిలిం ఛాంబర్ తరుపున ఫిలిం స్కూల్ కూడా పెట్టబోతున్నాం అన్నారు. జ్యూరీ చైర్ పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేయాలని మంచి ఉద్దేశంతో రామకృష్ణ గౌడ్ 'టిఎఫ్‌సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 విజేతలు కాని వారు కూడా ఏం తక్కువ కాదు. ఇది చాలా పెద్ద బాధ్యతగా ఫీలయ్యాను. కానీ ఇలాంటి పెద్ద వేదిక ఉంటే ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయి. దక్కిన గుర్తింపు, సంపాదన అంతా ఇండస్ట్రీ ఇచ్చి ందే. ఎస్ బీఐ బ్యాంక్ బోర్డ్ మెంబర్ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ఫిలిం ఛాంబర్ స్థాపించి ఎంతోమంది స్థానిక కళాకారులను, సాంకేతిక నిపుణులను రామకృష్ణ గౌడ్ ప్రోత్సహిస్తున్నారు. ఈ టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 కార్యక్రమం ద్వారా యంగ్ టాలెంట్ కు అవకాశాలు కల్పించే ప్రయత్నం చేయడం అభినందనీయం అన్నారు. టీమా ప్రెసిడెంట్ రష్మి ఠాకూర్ మాట్లాడుతూ రామకృష్ణ గౌడ్ ఎ ప్పుడూ కొత్త కొత్త కార్యక్రమాలతో ముందుకు వస్తుంటారు. ఈ సారి మేమంతా ఆశ్చర్యపోయేలా చేశారు. 'టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026' కార్యక్రమం ఏటా మరింత మందికి రీచ్ కావాలి. ఇంద్రజ లాంటి అనుభవం గల హీరోయిన్ ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్‌గా ఉండి విజేతలను సెలెక్ట్ చేయడం హ్యాపీగా ఉంది అన్నారు. హైకోర్టు అడ్వకేట్ సుభాష్ రెడ్డి, సుప్రీంకోర్టు అడ్వకేట్ , నిర్మాత షరీఫ్, హీరోయిన్ అక్సఖాన్, టిఎఫ్ సిసి వైస్ ప్రెసిడెంట్ గురురాజ్, ఫైట్ మాస్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ షూటింగ్‌లో
# వెంకటేష్ -అనిల్ చిత్రం



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. షైన్ స్క్రీన్స్' బ్యాన్స సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్ , కళ్యాణ్ రామ్ సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.తాజాగా, హైదరాబాద్లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయినట్టు చెప్పారు. ఈ విషయాన్ని ఒక ఫన్ వీడియో ద్వారా వెల్లడించారు.సినీ పరిశ్రమలో ప్రమోషన్ల విషయంలో కొత్త ట్రెండ్ను సెట్ చేస్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి, మరోసారి తన క్రియేటివిటీని చాటుకున్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, ఈసారి కూడా అలాంటి కాన్సెప్ట్‌తోనే ముందుకొచ్చారు.వీడియోలో అనిల్ రావిపూడి తన టీమ్తో మాట్లాడుతూ, అభిమానులు తన ప్రమోషన్లను ఎంతగా ఇష్టపడతారో సరదాగా గుర్తుచేసుకున్నారు. సినిమా కథ రాయలసీమ నేపథ్యంలో సాగుతుందని, అయితే పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా ప్రేక్షకులను అలరిస్తుందని మేకర్స్ స్పష్టం చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మి రాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రం సంక్రాంతి 2027 సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# 'ది రెడ్ బ్యాగ్' టీజర్ విడుదల

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మాణంలో రవి కుమార్ సీరపు తెరకెక్కించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. 'ది రెడ్ బ్యాగ్' టిజర్‌ను ఎపి ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టిజి భరత్ రిలీజ్ చేశారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ ది రెడ్ బ్యాగ్' టీజర్ అద్భుతంగా ఉంది. మా కర్నూలు నుంచి వచ్చిన హరి తీసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. మా రెడ్ బుక్ గురించి ఇండియా వ్యాప్తంగా తెలుసు. అలానే ఈ 'ది రెడ్ బ్యాగ్' మూవీ కూడా ఇండియా అంతా సౌండ్ చేయాలి. కర్నూలులోనే అత్యధిక భాగంగా షూటింగ్ చేశారు. కానీ ఫారిన్లో తీసినట్టుగా కనిపిస్తోంది. సినిమా టీంకి ఆల్ ది బెస్ట్. ఈ చిత్రం మంచి విజయం సాధించి మా హరికి డబ్బులు బాగా రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ప్రముఖ దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి, దర్శకుడు రవి కుమార్ సీరపు, నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి , రాధ్య, ఆకాంక్ష, మోనిక, డైరెక్టర్ అభిషోర్ , లిరిక్ రైటర్ తిరుపతి , రైటర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

## అమ్మో ఒకటో తారీఖు తరువాత కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రం
## ఎల్‌జిబిటి లీగల్ బ్యాటిల్ సక్సెస్ మీట్‌లో నటుడు ఎల్ బీ శ్రీరామ్



సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిలిమ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా ఎల్ జి బి టి ఏ లీగల్ బ్యాటిల్. ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, పాత్ర పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్ గా చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ ట్రాన్స్ జెండర్ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ నటించారు. ఎల్ జి బి టి ఏ లీగల్ బ్యాటిల్ సినిమా 19న విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు ఎల్‌బి శ్రీరామ్ మాట్లాడుతూ ఈ సినిమాతో సునీల్ కుమార్ రెడ్డి ఒక చరిత్ర సృష్టించారు. గే, ట్రాన్స్ జెండర్ సమస్యలు చెబుతూ వచ్చిన ఫస్ట్ సినిమా ఇదే. ఆ తర్వాత ఎన్ని చిత్రాలు వచ్చినా దీని తర్వాతే. శంకరాభరణం సినిమా ఒక చరిత్ర సృష్టించింది. ఈ అర్ధనారీశ్వర సినిమా మరో చరిత్ర సృష్టించబోతోంది. ఈ సినిమాను సింగిల్ స్క్రీన్స్, మల్టిప్లెక్స్‌లో చూశాను. అన్ని వర్గాల ప్రేక్షకులు చూసేందుకు వస్తున్నారు. ఈ 'ఎల్ జి బి టి ఏ లీగల్ బ్యాటిల్' సినిమా కూడా అలాగే గుర్తుండిపోతుంది అన్నారు. డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా రూపొందించడం వెనక ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ట్రాన్స్ జెండర్స్ విషయంలో ఉన్న వివక్ష తొలగిపోవాలని, వారికీ సమానత్వం ఉండాలని చెప్పేందుకు ఈ 'ఎల్ జి బి టి ఏ లీగల్ బ్యాటిల్' సినిమాను రూపొందించాను. సినిమా ప్రదర్శితమవుతున్న అన్ని థియేటర్స్ లో మంచి రెస్పాన్స్ రావడం హ్యాపీగా ఉంది. మా మూవీని మరింతగా ఆదరించాలి, ఈ సినిమాతో సొసైటీలో ఒక మంచి మార్పునకు అడుగుపడాలని కోరుకుంటున్నా అన్నారు.ట్రాన్స్ జెంటర్ ఇన్ స్టాగ్రామ్ యాక్టివిస్ట్ హీరోయిన్ హిమ రాథోడ్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా మా 'ఎల్ జి బి టి ఏ లీగల్ బ్యాటిల్' సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇంత రెస్పాన్స్ ప్రేక్షకుల నుంచి వస్తుందని ఊహించలేదు. నేను సునీల్ కుమార్ రెడ్డి ఇచ్చిన అవకాశంతో ఈ సినిమాలో హీరోయిన్ గా నటించాను. మేము మా జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను నా పాత్ర ద్వారా దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి చూపించారు. ఈ సినిమాను మరింతగా సక్సెస్ చేయాలని కోరుతున్నా అన్నారు.నటుడు ఆనంద చక్రపాణి , గే కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు , నటుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

## 25న 'హనుమాన్ 3డి' వస్తోంది



హీరో తేజ సజ్జ నటించిన సినిమా హనుమాన్. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ప్రైమెషో ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా 2024లో విడుదలై రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో పాన్ ఇండియా ఘన విజయాన్ని సాధించింది. ఈ చిత్రాన్ని జూన్ 25న హనుమాన్ 3 రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ 3 ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో సాయి దుర్గ తేజ్ ఈ వేడుకకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. దయచేసి మీరందరూ జూన్ 25న థియేటర్లకు వచ్చి సినిమా చూడండి. ఈ సినిమాలో చివరి 20 నిమిషాలు నాకు మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంటుంది అన్నారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ థియేటర్లలో ఈ టీమ్‌ని మళ్లీ కలవడం ఒక రీయూనియన్‌లా అనిపించింది. సాయి దుర్గ తేజ్ , నిరంజన్ కాంబినేషన్లో వస్తున్న సంబరాల ఏటిగట్టు చిత్రానికి ఆల్ ది బెస్ట్. ఆ సినిమాపై మంచి క్రేజ్ ఉంది. జూన్ 25న హనుమాన్ 3డి విడుదలవుతోందని చెప్పారు. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాత చైతన్య రెడ్డి కిరణ్, హీరోయిన్ అమృత అయ్యర్ , సంగీత దర్శకుడు గౌర హరి పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## 22 నుంచి 26 వరకు 'యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్' కార్యక్రమాలు : డిజిపి సి.వి. ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడగలిగితేనే దేశానికి బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని డిజిపి సివి ఆనంద్ పేర్కొన్నారు. డ్రగ్స్‌పై డిమాండ తగ్గితేనే సరఫరా కూడా తగ్గుతుందని స్పష్టం చేసిన ఆయన, మాదకద్రవ్యాల నియంత్రణలో సమాజమంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కమాండ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జూన్ 22 నుంచి 26 వరకు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, సామాజిక సంస్థల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డిజిపి తెలిపారు. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం, పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశం తీవ్రవాదం, మావోయిజం వంటి సవాళ్లను అధిగమించినప్పటికీ ప్రస్తుతం ప్రతి కుటుంబాన్ని ప్రభావితం చేస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ అని డీజీపీ పేర్కొన్నారు. కోవిడ్ అనంతరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని, డ్రగ్స్‌కు అలవాటుపడిన విద్యార్థులు తమ స్నేహితులను కూడా అదే బాటలోకి తీసుకెళ్తున్నట్లు దర్యాప్తుల్లో వెల్లడైందన్నారు. కొంత మంది చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు వంటి వస్తువుల ద్వారా డ్రగ్స్‌కు అలవాటు చేస్తున్నారని, ఇది దేశద్రోహానికి సమానమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. నషాముక్త భారత్ – నషాముక్త తెలంగాణ లక్ష్యాన్ని 2029 నాటికి సాధించాలని పిలుపునిచ్చారు. ఇడి హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ భరాల మాట్లాడుతూ విదేశాల నుంచి వచ్చే పార్సిళ్ల ద్వారా మాదకద్రవ్యాల రవాణా పెరుగుతోందని తెలిపారు. డిఆర్‌ఐ అదనపు డైరెక్టర్ జనరల్ కొండూరు ప్రసాద్ మాట్లాడుతూ కొన్ని రకాల డ్రగ్స్‌కు రంగు, రుచి ఉండవని, వాటి ప్రభావం 48 గంటల వరకు కొనసాగుతుందని విద్యార్థులను హెచ్చరించారు.

కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అజాజుద్దీన్ ఐఆర్‌ఎస్, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా, ఈడీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ భరాల, ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు. పంజాగుట్ట, రసూల్‌పుర, బేగంపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు సెయింట్ మేరీస్ కాలేజ్, టీకేఆర్ ఫార్మసీ హాజరయ్యారు.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డుప్రమాదం

**చింద్వారా:** మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న పికప్ వ్యాన్‌ను ట్రక్కు ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు మృతిచెందగా, 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. చింద్వారా–బేతుల్ జాతీయ రహదారిపై టెమ్ని గ్రామం దగ్గర సోమవారం ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పికప్ వ్యాన్‌ను డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి వేరొకరితో మాట్లాడుతుండగా, వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు ఢీకొట్టడంతో ఘటన చోటుచేసుకున్నట్లు ఎస్పి అజయ్ పాండే వెల్లడించారు. స్థానికుల కథనం ప్రకారం..ట్రక్కు వెనుక టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తాపడిందన్నారు. గాయపడినవారిలో ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉందని అదనపు ఎస్పి ఆశిష్ ఖేర్ తెలిపారు. ఘటనపై సిఎం మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, బాధితులకు పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు 4 లక్షల రూపాయల చొప్పున, తీవ్రంగా గాయపడ్డవారికి లక్ష రూపాయల చొప్పున, స్వల్పంగా గాయపడ్డవారికి 50 వేల రూపాయల చొప్పున ప్రకటించారు.

## హత్యా.. ఆత్మహత్యా..

(మొదటి పేజీ తరువాయి)

కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో వారు నాలుగు రోజుల క్రితమే మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.కుటుంబ సభ్యుల్లో మరో వ్యక్తి కనిపించకపోవడంతో ఈ ఘటన మరింత మిస్టరీగా మారింది.ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించగా నలుగురి మృతదేహాలు బయటపడ్డాయి.స్థానికుల వివరాల ప్రకారం హసీనా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా,సుల్తాన్ ప్రకాశం బజార్‌లో బ్యాగుల వ్యాపారానికి సంబంధించిన పనులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.సమాచారం అందుకున్న జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు.మృతికి గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇది హత్యా, ఆత్మహత్యా, లేక



ఇతర కారణాల వల్ల జరిగిందా అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. కుటుంబంలో కనిపించకుండా ఉన్న వ్యక్తి ఆచూకీ కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు.పోస్టుమార్టం నివేదికలు,ఫోరెన్సిక్ విశ్లేషణ అనంతరం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.ఈఘటన నల్లగొండ పట్టణంలో తీవ్ర విషాదాన్ని, సంచలనాన్ని రేకెత్తించింది.

## భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వెనుక వైపుకు పరుగెత్తినట్లు తెలుస్తోంది... కానీ వారు ప్రాణాలతో బయటపడలేకపోయారు. మృతుల సంఖ్యపై స్పష్టత లేనప్పటికీ, 11–12 మృతదేహాలను చూశాను' అని ఘటనా స్థలంలో ఉన్న ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ విలేకరులతో అన్నారు. అనంతరం, ఈ అగ్నిప్రమాదంలో 14 మంది విద్యార్థులు మరణించారని, గాయపడిన మరో నలుగురిని కెజిఎంయు ట్రామా సెంటర్‌కు తరలించారని ఆయన తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ సందర్భంగా మంటల్లో చిక్కుకున్న 11 మందిని భవనం నుంచి బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరిని బాడీ బ్యాగుల్లో తీసుకువెళ్లగా, మరి కొందరిని దుప్పట్లలో చుట్టి తీసుకువచ్చారు. ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పిఎంఎన్ఆర్‌ఎఫ్ నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తారు. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అలీగఢ్‌లో తన పర్యటనను కుదించుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సంతాపం తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకుని నివేదిక సమ ర్పించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఈ భవనం అలీగంజ్ అనే ఉన్నత శ్రేణి నివాస ప్రాంతంలో ఉంది. ఇక్కడ కోచింగ్ సెంటర్లు, కేఫ్‌లతో సహా అనేక వాణిజ్య సముదాయాలు ఉన్నాయి పెంపుడు జంతువుల క్లినిక్ లోని జంతువులు ఈ మంటల్లో చిక్కుకుని ఉండవచ్చని జంతు హక్కుల కార్యకర్త కిరణ్ శుక్లా ఆందోళన వ్యక్తం చేశారు. సాయంత్రం 4.40 గంటల ప్రాంతంలో దుప్పటిలో చుట్టిన కనీసం మూడు జంతువుల మృతదేహాలను భవనం నుండి బయటకు తీసినట్లు పటిఐ ప్రత్యక్షంగా చూసింది. సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారని, సమీపంలోని అగ్నిమాపక కేంద్రాల నుండి వాటర్ టెండర్లు, అగ్నిమాపక పరికరాలతో బృందాలను హుటాహుటిన పంపించారని ఒక పోలీసు అధికారి తెలిపారు. అనంతరం, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పౌర రక్షణ బృం దాలు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నాయి. ఏడు నుంచి ఎనిమిది మంది విద్యార్థులు తమను తాము రక్షించుకోవడానికి భవనం నుంచి దూకారు. అయితే, సుమారు 20 నుంచి 25 మం ది విద్యార్థులు ఇంకా లోపలే చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. అగ్నిమాపక, సహాయక చర్యలు జరుగుతుండగానే, బాధితుల సంరక్షకులు, బంధువులని భావిస్తున్న కొందరు ఆ భవనం వద్ద నిలబడి, తమను లోపలికి అనుమతించాల్సిందిగా అధికారులను కోరడం కనిపించింది.

## 30న రైతు ఆశీర్వాద సభ

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ రైతాంగ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మధిర శాసన సభ నియోజక వర్గ చరిత్రలోనే మునుపెన్నడు లేని విధంగా ఒక చారిత్రిక సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మధిర నియోజక వర్గంలో ఏర్పాటవుతున్న సభ ఇది అని ఆయన తెలిపారు. సభకు ముందు 28, 29 తేదీల్లో వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, శాస్త్రీయత తదితర విషయాలకు సంబంధించి 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలాది మంది రైతులకు అనేక విషయాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి బూత్ నుంచి వంద మంది జనాభాకు ఒకరిని ఇంచార్జ్‌గా నియమించి ఖచ్చితమైన జాబితాను ఫోన్ నెంబర్‌తో సహా సిద్ధం చేయాలని ఆయన సూచించారు. సభ పకడ్బందీగా నిర్వహించేందుకు ఆరు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పోలీస్ వ్యవస్థ పైనే భారం వేయకుండా ముఖ్య నాయకులను గుర్తించి గౌరవంగా వేదికపైకి ఆహ్వానించేందుకు ప్రత్యేక వాలంటీర్లను గేట్ల వద్ద నియమించాలని ఆయన సూచించారు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను మరోసారి రుజువు చేయాలన్నారు.

స్థల పరిశీలన కార్యక్రమంలో వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్, కార్పొరేషన్ ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయు డు సత్యనారాయణ, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, చింతకాని మండల అధ్యక్షులు కన్నెబోయిన గోపి, మండల మహిళా అధ్యక్షురాలు తోటకూ రి ప్రగతి, సర్పంచ్ తాళ్లూరి స్వప్న, నియోజక వర్గం లోని పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాటాపై రాజీపడం

(మొదటి పేజీ తరువాయి)

ఇఎన్‌సి రమేష్ బాబు , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌డిఎస్ ఆయకట్టు పరిరక్షణ రాజోలి బండ డైవర్షన్ స్కీమ్‌లో (ఆర్‌డిఎస్) తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఆర్‌డిఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. అంతర్రాష్ట్ర వేదికలపై తెలంగాణ వాదనను అత్యంత బలంగా వినిపించేందుకు ఒక స్పష్టమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు.ఎగువ రాష్ట్రాలు తీసుకునే ఏకపక్ష చర్యల వల్ల తెలంగాణ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. కృష్ణా పరివాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, తెలంగాణకు దక్కాల్సిన వాటా నీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.తెలంగాణ రైతుల హక్కులు, సాగు నీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై రాజీలేని పోరాటం చేస్తుందని, అన్నదాతల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

## ముట్టడి.. ఉద్రిక్తత..

(మొదటి పేజీ తరువాయి)

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మ ణ్‌లు మాట్లాడుతూ
రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు తగ్గిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణం అమలు చేస్తూ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా సాగుతున్న ఫీజుల దోపిడిని అరికట్టాలని, విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించి, వారికి ఉచిత విద్యను అందించాలన్నారు. రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విద్య బలోపేతం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆరుట్లలో ప్రారంభం చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను రాష్ట్రమంతా నిర్మాణాలు చేయాలన్నారు. బిజెపి ఎంఎల్‌సి పాఠశాల ప్రారంభోత్సవానికి పోయి సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా ప్రోత్సహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తమిళనాడు మాదిరిగా తెలంగాణలో ఫీజుల దోపిడీ అరికట్టాలని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై ఎసిబి ,ఐటీ తనిఖీలు నిర్వహించి విద్యార్థుల తల్లితండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేసిన సొమ్మును కక్కించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి విద్యార్థుల, పేదల పక్షాన నిర్ణయాలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు స్పష్టం చేశారు.అరెస్ట్ అయిన వారిలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యార నరేష్, రఘురాం నాయక్, రెహమాన్, బాలసాని లెనిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, శాంతి కుమార్, దత్తు రెడ్డి, అన్వర్, అనిల్, ఆకాష్ తదితరులు ఉన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com